# ఆంధ్రప్రదేశ్ శాసన సభ కార్యకలాపాలు

# ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY DEBATES

అధికార నివేదిక

OFFICIAL REPORT

సోమవారం, సెప్టెంబర్ 1, 2014

**MONDAY, THE 1st SEPTEMBER, 2014**

14వ శా.స. 2 వ సమావేశం, వాల్యూం-3 నంబరు-4

**14TH L.A. II – SESSION, VOL-3 NO.-4**

శక సంవత్సరం-1936, భాద్రపద-10

**10- Bhadrapada, 1936 – S.E.**

శాసన సభ సచివాలయం

పబ్లిక్ గార్డెన్స్

హైదరాబాదు- 500 004.

**LEGISLATURE SECRETARIAT**
**PUBLIC GARDENS, NAMPALLY**
**HYDERABAD - 500 004.**

# ఆంధ్రప్రదేశ్ శాసన సభ

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | : | డా. కోడెల శివప్రసాదరావు |
| ఉప సభాపతి | : | శ్రీ మండలి బుద్ధప్రసాద్ |
| కార్యదర్శి(ఇంచార్జ్) | : | శ్రీ కె.సత్యనారాయణ రావు |
| ఉప కార్యదర్శులు | : | శ్రీ పి.బాలకృష్ణమాచార్యులు<br>శ్రీ ఎం. విజయరాజు |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ పి.వి.సుబ్బారెడ్డి<br>శ్రీ కె.రాజకుమార్<br>శ్రీమతి ఆర్.వనితారాణి<br>శ్రీ పి.నరసింహ<br>శ్రీ బి.కమలాకర్<br>డా.వై.కామేశ్వరి<br>శ్రీ ఇ. సంజీవరావు<br>శ్రీ కె.వెంకటేశ్వరరావు<br>శ్రీ డి.జగన్‌మోహన్‌రావు<br>శ్రీ బి.ప్రభాకర్‌రావు |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ శ్రీనివాస్ అల్లాడి |

---

# ఆంధ్రప్రదేశ్ శాసనసభ చర్చలు

## అధికార నివేదిక

**(14వ శాసన సభ)**
**(రెండవ సమావేశము : పదవ రోజు )**

**సోమవారం, సెప్టెంబర్ 1, 2014**
**సభ ఉ.గం.09.00.లకు ప్రారంభమైనది**
**(గౌ. సభాపతి అధ్యక్ష స్థానములో ఉన్నారు)**

--------------

## విషయ సూచిక


| | | | పుట సంఖ్య |
|---|---|---|---|
| 1. | సభ సమావేశం (ఉ.గం.9.00.) | ..... | 5 |
| 2. | నక్షత్రపు గుర్తు గల ప్రశ్నలు మరియు సమాధానాలు | ..... | 5-39 |
| 3. | డిమాండ్స్ ప్రవేశపెట్టుట - చర్చ | ..... | 39-41 |
| 4. | శ్రీ బాపు గారి మృతిపై - సంతాప తీర్మానం - చర్చ | ..... | 41-48 |
| 5. | ప్రివిలెజ్ మోషన్ ప్రతిపాదన | ..... | 48&49 |
| 6. | ఆర్థిక పద్దుల (డిమాండ్స్)పై చర్చ కొనసాగింపు | ..... | 49-94 |
| 7. | సభా వాయిదా | ..... | 94 |

**ఆంధ్రప్రదేశ్ శాసనసభ**

**హైదరాబాదు.**

**సెప్టెంబర్, 1వ తేది సోమవారం 2014**

**(సభ ఉ. 9 గం.లకు సమావేశం అయినది. గౌరవ సభాపతి అధ్యక్ష స్థానం వహించారు.)**

* * *

**నక్షత్రపు గుర్తు ప్రశ్నలు మరియు సమాధానాలు**

**మిస్టర్ స్పీకర్ : ప్రశ్న నెంబరు.181.**

**ప్రశ్న నెంబరు. 181 (81)**

**( సభ్యులు సర్వశ్రీ )**

**డా.పెద్దిరెడ్డి గారి రామచంద్రారెడ్డి,**
**పీడిక రాజన్నదొర,**
**ఉప్పులేటి కల్పన,**
**చెవిరెడ్డి భాస్కర రెడ్డి,**
**గడికోట శ్రీకాంత్ రెడ్డి.**

**గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా.**

ఎ) వ్యవసాయానికి 9గంటలు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేయడానికి ప్రభుత్వం వద్ద ఏదైనా ప్రతిపాదన ఉందా ?

బి) అయితే, ఎప్పటి నుండి ఉచిత విద్యుత్ సరఫరాను అమలుపరచడంమవుతుంది?

సి) ఈ విషయంలో ప్రభుత్వం ఏవైనా ప్రణాళికలను రూపొందించిందా?

డి) అయితే, ఆ వివరాలేమిటి ?

మిస్టర్ స్పీకర్ : మంత్రిగారు.,

**గౌరవ ముఖ్య మంత్రి తరఫున (మంత్రి శ్రీ పల్లె రఘునాథరెడ్డి ) గారి సమాధానం**

ఎ) అవునండి

బి) మునుపటి అస్థిర, కాల, అద్వాన్న నాణ్యతగల సరఫరాకు గాను వ్యవసాయానికి హామీ ఇచ్చిన 7 గంటల విద్యుత్ సరఫరాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే అమలు పరచింది. దశల వారిగా దీనిని 9 గంటలకు పెంచడం జరుగుతుంది.

సి) అవునండి.

డి) ఇతర విషయాలతోపాటుగా ఈ విషయంలో ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. ఇందులో తదుపరి సంవత్సరానికి అంటే 2015-16వ సంవత్సరానికి 2000 మెగావాట్ల విద్యుత్‌ను దీర్ఘకాలిక ప్రాతిపదికపై అంటే 2016 on wards for a period of 25years. 2400 మెగావాట్ల విద్యుత్‌ను 500మెగావాట్ల సౌరవిద్యుత్‌ను తదుపరి ఒక సంవత్సరం లోపల అంటే 2014-15 సంవత్సరం లోపల 2700మెగావాట్ల అదనపు సామర్థ్యానికి చేర్చడం ద్వారా వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ సరఫరాను అందించేందుకు అవసరమైన ట్రాన్స్‌మిషన్ పంపిణీ నెట్‌వర్క్‌ను పటిష్టపర్చడం వంటి చర్యలు చేర్చి ఉన్నాయి.

మిస్టర్ స్పీకర్ : పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గారు.

డా.పెద్దిరెడ్డి గారి రామచంద్రారెడ్డి (పుంగనూరు) : అధ్యక్షా ప్రశ్న నెంబరు.బికి మంత్రి గారు సమాధానం చెబుతూ దశల వారిగా దీనిని 9గంటలకు పెంచడం జరుగుతుంది అని చెప్పి చెప్పడం జరిగింది. కానీ ఎన్నికల ప్రణాళికలో 9గంటలు ఉచిత విద్యుత్ ఇస్తామని వారు నిర్థిష్టంగా చెప్పడం జరిగింది. మా కాబోయే ముఖ్యమంత్రి గారు పెట్టే మొదటి నాలుగు సంతకాలు, అయిదు సంతకాలలో ఈ సంతకం కూడా ఒకటి అని చెప్పడం జరిగింది. గతంలో రాజశేఖరరెడ్డి గారు రైతులకు చెప్పినట్లు 7గంటలు ఉచిత విద్యుత్ సరఫరా చేసేందుకు మొదటి సంతకం చేయడం జరిగింది. అదే విధంగా ఈ ప్రభుత్వం కూడా చేస్తుందని రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. మేము నిర్థిష్టంగా జవాబు చెప్పమని మంత్రిగారిని అడుగుతున్నాను. 9 గంటలు విద్యుత్ సరఫరా చేస్తే అదనంగా సబ్సిడీ ఎంత అవుతుంది? మీ బడ్జెట్ కేటాయింపులు చూస్తే రైతులకు 7గంటలైనా విద్యుత్ సరఫరా చేస్తారా లేదా అనే అనుమానం కలుగుతుంది. అదే విధంగా ఇప్పటికే లక్షమందికి పైగా రైతులు కొత్త కనెక్షన్స్ కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఈ కనెక్షన్స్ ఎప్పటిలోగా ఇస్తారు? ఇచ్చే విషయమే అయితే, గత సంవత్సరానికి లక్ష కనెక్షన్స్ ఇస్తున్నారా? ఎన్ని కనెక్షన్స్ ఇస్తున్నారా ? ఎప్పటిలోగా ఇస్తారు.

నిర్ధిష్టంగా చెప్పాలని కోరుతున్నాను. మూడవదేమనగా ప్రస్తుతం ఉన్న వ్యవసాయ పంప్‌సెట్స్‌కు బదులుగా ఐఎస్ఐ మార్కు పంప్‌సెట్లను రైతులందరికీ పంపిణీ చేస్తామని ముఖ్యమంత్రి గారు చెప్పడం జరిగింది. అయితే దీనిమీద ఒక్కొక్క రైతులకు ఒక్కొక్క పంప్‌సెట్‌కు ఎంతెంత కేటాయింపు చేస్తుంది. ఎంతమేర ఆర్థిక సహాయాన్ని ఎప్పటిలోగా అందిస్తుందో చెప్పాల్సిందిగా మంత్రిగారిని కోరుతున్నాను.

విద్యుత్ సరఫరా పంపిణీ వ్యవస్థలను ప్రైవేటీకరణ చెయ్యాలని ఈ ప్రభుత్వ యోచిస్తున్నట్లు తెలిసింది. అలాంటి ప్రతిపాదనలేమైనా ప్రభుత్వం వద్ద ఉన్నాయా ? మంత్రి గారు దయచేసి చెప్పాలని కోరుతున్నాను. మీరు 9 గంటలు ఉచిత విద్యుత్ ఇస్తామన్నారు. మొదటి సంతకం పెడతామన్నారు. ఇది చాలా సున్నితమైన సమస్య నేను కాంట్రవర్సీలోకి వెళ్లడం లేదు. ఇప్పుడు దశల వారిగా అమలు చేస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసమో మంత్రిగారిని సవివరంగా తెలియజేయవల్సిందిగా కోరుతున్నాను.

(ఈ దశలో ప్రధాన ప్రతిపక్ష నాయకులు తమ స్థానంలోకి వచ్చారు)

మిస్టర్ స్పీకర్ : మంత్రిగారు.

శ్రీ పల్లెరఘునాథ రెడ్డి (పుట్టపర్తి): అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి సారథ్యంలో ఈ రాష్ట్ర ప్రభుత్వం గృహ, వ్యాపార, పారిశ్రామిక వినియోగదారులకు 24 x 7 గంటలు నాణ్యమైన విద్యుత్ అందించడానికి వ్యవసాయదార్లకు 7 గంటలు ఉచిత విద్యుత్ అందిస్తూ దశల వారీగా ఈ వ్యవధిని 9 గంటలకు పెంచడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. భారత ప్రభుత్వం ప్రకటించిన ''పవర్ ఫర్ ఆల్" అందరికీ విద్యుత్ కార్యక్రమం కింద సెలక్ట్ చేసిన మూడు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ కూడా ఒకటి అని చెప్పడానికి నేను గర్వపడుతున్నాను.

గతంలో కాంగ్రెస్‌పార్టీ రాష్ట్రంలో, కేంద్రంలోనూ అధికారంలో ఉన్నప్పుడు 33 మంది పార్లమెంట్ సభ్యులు, 10 కేంద్రమంత్రులు ఉన్నప్పటికీ కూడా కేంద్ర ప్రభుత్వం నుండి సహాయం పొందలేక పోయారు. గౌరవనీయులు చంద్రబాబు నాయుడు గారి సారథ్యం వలన వారి చాకచక్యం వలన ఈ రోజు " పవర్ ఫర్ ఆల్" అనే కార్యక్రమం తీసుకువచ్చాము.

( ఈ సందర్భంలో అధికార పార్టీ సభ్యులు బల్లలు చరిచారు )

అక్టోబర్ 2వ తేదీనుండి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమం ప్రారంభమయ్యే మూడు రాష్ట్రాలలో ఒకటి ఢిల్లీ, రెండు రాజస్థాన్ కాగా మూడవది ఆంధ్రప్రదేశ్.

ఈ రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం ఒకటే, ఒక సంవత్సరం లోపల ఈ రాష్ట్రాన్ని పవర్ సప్లైలో దేశంలోనే మొట్టమొదటి మోడల్ స్టేట్ చేయాలని వచ్చే 5 సంవత్సరం లోపల గ్లోబల్ స్టాండర్డ్ సాధించాలనే ఉద్దేశ్యంతో ఈ ప్రభుత్వం ముందుకు పోతుంది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజున అనగా జూన్ 8వతేది 2014లో విద్యుత్ లోటు 22 మిలియన్ యూనిట్స్ ఉంది. 83 రోజులలో అంటే సెప్టెంబర్ 1వ తేదీ నాటికి ఈ ప్రభుత్వం విద్యుత్ కొరతను జీరో (0) డెఫిసిట్‌కు తీసుకువచ్చిందని సగర్వంగా మీకు మనవి చేస్తున్నాను. ప్రస్తుతం విద్యుత్ కొరత లేని రాష్ట్రంగా మార్చాము. విద్యుత్ సరఫరాను మార్చడానికి ఈ ప్రభుత్వం ఈ క్రింది చర్యలు తీసుకుంది.

సభ్యులు అడిగినట్లుగా ఎన్‌టీపీసీ నుండి 200 మెగావాట్ల అదనపు విద్యుత్‌ను సాధించాము. అదేవిధంగా 410 మెగావాట్ల విద్యుత్‌ను ఇంటర్ మరియు ఇంట్రాస్టేట్ జనరేటర్ నుండి కొనుగోలు చేయడం జరిగింది. 600మెగా వాట్ల విద్యుత్ అంటే ఈరోజుకు 800 మెగావాట్ల విద్యుత్‌ను కృష్ణపట్నం పవర్ ప్రాజెక్టు నుండి 25 జూలై నుండి సాధించడం జరిగింది. అదేవిధంగా అవసరాన్ని బట్టి రోజు వారిగా పవర్ ఎక్స్చేంజ్ నుండి 200 మెగావాట్ల విద్యుత్‌ను తీసుకుంటూ వస్తున్నాం. ఈ క్రమమైన చర్యలు తీసుకొనుటవలన విద్యుత్ ఉత్పాదక, పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయడం వలన జీరో ( 0) డెఫిసిట్‌కు తీసుకువచ్చాము.

(ఈ దశలో సభ్యులు శ్రీ పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి మైకు లేకుండా తమస్థానంలో కూర్చొని నిర్ధిష్ట జవాబు చెప్పకుండా ఉపన్యాసాలు చేస్తున్నారు అన్నారు. )

అధ్యక్షా వైఎస్.రాజశేఖరరెడ్డి గారు రెండవ సారి అధికారంలోకి వచ్చినప్పుడు 2009వ సంవత్సరంలో ఒక ప్రామిస్ చేసి సంతకం చేశారు. అంటే వచ్చే జూన్ 2009 నుండి విద్యుత్ 9 గంటల పాటు సరఫరా చేస్తామని చెప్పారు. రాజశేఖర రెడ్డి గారు జూలై , ఆగస్ట్ , సెప్టెంబర్ అంటే జూన్, జూలై, ఆగస్ట్ మూడు నెలలు వారున్న కాలంలో కూడా 9 గంటల పాటు విద్యుత్ సరఫరా చేయలేదు. ఆయన హామీని నిలబెట్టుకోలేదు. కానీ టీడీపీ గవర్నమెంట్ 1994 నుండి 2003వ సంవత్సరం వరకు 9 సంవత్సరాలు కొనసాగితే ఆ కాలంలో 9 గంటలు విద్యుత్ ఇచ్చారని చెప్పేందుకు నేను గర్వపడుతున్నాను. కాకపోతే ఒక్క 2003-04 సంవత్సరంలో due to severe drought condition and Hydel generation తక్కువుగా ఉండడం వల్ల, 3000 million units generation ఉండడం వలన అప్పుడు 7గంటలు మాత్రమే ఇచ్చాం. 7 గంటలు కూడా ఖచ్చితంగా ఇచ్చాం.

కానీ కాంగ్రెస్ పార్టీ హయాంలో విద్యుత్ సరఫరా సరిగా లేదు. అస్తవ్యస్తంగా ఉంది. గత పదిసంవత్సరాలు కాలంగా చూస్తే ఎప్పుడు కరెంట్ వస్తుందో ఎవరికీ తెలియదు. అంటే ప్రజలకు తెలియదు, ప్రభుత్వానికి తెలియదు, ఆ భగవంతునికి తెలియదు. ఆ సమయంలో మొగుళ్లు మోటర్లు దగ్గర ఉండగా పెళ్లాలు స్టార్టర్ దగ్గర కాపురం చేసే పరిస్థితి ఉండింది. తెలుగుదేశం

పార్టీ అధికారం లోకి వచ్చిన తరువాత కూడా విద్యుత్ కోత ఉంది. జిల్లా కేంద్రంలో 4గంటలు పాటు, మున్సిపాలిటీల్లో 6 గంటలు పాటు గ్రామీణ ప్రాంతంలో 12గంటలు పాటు, మండల కేంద్రంలో 8 గంటలు పాటు విద్యుత్ కోత విధించడం జరిగింది.

పరిశ్రమలకు 3 రోజులు హాలిడేస్ ఇచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నది. లక్షల మంది కార్మికులు రోడ్డున పడ్డారు. పరిశ్రమలు తరలి వెళ్లాయి. కొత్త పరిశ్రమలు అసలే రాలేదు. ఆ సమయంలో ఏపిఇఆర్సి రంగంలోకి దిగవలసి వచ్చింది. 40 శాతం పారిశ్రామిక వినియోగదారులుపై కోత విధించారు. 60 శాతం దాటితే 6టైమ్స్ పెనాలిటీ విధించారు. విద్యుత్ సంస్థలు కొత్త పారిశ్రామిక సంస్థలు అదనపు లోడు ఏమీ ఇవ్వలేదు. కాబట్టి ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత తీసుకున్న చర్యలు ఏమనగా, ఏపిడిస్కామ్స్ 2000 మెగా వాట్ల విద్యుత్‌ను వచ్చే సంవత్సరంలో ప్రొక్యూర్ చెయ్యాలనేది ఆలోచన. అదేవిధంగా 2400 మెగా వాట్ల విద్యుత్‌ను లాంగ్ టరమ్ బేసిస్‌లో ఈ ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. అదే విధంగా 500 మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను ప్రొక్యూర్ చేస్తుంది. గౌరవ సభ్యులు చెప్పినట్లు the Government of A.P is also permitted to replace 36,000 Non ISI pump-sets with efficient ISI Pump-sets in Fourteen Mandals. అంటే 36000 Agricultural pump-sets, లో, ఈ విద్యుత్ మోటార్స్ లో non ISI pumpsets ఉన్నాయి. వాటిని ఒక పైసా ఖర్చు లేకుండా replace చేస్తాం.

...

అదేవిధంగా 9,264 ఫీడర్స్ ఉన్నాయి. ఈ ఫీడర్స్ మోడల్స్‌ను, సిమ్‌కార్డ్స్‌ను ఆన్‌లైన్‌లో పెడుతున్నాం. 24 గంటలూ ఏ ఫీడర్‌లో ఎంత విద్యుత్ వస్తుంది, సింగిల్ ఫేస్‌లో, 3 ఫేస్‌లో ఎంత విద్యుత్ వస్తుందనేది రికార్డ్ అవుతుంది. ఇంతవరకూ 6,000 ఫీడర్లను పూర్తి చేశాం. భారతదేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇప్పటివరకు చేయలేదు. ఇది అత్యుత్తమం.

ఒక్కో ఎమ్మెల్యే ఐపాడ్‌లో ఒక ఫీడర్‌లో ఎంత కరెంటు వచ్చింది, ఎంత రాలేదు అనేది కూడా రికార్డ్ చేసుకోవచ్చు. ఇది కూడా చాలా ఎఫిషియెంట్‌గా చేస్తున్నాం. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్‌కు విద్యుత్ 43,624 మిలియన్ యూనిట్ల నుంచి 82,392 మిలియన్ యూనిట్లకు పెంచాలని, 2018-2019వ సంవత్సరంలోపల 6,158 మెగావాట్ల నుంచి 13,436 మెగావాట్లకు పెంచాలనే ఆలోచనతో ఉన్నాం.

ఈ ఐదు సంవత్సరాల్లో ఎ.పి.జెన్‌కో ద్వారా 3,850 మెగావాట్లు, హిందూజా నుంచి 1,040 మెగావాట్లు, ఎన్‌టిపిసి నుంచి 4,000 మెగావాట్లు, సోలార్ నుంచి 5,030 మెగావాట్లు, విండ్ నుంచి 4,150 మెగావాట్లు, సెంట్రల్ జనరేటింగ్ సిస్టం నుంచి 950 మెగావాట్లు, మొత్తం కలిపి 19,020 మెగావాట్ల మిద్యత్‌ను ప్రొక్యూర్ చేయాలని టార్గెట్‌ను పెట్టుకున్నాం.

అదేవిధంగా ఈ రాష్ట్ర ముఖ్య ఉద్దేశం ఏమంటే, 120 లక్షల ఇళ్లల్లో ఎల్ఇడి బల్బులను రిప్లేస్ చేయాలని అనుకొంటున్నాం. ప్రతీ ఒక్క ఇంట్లో విద్యుత్‌ను ఆదా చేసేందుకు, ఎఫిషియెన్సీని పెంచేందుకు, విద్యుత్ పొదుపు కోసం ఈ 120 లక్షల గృహాల్లో ఎల్ఇడి బల్బులను పెట్టాలని, 5 లక్షల వీధి దీపాలను కూడా మారుస్తున్నాం. రైతులకు ఒక్కపైసా కూడా ఖర్చులేకుండా 36,000 ఐఎస్ఐ పంపుసెట్లను కూడా మార్చేందుకు ప్రయత్నిస్తున్నాం. Dedicated toll free number has been setup for all consumers. వీటిద్వారా దాదాపు 2,151 గ్రామాలకు కరెంటు ఇవ్వాలనుకొంటున్నాం.

MR. SPEAKER: The Question is pertaining to the Agriculture.

శ్రీ పల్లె రఘునాథరెడ్డి (పుట్టపర్తి)ః అధ్యక్షా, గౌరవసభ్యులు మా ప్రభుత్వం ఏమేమి చర్యలు తీసుకొంటున్నారు అని అడిగారు. దానికి చెబుతున్నాను. ఈ రాష్ట్రాన్ని విద్యుత్ కొరతలేని రాష్ట్రంగా మార్చుతున్నాం. భారతదేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఈ విధంగా చేయలేదని తెలియజేస్తున్నాను. రాబోయే ఐదు సంవత్సరాల లోపల ఈ రాష్ట్రాన్ని ఆదర్శవంత రాష్ట్రంగా, విద్యుత్ కొరతను నివారించేందుకు సకల చర్యలు ఈ ప్రభుత్వం తీసుకుంటుంది.

మిస్టర్ స్పీకర్ః రామచంద్రారెడ్డిగారు.

డా.పెద్దిరెడ్డి గారి రామచంద్రా రెడ్డి (పుంగనూరు) ః అధ్యక్షా, నేను చాలా స్పష్టంగా అడిగాను. ఇప్పటివరకు రైతులకు లక్ష కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయి. అవి ఎప్పటిలోగా ఇస్తారు? అదేవిధంగా ప్రతీ సంవత్సరం లక్ష కనెక్షన్లు ఇస్తారా? లేకుంటే ఎన్ని ఇస్తారు అని అడిగాను. ఇంకో విషయం ఏమంటే, విద్యుత్ పంపిణీ వ్యవస్థ గాని, విద్యుత్ సరఫరా వ్యవస్థ గాని, ఈ రెండింటినీ ప్రయివేటీకరణ చేస్తారని వదంతులు వస్తున్నాయి. అలాంటి ప్రపోజల్ మీదగ్గర ఏమైనా ఉందా? ఉంటే దానికి ఉపన్యాసం చేయకుండా సరైన సమాధానం చెప్పండి.

మిస్టర్ స్పీకర్ః రాజన్నదొరగారు.

శ్రీ పి. రాజన్నదొర (సాలూరు)ః అధ్యక్షా, మా గౌరవ సభ్యులు అడిగినదానికి ఎలాగూ గౌరవ మంత్రిగారు సమాధానం చెబుతారు. కానీ నేను తమరిద్వారా మనవి చేసేదేమంటే కరెంటు 9 గంటలు ఇస్తారా లేదా? ఇస్తే ఉదయం ఇస్తారా, రాత్రికి ఇస్తారా? అలాగే ఎఫ్ఎసినా మరియు వ్యవసాయ కనెక్షన్ సర్వే ఛార్జీలు రద్దు చేస్తామన్నారు. రద్దు చేస్తున్నారా లేదా? చెప్పండి.

మా సాలూరు నియోజకవర్గంలో 4,500 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. మాకు బొబ్బిలి నుంచి 132 కె.వి. కరెంటు వస్తుంది. బొబ్బిలిలో ఏమైనా ఫెయిల్ అయితే ఆల్టర్‌నేటివ్

లేదు. దీనిగురించి ప్రతిపాదనలను కూడా ప్రభుత్వానికి పంపించాం. దయచేసి 132 కె.వి.ని తొందరగా మంజూరుచేయమని తమరి ద్వారా మనవి చేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్ః చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిగారు.

శ్రీ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి (చంద్రగిరి)ః అధ్యక్షా, మా గౌరవ సభ్యులు డా.పెద్దిరెడ్డి గారి రామచంద్రారెడ్డి చెప్పినట్లు, ఉచిత విద్యుత్‌కు పరిమితులు విధించి, లక్షకు పైగా కనెక్షన్లను కట్‌చేశారని అంటున్నారు. దానికి కారణం ఏం చెబుతున్నారంటే, రెండున్నర ఎకరాల మాగాణి భూమి ఉన్నా, మూడు కంటే ఎక్కువ ఎకరాల సామర్థ్యం గల భూమి ఉన్నా కనెక్షన్‌లను కట్ చేస్తామని అంటున్నారు. ఈ రాష్ట్రంలో 30 లక్షల కనెక్షన్లు ఉంటే, సుమారు 29 లక్షల కనెక్షన్లు ఉచిత విద్యుత్ కింద ఉన్నాయి. వ్యవసాయానికి మీటర్లు కూడా సిద్ధంగా లేవు. డా. వై.ఎస్.రాజశేఖర్ రెడ్డిగారి పరిపాలనలో ఉచిత విద్యుత్ కనెక్షన్లపై ఎంక్వయిరీలు చేయడం, పరిమితులు విధించి కట్ చేసిన సందర్భాలు లేవు. ఇప్పుడు ఇంకో విషయం చెబుతున్నారు. పాత బకాయిలు కూడా కట్టాలని అంటున్నారు. దీని ప్రకారం చూస్తే, వీళ్లు ఏం చెబుతున్నారంటే, 7 గంటల కరెంటును యావరేజ్‌గా తీసుకుని, ఒక యూనిట్‌కు 0.50 పైసల చొప్పున ప్రభుత్వం వసూలు చేయబోతుందని ప్రజల్లో, రైతుల్లో ఒక అనుమానం ఉంది. ఆ లెక్కలో సాగుకు సుమారు 5 హెచ్.పి. మోటార్లను ఎక్కువగా వాడతారు. 5 హెచ్.పి. మోటార్లను వాడితే గంటకు 3.73 యూనిట్లు ఖర్చవుతుంది. రోజుకు 7 గంటల చొప్పున 26.11 యూనిట్లు, నెలకు 783.3 యూనిట్లు, సంవత్సరానికి 9,399 యూనిట్లు అవుతుంది. ఈ లెక్కన యాభై పైసలు లెక్కన వేసుకున్నా, ఒక రైతు రూ.5 నుంచి 10 వేల వరకు చెల్లించాల్సి వస్తుంది. ఈ లెక్కింపును కూడా గత 9 సంవత్సరాలను లెక్కలోకి తీసుకొని చెల్లించమంటున్నారని రైతులు భయపడుతున్నారు.

ప్రభుత్వాన్ని ఒకటే అడుగుతున్నాను. ఇంటి కరెంటు బిల్లును, సేద్యానికి ఇస్తున్న కరెంటు బిల్లును లింక్ చేసి, వీటిని కట్టకపోతే, ఇంటి కనెక్షను కూడా కట్ చేస్తామని ప్రభుత్వం చెబుతుందని రైతులు భయపడుతున్నారు. కాబట్టి ప్రజల్లో ఈ ప్రభుత్వంపైన చాలా అనుమానాలున్నాయి. రైతులకు మరింత అనుమానాలున్నాయి. వ్యవసాయం అంటే రైతులు భయపడే పరిస్థితికి వచ్చారు. వ్యవసాయం చేయడానికి కూడా ముందుకురాని పరిస్థితిలో రైతులున్నారు.

మిస్టర్ స్పీకర్ః క్వశ్చన్‌కి పరిమితమై మాట్లాడండి.

శ్రీ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి(చంద్రగిరి)ః రైతులు ఏ పరిస్థితిలోకి వచ్చారంటే, రైతులు సేద్యం చేయాలంటే, పాత బకాయిలను కట్టలేక ఆత్మహత్యలు... పంటలు నష్టపోయి రైతులు

ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితిని ఈ ప్రభుత్వంలో చూశాం. పాత బకాయిలను కట్టలేక రైతులు ఆత్మహత్యలు చేసుకునే దిశగా ఈ ప్రభుత్వం తీసుకెళ్తుంది. కాబట్టి పాత బకాయిలను కట్టమని మీరేమైనా ఆదేశాలు ఇస్తున్నారా? ఇంటి బిల్లుకి, సేద్యానికి ఇస్తున్న కరెంటు బిల్లుకి లింక్ కలుపుతున్నారా? ఈ లక్ష కనెక్షన్లను మీరేమైనా పునరుద్ధరిస్తున్నారా? కనెక్షన్లను కట్ చేయాలనే ఆలోచన ఏమైనా ఉందా? వీటన్నిటిపైనా రైతులకు స్పష్టమైన హామీని ఈ ప్రభుత్వం ఇవ్వకపోతే.. ఇప్పటికే ఈ ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వం అని ముద్ర ఉంది. ఇది మరింతగా బలపడుతుంది. కాబట్టి ఈ ప్రభుత్వం దానికి సమాధానం చెప్పవలసిందిగా కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్ః మినిస్టరుగారూ..

శ్రీ పల్లె రఘునాథరెడ్డి(పుట్టపర్తి)ః అధ్యక్షా, నేను చాలా స్పష్టంగా చెప్పడం జరిగింది. తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడిగారి ఆధ్వర్యంలో ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నిటినీ తు.చ. తప్పకుండా అమలుచేస్తుంది. దానిలో భాగంగానే 7 గంటలపాటు విద్యుత్‌ను మూడు నెలల్లోపు ఇచ్చాం. దశల వారీగా అతి త్వరలో 9 గంటల పాటు దీనిని ఎక్స్‌టెండ్ చేయడం జరుగుతుంది. ఎట్టి పరిస్థితిలోనూ వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు. దానికి గాను రూ. 3,188 కోట్లు కావల్సి వస్తుంది. దీనికి 3,650 మిలియన్ యూనిట్స్ కావల్సి వస్తుంది. కాబట్టి వీలైనంత త్వరగా దానిని కూడా ఫిలప్ చేసి 9 గంటలపాటు నిరాటంకంగా, నాణ్యమైన విద్యుత్‌ను ప్రజలకిచ్చేందుకు ఈ రాష్ట్ర ప్రభుత్వం చేస్తుంది. ఇచ్చిన మాటను ఈ ప్రభుత్వం నిలబెట్టుకుంటుంది.

మిస్టర్ స్పీకర్ః పూర్తి చేయండి.

శ్రీ పల్లె రఘునాథరెడ్డి(పుట్టపర్తి)ః అధ్యక్షా, అదేవిధంగా సభ్యులు డా.పెద్దిరెడ్డి గారి రామచంద్రా రెడ్డిగారు ఒక ప్రశ్న అడిగారు. గత ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాకముందు, కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు 76,000 వ్యవసాయ కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సంవత్సరం 50,000 వ్యవసాయ కనెక్షన్లను రిలీజ్ చేస్తున్నాం. వచ్చే సంవత్సరం 50,000 వ్యవసాయ కనెక్షన్లను రిలీజ్ చేస్తాం. కాబట్టి ఈ రైతులకు ఏమాత్రం ఇబ్బందిలేకుండా వ్యవసాయ కనెక్షన్లను ఇవ్వబోతున్నాం.

అదేవిధంగా ప్రతీ సంవత్సరం 10,000 సోలార్ పంపుసెట్లను ఇవ్వబోతున్నాం. 36,000 అగ్రికల్చరల్ పంపుసెట్లు ఉన్నాయి. నాన్ ఐఎస్ఐ పంపుసెట్లు ఉన్నాయి. ఐఎస్ఐ సోలార్ పంపుసెట్లను ప్రతీ సంవత్సరం 10,000 వంతున వాటిని కూడా భర్తీ చేస్తాం.

అదేవిధంగా సభ్యులు శ్రీ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిగారు ఊరికే ఆందోళన పడుతున్నారు. ఈ ప్రభుత్వం రైతుల ప్రభుత్వం. గత ప్రభుత్వంలో వేలకొలది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఆత్మహత్యల ప్రదేశ్‌గా, అంధకార ఆంధ్రప్రదేశ్‌గా మార్చారు. వీళ్ల నుంచి మేం పాఠాలు నేర్చుకోవలసిన అవసరం లేదు.

(అధికారపక్ష బల్లల నుంచి చప్పట్లు)

No proposal to collect tariff from Agricultural farmers. వ్యవసాయదారుల నుంచి ఒక్క పైసా గాని, బొట్టుగాని, తూటుబొట్టుగాని వసూలుచేసేది ప్రభుత్వం దగ్గర లేదు. ఆ ఆలోచన, ఆందోళన ఉంటే పక్కన పెట్టమని చెబుతున్నాను.

...

**మిస్టర్ స్పీకర్: ప్రశ్న నెం.282, ఎక్సైజ్ శాఖా మంత్రి గారు.**
**ప్రశ్న నెం.282 (82)**

సర్వశ్రీ
**ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, ఎం.ఎల్.ఏ.**

ఎ) రాష్ట్రంలో సుపరిచితమైన బ్రాండ్లకు నకిలీ లేబుల్స్‌ను ఉపయోగిస్తూ నకిలీ మద్యాన్ని సరఫరా చేస్తున్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా?

బి) అయితే ఆ వివరాలు ఏమిటి?

సి) ఈ విషయంలో ప్రభుత్వం తీసుకున్న చర్య ఏమిటి?

**వెనుకబడిన తరగుతుల సంక్షేమం, చేనేత, ఎక్సైజ్ శాఖ మంత్రి (శ్రీ కొల్లు రవీంద్ర):**

| | | | |
|---|---|---|---|
| ఎ) | ప్రశ్నకు సమాధానం | – | లేదండీ |
| బి) | ప్రశ్నకు సమాధానం | – | ఈ ప్రశ్నకు సమాధానం ఉత్పన్నం కాదు. |
| సి) | ప్రశ్నకు సమాధానం | – | ఈ ప్రశ్నకు సమాధానం ఉత్పన్నం కాదు. |

మిస్టర్ స్పీకర్ ః నరేంద్ర గారు.

శ్రీ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ (పొన్నూరు )ః అధ్యక్షా, ఈ ప్రభుత్వం క్రొత్తగా వచ్చింది. గౌరవ మంత్రిగారు కూడా క్రొత్తగా మంత్రి అయ్యారు. కానీ, ప్రభుత్వం అనేది కంటిన్యూగా ఉంటుందన్న విషయం గుర్తుంచుకోవాలి. ఎందుకంటే, 'స్పూరియస్ లిక్కర్ ఈ రాష్ట్రంలో సప్లై చేయబడిందా' అని అడిగితే, 'లేద'ని చెప్పడం ఎంత సత్యదూర ఆలోచన చేయవలసిందిగా మంత్రిగారిని కోరుతున్నాను. అధికారులు మంత్రిగారికి తప్పుడు సమాచారం ఇచ్చారా?, మరి ఏవిధంగా మంత్రిగారు లేదని సమాధానమిచ్చారో నాకు అర్థం కావడంలేదు. ఎందుకంటే, స్థానిక సంస్థల ఎన్నికల్లో, అసెంబ్లీ ఎన్నికల్లో కూడా రకరకాల బ్రాండ్స్... IMPACT, RAIN, BIG PERSON, ROYAL QUEEN వంటి నకిలీ బ్రాండ్స్ పేర్లతో, హర్యానాలోనో, గోవాలోనో, హిమాచల్‌ప్రదేశ్‌లోనో తయారైనట్లుగా... ఆ మద్యం కూడా నాన్‌డ్యూటీ పెయిడ్... ప్రజల ఆరోగ్యానికి హానికరమైన మద్యం... ప్రభుత్వం దృష్టికి వచ్చిందో, లేదో మంత్రిగారు చెప్పాలి. ఎన్నికల సమయంలో చాలా చెక్‌పోస్టులు ఉంటాయి. ఆ చెక్‌పోస్టులన్నింటినీ దాటి, జిల్లాలు దాటి... మాఫియా ఆర్గనైజ్డ్ తరహాలో ఈ మద్యం విస్తరించిన మాట వాస్తవమా, కాదా అని అడుగుతున్నాను.

అధ్యక్షా, మా జిల్లాను మొదలుకొని, ప్రకాశం, నెల్లూరు, విజయనగరం, చిత్తూరు, కడప జిల్లాల్లో ... బ్రాండ్ పేరు మారవచ్చేమో గానీ... నామీద పోటీ చేసిన వై.కా.పా. అభ్యర్థికి చెందిన ఫ్యాక్టరీలోనే మద్యాన్ని పట్టుకోవడం జరిగింది. వాళ్ళకు సంబంధించిన కార్యకర్తల వద్ద కూడా మద్యాన్ని పట్టుకోవడం జరిగింది. అధ్యక్షా, ఏ జిల్లాలో జరిగినా సరే, అధికారులు ఆ మద్యాన్ని రీజనల్ కెమికల్ లేబొరేటరీస్‌కు పంపించిన మాట వాస్తవమా, కాదా అనే విషయం మంత్రిగారు చెప్పాల్సి ఉంది. ఈ మద్యం ప్రజల ప్రాణాలకు హానికరమైనదని ఆ కెమికల్ లేబొరేటరీస్ నిర్ధారించిన మాట వాస్తవమా, కాదా అనే విషయం మంత్రిగారు చెప్పాల్సిన అవసరముంది. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే హక్కు ఎవ్వరికీ లేదు. మా నియోజకవర్గం కావచ్చు, నెల్లూరు జిల్లాలో సర్వేపల్లి నియోజక వర్గంలో గానీ, ఎంత ఆశ్చర్యకరం అంటే, డ్రైన్స్‌లో మురుగునీరు పారాల్సింది, అక్రమ, కల్తీ మద్యం ఏరులైపారింది. సర్వేపల్లిలో భూమిలో దాచారు. కొన్ని గ్రామాల్లో ఆ మద్యాన్ని అధికారులు పట్టుకోవడం జరిగింది. కావలి నియోజకవర్గంలో ఆ కల్తీ మద్యాన్ని అటవీ ప్రాంతంలోకి తీసుకువెళ్ళి దగ్ధం చేసిన సంగతి కూడా తమరికి గుర్తుచేస్తున్నాను.

ఈ కల్తీ మద్యం త్రాగడం మూలాన కొందరు చనిపోయారని వార్తలు కూడా వచ్చాయి. ఇది వాస్తవమా, కాదా మంత్రిగారు చెప్పాల్సిన అవసరముంది. నా స్వానుభవంలో, నేను గ్రామాల్లో పర్యటించినప్పుడు, ఆ మద్యం త్రాగడం మూలాన హాస్పిటల్‌కు వెళ్ళి లక్ష రూపాయలదాకా వాళ్ళు ఖర్చు పెట్టుకోవాల్సి వచ్చిందని ఆ గ్రామాల్లో కొంతమంది నాకు

చెప్పారు. కొన్ని జిల్లాల్లో ఎక్సైజ్ అధికారులు కూడా కుమ్మక్కైయ్యారు. కానీ సభకు సమాధానం ఇచ్చేటప్పుడు పూర్తి, వాస్తవ సమాచారాన్ని గౌరవ మంత్రిగారి ద్వారా అందించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులకు ఉంది.

మిస్టర్ స్పీకర్ః మినిస్టర్ గారు.

శ్రీ కొల్లు రవీంద్ర (మచిలీపట్నం)ః అధ్యక్షా, గౌరవ సభ్యులు ధూళిపాళ్ళ నరేంద్రగారు చెప్పినట్లుగా ఎన్నికల సమయంలో ఆంధ్రరాష్ట్రంలో అధికారం చేపట్టడం కోసం కొంతమంది వ్యక్తులు ఈ కల్తీ మద్యాన్ని ప్రక్క రాష్ట్రాలనుంచి తీసుకునివచ్చి, పంపిణీ చేయడం జరిగింది. గుంటూరు జిల్లాలో 6 కేసులు నమోదైనాయి. నరసరావుపేట ఎక్సైజ్ డిపార్టుమెంటు పరిధిలో, చిలకలూరిపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో, మద్రిపాలెం గ్రామంలో మూతపడిన జి.ఐ.టెక్స్‌టైల్స్ మిల్లులో హర్యానాలో తయారైన ఇంపాక్ట్, రెయిన్ విస్కీ మొదలగునవి పట్టుబడినవి. ఆ మిల్లు యజమాని శ్రీ రావి వెంకటరమణగా గుర్తించబడింది. ఆయన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన అభ్యర్థి. ఆయనను ఎ-3 ముద్దాయిగా నిర్ధారించి, అరెస్టు చేయడం కూడా జరిగింది.

(అధికారపక్ష సభ్యులు వారి వారి సీట్లలో కూర్చొని, షేమ్, షేమ్ అన్నారు.)

కేవలం ఇవాళ అధికారం చేపట్టాలన్న ఉద్దేశ్యంతో, ప్రజల ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా, కల్తీ మద్యాన్ని తీసుకువచ్చి ప్రజల ఆరోగ్యాన్ని కొల్లగొట్టిన పరిస్థితి నేడు కనిపిస్తోంది. దీనికి సంబంధించి నరసరావుపేట ఎక్సైజ్ సూపరింటెండెంటును కూడా సస్పెండ్ చేయడం జరిగింది. అదేవిధంగా, నెల్లూరు జిల్లాలో 2వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 3 కేసులు నమోదైయ్యాయి. నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండల ప్రస్తుత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపు సభ్యుడు శ్రీ నెల్లూరు శివప్రసాద్, తాను ఎన్నికల్లో గెలుపొందడం కోసం, ఈ అక్రమ మద్యాన్ని తీసుకువచ్చి, దానిని పంపిణీ చేయడం జరిగింది. ఆయన మీద కేసు పెట్టడం జరిగింది. అలాగే, రాపూరు నివాసి, మద్దిరెడ్డి రమణారెడ్డి అలియాస్ మెడికల్ స్టోర్స్ రమణారెడ్డి కూడా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన తన సహచరుడితో కలిసి, ఈ కల్తీ మద్యాన్ని విచ్చలవిడిగా పంపిణీ చేయడం జరిగింది. దీనిలో శ్రీ నిర్మల్‌కుమార్ అప్పు అనే అంతర్ రాష్ట్ర స్మగ్లర్ ద్వారా గోవాలో తయారైన బిగ్‌పైపుల్స్, క్లాసిక్ విస్కీ మరియు హిమాచల్ ప్రదేశ్‌లో తయారైన రెయిన్ విస్కీలను ఎన్నికల సమయంలో తెప్పించినట్లుగా నిర్ధారణ అయ్యింది. ఈ కేసులో స్థానిక నేరస్తులందరూ అరెస్టు కాగా, శ్రీ పార్థసారథి సురేష్ అనే పాండిచ్చేరికి చెందిన వ్యక్తి అరెస్టు కావడం జరిగింది. ఇంకా శ్రీ నిర్మల్‌కుమార్ అప్పును అరెస్టు చేయవలసి ఉంది. ఈ 32 కేసుల్ని సీ.బీ.ఐ. కి అప్పజెప్పడం జరిగింది. అదేవిధంగా నెల్లూరుజిల్లా కావలి, కోవూరు స్టేషన్స్ పరిధిలో 6 కేసులు

నమోదైనాయి. నెల్లూరు స్టేషన్ పరిధిలో 3 కేసులు నమోదయ్యాయి. గూడూరు, రాపూరు స్టేషన్స్ పరిధిలో ఒక్కొక్క కేసు చొప్పున నమోదయ్యాయి.

మిస్టర్ స్పీకర్ః మినిస్టర్ ఫర్ ఎక్సైజ్... సీ.బీ.ఐ. కా, లేదా సీ.బీ.సీ.ఐ.డి. కా?

శ్రీ కొల్లు రవీంద్ర (మచిలీపట్నం) ః అధ్యక్షా, సీ.బీ.సీ.ఐ.డి. కి అప్పజెప్పడం జరిగింది. కావలి స్టేషన్ పరిధిలో 4 కేసులు నమోదు కాగా, వాటిలో 3 కేసులు అల్లూరు మండలస్థాయి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు 'శ్రీ మల్లెమాల సుకుమార్‌రెడ్డి, సన్ ఆఫ్ నారాయణ రెడ్డి, ముత్యాలపాలెం, బ్యాంకు కాలనీ, నెల్లూరు అనే వ్యక్తి ముఖ్య సరఫరాదారునిగా, 'నిర్మల్ కుమార్, కళాసుపాలెం, న్యూ ఇండియా ట్రావెల్స్, బెంగుళూరు మరియు నిర్మల్ కుమార్ గారి కుమారుడి' ద్వారా చెన్నైకి చెందిన 'అప్పలు' ద్వారా, అక్రమ మద్యం....విస్కీలు, బ్రాందీలు తీసుకురావడం, పంపిణీ చేయడం జరిగింది. ఈ కేసులన్నీ కూడా సీ.బీ.సీ.ఐ.డి. కి అప్పజెప్పడం జరిగింది. వాళ్ళమీద కఠినమైన చర్యలు తీసుకోవడం కూడా జరుగుతుంది. నెల్లూరులో శాసనసభ్యులుగా పోటీ చేసినటువంటి వ్యక్తి కూడా దీనిలో ఇన్వాల్వ్ కావడం చాలా దురదృష్టకరం. వారి మీద కూడా కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. సీ.బీ.సీ.ఐ.డి. ద్వారా త్వరలోనే విచారణ జరిపించి, దీనికి కారకులైన వారందరిపైనా కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్ః నరేంద్ర గారు.

శ్రీ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ (పొన్నూరు)ః అధ్యక్షా, మంత్రిగారు తమ సమాధానంలో, ఇది విషపూరితమైనదా, కాదా అని నిర్ధారించారో, లేదో చెప్పలేదు. ఇంతవరకు ఈ మద్యం ఎక్కడ తయారైందనే విషయాన్ని కూడా నిర్ధారించలేదు. రెండవది, ఇతర రాష్ట్రాల లేబుల్స్ వేశారు, కానీ ఆ రాష్ట్రాల్లో కాకుండా మన రాష్ట్రంలోనే ఈ మద్యం తయారైనదనే ఒక వార్త ఉంది కాబట్టి, ఈవిషయమై కూడా తగు విధమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. మనమందరమూ కూడా ప్రజాస్వామ్యంలో ఉన్న వ్యక్తులం కాబట్టి, మనం ఎన్నికలకు వెళ్ళడం జరుగుతోంది. ఎన్నికల్లో ఎవరి విధానాన్ని, వాళ్ళు పాటించడం జరుగుతూ ఉంటుంది. కానీ, మొన్న జరిగిన ఎన్నికల్లో.... తాగండి, మీరు తాగి చావండి, తాగేముందు మాకు ఓటేయండి, మీ శవాల మీదుగా మేము అధికారంలోకి వస్తాం, అధికార పీఠం మాకు ఇవ్వండి, అన్న దృక్పథంలో.... ఈ 6, 7 జిల్లాల్లో....

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీసభ్యులచే తీవ్ర అభ్యంతరం)

శ్రీమతి ఆర్.కె.రోజా (నగరి)ః (మైకు లేకుండా) గౌరవ దివంగత ముఖ్యమంత్రి శ్రీ నందమూరి తారక రామారావు గారు విధించిన మద్యపాన నిషేధాన్ని ఎత్తివేసింది శ్రీ చంద్రబాబునాయుడు గారు కాదా. మళ్ళీ నిషేధం పెట్టమనండి, మేమూ సహకరిస్తాం.

శ్రీ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ (పొన్నూరు )ఃఎందుకంటే, ఇదొక ఆర్గనైజ్డ్ క్రైమ్. మనం రాష్ట్రంలో రకరకాల క్రైమ్‌లను చూస్తూ ఉంటాము.

...

రాష్ట్రంలో భూకబ్జాలు, వైట్‌కాలర్ నేరాలు మనం చూస్తున్నాం కానీ ఇది మద్యం అధ్యక్షా, ఇక్కడ మాట్లాడే వారు (సభకు అంతరాయం కలిగిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులనుద్దేశించి) ఒక్కసారి ఆత్మ విమర్శ చేసుకోండి. ప్రజాప్రతినిధులుగా, చట్టాలు చేసే మనం పేద ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొని, వారి ప్రాణాలను ఫణంగా పెట్టి, వారి శవాల వలన మాకు అధికారం కావాలనుకోవడం సరైంది కాదు. మద్యపానం వలన కొంతమంది ప్రాణాలు కోల్పోయారు, అస్వస్థులయ్యారు, ఆరోగ్యాన్ని కోల్పోయారు. చిత్తశుద్ధితో రాజకీయాలు చేసుకోవడం పద్ధతి కానీ అక్రమ మార్గాలను ఎన్నుకొని, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ, వారి ప్రాణాలను ఫణంగా పెట్టి అధికారపీఠాన్ని దక్కించుకోవాలనుకోవడం మంచి పద్ధతి కాదు.

ఈ సమస్య గుంటూరు, నెల్లూరు, ప్రకాశం, కడప, చిత్తూరు జిల్లాలలో కావచ్చు. ఇది ఆరేడు జిల్లాలకు సంబంధించిన సమస్య. ఈ సమస్య అంతర్‌రాష్ట్రానికి సంబంధించినది కూడా కావచ్చునని మంత్రి గారు చెప్పారు. చిన్న చిన్న వ్యక్తులను పట్టుకొని వారిపై కేసులు పెట్టడం కాదు, సూత్రధారులు, పాత్రదారులు, పెద్ద చేపలను పట్టుకోవల్సిందిగా నేను మంత్రి గారిని కోరుతున్నాను. ఎన్నికలలో గెలవడానికి ఎవరైతే ప్రజల ప్రాణాలను ఫణంగా పెట్టారో వారిపై కఠిన చర్యలు తీసుకోవల్సిందిగా కోరుతున్నాను. మన రాష్ట్రంలోని ఆరేడు జిల్లాలతో, ఇతర రాష్ట్రాలతో సంబంధం ఉంది కనుక ఒక 'స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం'ను ఉన్నతాధికారులతో ఏర్పాటు చేసే ఆలోచన ఉందా?

ఎన్నికల సందర్భంగా ఉన్నతాధికారుల సహకారం లేనిదే ఇలాంటి పనులు సాధ్యపడవు. శాఖాపరంగా అటువంటి అధికారులపై విచారణ చేపడతారో, లేదో మంత్రి గారిని నేను కోరుతున్నాను.

డా.పెద్దిరెడ్డిగారి రామచంద్రా రెడ్డి (పుంగనూరు) ః అధ్యక్షా, మంత్రి గారు సమాధాన మిస్తూ కొన్ని పేర్లను ఉటంకించారు. ఎన్నికలలో శాఖాపరంగా ఎన్ని కేసులు నమోదయ్యాయి, ఏయే పార్టీలకు సంబంధించిన వారున్నారో చెప్పకుండా గౌరవసభ్యులు శ్రీ నరేంద్రకుమార్

గారు ప్రశ్న వేయడం, మంత్రి గారు సమాధానం ఇవ్వడం బాగోలేదు. ఇందులో తెలుగుదేశం పార్టీ వారు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల వారున్నారు.

(అధికార పార్టీ సభ్యులు అభ్యంతరాలు వ్యక్తం చేయసాగారు)

ఓపికతో వినండి. వాటన్నింటినీ సభ ముందు ఉంచితే మాకు ఏ అభ్యంతరం లేదు. మా పార్టీ ఎన్నికలలో విస్కీ పంచి గెలిచినట్లు, అధికారపార్టీ వారు మంచినీళ్లు ఇచ్చి గెలిచినట్లు గొప్పలు చెప్పుకోవడం చాలా అన్యాయం.

శ్రీ పి.విష్ణుకుమార్ రాజు (విశాఖపట్నం-నార్త్) : అధ్యక్షా, సభకు నమస్కారం. గౌరవసభ్యులు శ్రీ రామచంద్రా రెడ్డి గారు మాట్లాడుతూ ఈ ప్రక్రియలో అన్ని పార్టీలు ఉన్నాయన్నారు. మా పార్టీ ప్రజలకు మంచినీళ్లు (మంచినీళ్ల గ్లాసు చూపిస్తూ) ఇచ్చి గెలిచింది.

(ప్రతిపక్ష పార్టీ సభ్యుల నుంచి సభకు అంతరాయం)

ఇది వాస్తవం. వాస్తవం చెబితే ఎందుకు ఉలికిపడతారు? అధ్యక్షా, ఇది ఎంక్వైరీలతో అయ్యేది కాదు. ఎన్నికల ముందు మూడు నెలలు మద్యపాన నిషేధం పెడితే బాగుంటుంది.

శ్రీ బోండా ఉమామహేశ్వర రావు (విజయవాడ-సెంట్రల్): అధ్యక్షా, ఈ రాష్ట్రాన్ని సర్వ నాశనం చేసిన ఘనత ఆనాటి ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డిదే.

MR. SPEAKER: Uma Maheswar Rao garu, confine yourself to supplementaries..

(Interruptions from YSR Congress Party members)

I told him. I told him. I asked him to please confine himself to the supplementary. Uma Maheswara Rao garu, let the Leader of the Opposition speak.

శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి (పులివెందుల) : అధ్యక్షా, రాష్ట్రంలో ఏది జరిగినా దానికి కారణం శ్రీ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి అంటున్నారు. వారు చనిపోయి 5 సంవత్సరాలు అయ్యింది. ఎన్నికలు జరిగి 3 నెలలు అయ్యాయి. ఈ 3 నెలలలో జరిగిన వాటిని శ్రీ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారికి ఆపాదించడం భావ్యం కాదు. ఆ ఘనత తెలుగుదేశం పార్టీ సభ్యులకే దక్కుతుంది.

శ్రీ బోండా ఉమామహేశ్వర రావు (విజయవాడ-సెంట్రల్)ః అధ్యక్షా, శ్రీ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారు చనిపోయి 5 సంవత్సరాలయ్యిందన్న విషయం మాకు తెలుసు. ఇక్కడ వారి వారసులున్నారు. వారి వారసత్వాన్ని వీరు (వైఎస్సార్‌సీపీ పార్టీ సభ్యులనుద్దేశించి) కొనసాగిస్తున్నారని ఈ సందర్భంగా చెబుతున్నాను.

MR. SPEAKER: Uma Maheswar Rao garu, please raise your supplementary.

శ్రీ బోండా ఉమామహేశ్వర రావు (విజయవాడ-సెంట్రల్)ః మొన్న జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో ఎన్నో అక్రమాలు జరిగాయి. అక్రమ మద్యాన్ని ఏరులై పారించి ఓట్లను కొనాలనే ఉద్దేశంతో కేసులలో ఇరుక్కొని ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేసినవారు జైలుకు వెళ్ళారు. నెల్లూరులో, మా కృష్ణా జిల్లాలో అనేకచోట్ల ఎర్రచందనం స్మగ్లర్స్, ఇసుక మాఫియా, ల్యాండ్ మాఫియా, ఫ్యాక్షనిస్టులు ఇలాంటి వ్యక్తులు . . . . . .

(ప్రతిపక్ష పార్టీ సభ్యుల నుంచి సభకు అంతరాయం)

MR. SPEAKER: Uma Maheswar Rao garu, please confine yourself to the question.

శ్రీ బోండా ఉమామహేశ్వర రావుః అధ్యక్షా, అక్రమ మద్యాన్ని ఏరులై పారించి, ప్రజల ప్రాణాలతో ఆడుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సభ ద్వారా మంత్రివర్యులను కోరుతున్నాను.

శ్రీ కొల్లు రవీంద్ర (మచిలీపట్నం) ః అధ్యక్షా, ఎన్నికల సమయంలో పంచిన మద్యం ఆరోగ్యానికి, ప్రాణానికి చాలా హానికరమైంది. కేవలం ఎన్నికలలో గెలవడం కోసం ఎంతటి ఘోరానికైనా సిద్ధపడిన పరిస్థితి మన రాష్ట్రంలో జరగడం చాలా దురదృష్టకరం. దీనికి ప్రధాన కారకులైన వ్యక్తులను ఎట్టి పరిస్థితులలో విడిచిపెట్టే ప్రసక్తి లేదు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

ఒంగోలులో క్రైం నెం.39/2014 వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుచరులు, వారి సానుభూతిపరులులో ఒకరు ఈ కేసులో ముద్దాయిగా ఉన్నారు. ఒంగోలులో క్రైం నెం.40/2014 నమోదయ్యింది. ఈ కేసులో ఇద్దరు వ్యక్తులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సాను భూతిపరులుగా ఉన్నారు. క్రైం నెం.41/2014 03-05-2014వ తేదీన 9 మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుచరులపై కేసు నమోదయ్యింది. నెల్లూరులో క్రైం నెం.19/2014లో వైఎస్సా ర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడిపై నమోదయ్యింది. నెల్లూరు జిల్లాలో క్రైం నెం.20/2014లో వైఎ

స్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తిపై నమోదయ్యింది. నెల్లూరులో క్రైం నెం.21/2014లో ఒకరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక సానుభూతిపరున్ని నిందితుడిగా నమోదైంది.

(ప్రతిపక్ష పార్టీ సభ్యుల నుంచి సభకు అంతరాయం)

మీ పార్టీ సభ్యులు (వైఎస్సార్‌సీపీ పార్టీ సభ్యులనుద్దేశించి) అడిగిన వాటికి మేము సమాధానం చెబుతున్నాం. కేసుల వివరాలు చెప్పమన్నారు కనుక చెబుతున్నాను. క్రైం నెం.39/2014 29-04-2014తేదీన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక వ్యక్తిని ముద్దాయిగా నమోదుచేయడం జరిగింది. అలాగే క్రైం నెం.40/2014 29-04-2014తేదీన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు వ్యక్తుల్ని ముద్దాయిలుగా నమోదుచేయడం జరిగింది. కడపలో క్రైం నెం.6/2014, 05-04-2014 తేదీన కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు వ్యక్తులు, అలాగే క్రైం నెం.6/2014 26/2014 తేదిః06-05-2014, క్రైం నెం.48/2014 కడపలో కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తిపై నమోదైంది. గుంటూరులో క్రైం నెం.17/2014 26-04-2014వ తేదీన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు సానుభూతిపరులు ముద్దాయిగా ఉన్నారు. గుంటూరులో క్రైం నెం.14/2014 26-04-2014 వతేదీన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నలుగురు సానుభూతిపరులు ముద్దాయిలుగా ఉన్నారు.

...

వైఎస్సార్సీపీ సానుభూతిపరులు ఇద్దర్ని అందులో అక్యూజ్డ్‌గా చేర్చటం జరిగింది. అలాగే గుంటూరులో క్రైమ్ నెంబర్ 14/2014-15లో నలుగురు వైఎస్సార్సీపీ సానుభూతి పరుల్ని అక్యూజ్డ్‌గా చేర్చటం జరిగింది. అట్లాగే చిత్తూరు జిల్లాలో క్రైమ్ నెంబర్ 93/13-14లో ఐదు మంది వైఎస్సార్సీపీ సానుభూతిపరుల్ని ఐదుగురిని, క్రైమ్ నెంబర్ 1/23014, తేది 1.4.2014లో వైఎస్సార్సీపీ సానుభూతి పరులు ఇద్దర్ని అక్యూజ్డ్‌గా చేర్చటం జరిగింది.

(వైఎస్సార్సీపీ సభ్యులు శ్రీ జ్యోతుల నెహ్రూచే అభ్యంతరాలు )

మిస్టర్ స్పీకర్ః మినిస్టర్ గారూ, ప్లీజ్ కన్‌క్లూడ్......

శ్రీ కొల్లు రవీంద్ర (మచిలీపట్నం) ః ఇవన్నీ మేం పెట్టిన కేసులు కాదు అధ్యక్షా, గత ప్రభుత్వంలోనే పెట్టడం జరిగింది. కావలికి చెందిన రామచంద్రా రెడ్డి ప్రతాప్ రెడ్డి గారి ప్రధాన అనుచరుడనన్న ప్రధానమైన ఆరోపణలున్నాయి. అట్లాగే సర్వేపల్లి శాసనసభ్యుడు శ్రీ కాకాని గోవర్ధన రెడ్డి గారి అనుచరులుగా వున్నారు. అట్లాగే కొవ్వూరులో పోటీ చేసిన శ్రీ నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి గారి ప్రధాన అనుచరులు కూడా ఇన్వాల్వ్ అయ్యారని చెప్పడం జరుగుతున్నది. సీబీసీఐడి ఎంక్వయిరీ పూర్తయిన తరువాత ఎవరెవరు ఇన్వాల్వ్ అయ్యారో వాళ్లందరి మీద తప్పకుండా కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

శ్రీ జ్యోతుల నెహ్రూ (జగ్గంపేట): అధ్యక్షా, మిత్రులు నరేంద్ర గారు వేసిన ప్రశ్నకు గౌరవ మంత్రి వర్యులు చాలా చక్కటి సమాధానమిచ్చారు. నేను గౌరవ మంత్రి గారిని ఇంపార్షియల్‌గా ఒకటే అడుగుతున్నాను. రాష్ట్రంలో జరిగిన ఎన్నికల సందర్భంగా అక్రమ మద్యాన్ని సరఫరా చేశారని రాష్ట్రవ్యాప్తంగా కొంతమంది వ్యక్తులపై పెట్టిన కేసులేవైతే వున్నాయో వాటన్నిటినీ ఈ సభ ముందు పెట్టడానికి సిద్ధమా? దానిపై ఈ సభలో ఒక రోజు మనం చర్చించుకోవడానికి సిద్ధమా అని అడుగుతున్నాను. కేవలం ఒక పార్టీనే టార్గెట్ చేయడానికి దురుద్దేశ పూరిత విధానంతో కొన్ని కేసులకే పరిమితం చేస్తూ సభలో లేని వ్యక్తులను ప్రస్తావిస్తూ ఈ రోజు ఈ చర్చను తీసుకురావడం ఏ మేరకు న్యాయం? ఎవరు చేసినా చేయకుపోయినా మీరు చాలా గొప్పగా ఎన్‌టీఆర్ అనే ఒక మహాత్ముని పేరుతో చెప్పుకుంటున్నట్లుగా ఆయన కలను నెరవేర్చడానికి మీరు సిద్ధంగా వున్నారా? ఆయన సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని మనసా వాచా కోరుకున్నారు. అదే విధానాన్ని అమలు చేయడానికి ఈ రోజు మీరు సిద్ధంగా వున్నారా? గౌరవ మంత్రి వర్యులను చెప్పమని కోరుతున్నాను.

...

శ్రీ కొల్లు రవీంద్ర (మచిలీపట్నం) : అధ్యక్షా, గౌరవసభ్యులు కోరినట్లుగా 30 కేసులను సిఐడి విచారణకు ఆదేశించడం జరిగింది. ఆ విచారణలో దోషులుగా తేలినవారిపై కఠిన చర్యలు తీసుకొంటాం. గౌరవ ప్రతిపక్ష నాయకులను ఒకటే అడుగుతున్నాను. వారికి సిబిఐ మీద నమ్మకం లేదు, ఎఫ్‌బిఐ మీద నమ్మకం లేదు, ఈడీ మీద నమ్మకం లేదు. ఈ దేశంలోని ఏ వ్యవస్థ మీదా వారికి నమ్మకం లేదు. వారికి ఏ వ్యవస్థ మీద నమ్మకముందో చెప్పమనండి. అన్నింటి మీద ధ్వజమెత్తే పరిస్థితి ఉంది. మేం నిష్పక్షపాతంగా వ్యవహరించి బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మీ ద్వారా సభకు తెలియజేస్తున్నాను.

**ప్రశ్న నెంబరు.110 (83)**

**సర్వశ్రీ రాజన్నదొర పీడిక, చిర్ల జగ్గిరెడ్డి, వెంకట సుజయ్‌కృష్ణ రంగారావు, ఎం.ఎల్.ఏ.లు**

**గౌరవనీయులైన ఉప ముఖ్యమంత్రి గారు దయచేసి ఈ కింది సమాచారం తెలియజేస్తారా;**

అ) రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో మైనర్ బాలికలు, పాఠశాలకు వెళుతున్న బాలికలపై లైంగిక దాడులు, వేధింపులు జరుగుతున్న విషయం వాస్తవమేనా;

ఆ) అంధ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులపై కూడా జరుగుతున్న ఈ తరహా వేధింపులు, యాజమాన్యాల వేధింపులు ప్రభుత్వ దృష్టికి వచ్చాయా;

ఇ) అయితే, అట్టి దుష్ట చేష్టలపై నమోదు చేసిన కేసుల వివరాలేమిటి?

ఈ) అటువంటి నేరాలను విచారించి,ఈ నేరస్తులను శిక్షించడానికి ప్రభుత్వం తీసుకొనే చర్య ఏమిటి?

**ఉప ముఖ్యమంత్రి (శ్రీ నిమ్మకాయల చినరాజప్ప)ః**

అ) అవునండీ.

ఆ) అవునండీ.

ఇ) గుంటూరు (గ్రామీణ) జిల్లాలోని చిలకలూరిపేట పట్టణంలో 15.04.2013 తేదీన ఉదయం 10.30 గంటల సమయంలో ఒక అంధ బాలికపై జరిగిన వేధింపు కేసు ఒక దానిని నివేదించడమయింది. చిలకలూరిపేట పట్టణం పోలీసు స్టేషన్‌లో ఐపిసి 376 సెక్షన్ కింద నేరం నెం.116/2013లో కేసు నమోదు చేయడమయింది.

ఈ) అవునండీ. మైనర్ బాలికలపై జరిగే దాడులు, వేధింపులను నివారించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నది.

శ్రీ రాజన్నదొర పీడిక (సాలూరు)ః అధ్యక్షా, గౌరవమంత్రిగారు అన్నీ ప్రశ్నలకు అవునండీ అని సమాధానం చెప్పినందుకు సంతోషంతో బాటు బాధాకరంగా ఉంది. ఎందుకంటే మహిళలకు సంబంధించిన అంశం కాబట్టి. భారతదేశంలో మహిళలకు ఉన్న గౌరవం ఇంకా ఏ దేశంలోనూ లేదు. మహిళలను అగౌరవపరచడంవల్లనే మహాభారత యుద్ధం వచ్చింది, రామ రావణా యుద్ధం వచ్చింది. అటువంటి మహిళలను ఎక్కడ చూసినా కించపరచడం, అవమానపరచడం, కిడ్నాపులు చేయడం, మానభంగాలు, హత్యలు, దౌర్జన్యాలు చేయడం జరుగుతోంది. నేను కాలేజీ విద్యార్థిగా ఉన్నప్పుడు అమ్మాయిలను, అబ్బాయిలను హెచ్చరిస్తూ చిన్న కవిత రాశాను. "కల్లబొల్లి మాటలతో కవ్వించే మగవాళ్లు, మాయ మనసు చేతపట్టి మత్తుపోసే ఆడోళ్లు, నమ్మొద్దు నమ్మొద్దు, ప్రేమంటే చీకటి వలయం, తెలుసుకోలేని మాయాజాలం". యువత ఈ మాయాజాలంలో పడిపోతున్నారు. అబ్బాయిలు చెసే మోసానికో, వంచనకో, దగాకోరుతనానికో ఎంతో మంది ముక్కుపచ్చలారని అమ్మాయిలు గురవుతున్నారు. ఒకరో ఇద్దరో కాదు. ఈ రోజు చూస్తే మనం రేపు రాజధాని నగరమని చెప్పకుంటున్న కృష్ణా జిల్లా విజయవాడలో అటువంటి కిడ్నాప్ కేసులు 50 నమోదయ్యాయని చెబుతున్నారు. (పేపర్ కటింగ్ చూపిస్తూ) ఈనాడు పేపర్‌లో వచ్చింది. అమ్మాయిలకు భద్రత లేదని భయపడి తమ పిల్లలను ఆసుపత్రులలో, శ్మశానవాటికలో, చెత్తకుండీలలో వదలివేస్తున్నారు. ఈ విధంగా ముక్కుపచ్చలారని పిల్లలను అనాథలుగా వదలివేస్తున్నారు. ప్రేమ పేరుతో, చుట్టం పేరుతో, స్నేహం పేరుతో ఇలా రకరకాలుగా వంచన చేస్తుండడంతో ఆడపిల్లల తల్లితండ్రులు తమ

పిల్లలను పాఠశాలలకు పంపించాలన్నా భయం, ఒంటరిగా ఇంట్లో, ఉంచాలన్నా భయం, బజారుకెళితే భయం, సినిమాకు వెళ్లాలంటే భయం. ఇటువంటి వ్యవహారాలలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి. మన చెల్లెళ్లు, మన తల్లులు ఎవరికి అన్యాయం జరిగినా సరే మనం మన తల్లి, కూతురికి జరిగినట్లుగా చూస్తూ ఊరుకోలేం. అలా అందరూ తిరగబడతారు. ఆ తరవాత సంఘంలో జరిగే పరిణామాలు ఎలా ఉంటాయో తమకు తెలుసు. కాబట్టి ప్రభుత్వం ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలి. మహిళలకు సంబంధించిన విషయం కాబట్టి నేరస్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి. నిర్భయ చట్టం, ఫోక్సా చట్టం కింద కేసులు పెట్టి తగిన చర్యలు తీసుకొంటారా, లేదా అని అడుగుతున్నాను. అంధ బాలికపై జరిగిన సంఘటన ఒక్కటే చెబుతున్నారు. అటువంటి సంఘటనలు రాష్ట్రంలో చాలా జరుగుతున్నాయి. మా నియోజకవర్గంలో ఉదయం ఏడు గంటలకు గయ్యవలస అనే గ్రామంలో కూడా అటువంటి సంఘటనలు జరిగాయి. తూర్పు గోదావరి జిల్లాలో జరిగిన సంఘటన మీద ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకొంటే అటువంటి నేరాలు చేయడానికి నేరస్తులు భయపడతారు. విజయవాడలో జరిగిన నీలి గ్యాంగ్ సంఘటన, హైదరాబాద్ పాతనగరంలో స్నేక్ గ్యాంగ్ సంఘటనలు అనేకం జరుగుతున్నాయి. వాటిని అరికట్టడానికి ప్రభుత్వం కఠినంగా వ్యవహరించవలసి ఉంటుంది. ప్రభుత్వం ఈ విషయంలో తీసుకున్న చర్యలను వివరించాలని కోరుతున్నాను.

శ్రీ ఆర్.వెంకట సుజయకృష్ణ రంగారావు (బొబ్బిలి) : అధ్యక్షా, రాష్ట్రంలో బాలికలు, మహిళల మీద వేధింపులు ఎక్కువగా జరుగుతున్నాయి. మంత్రి గారి సొంత జిల్లా తూర్పుగోదావరిలో గ్రీన్ ఫీల్డ్ అంధుల ఆశ్రమ పాఠశాలలో కూడా జరిగిన సంఘటన దేశవ్యాప్తంగా టీవీలలో ప్రసారంకావడం ప్రజలలో చాలా ఆందోళన కలిగించింది. ఆ సంఘటన జరిగినపుడు అదృష్టవశాత్తు అక్కడ స్టాఫ్ మెంబర్ వీడియో తీయడంతో అది బయటికి రావడం జరిగింది. అటువంటి సంఘటనలు అరికట్టాలంటే కచ్చితంగా ప్రభుత్వం రెగ్యులేషన్ పెట్టి రేగ్యులేట్ చేయగలిగితే ఏమి జరుగుతుందో చూస్తే కచ్చితంగా ఈ అంశాలన్నీ కూడా బయటికి వచ్చే అవకాశముంది. గ్రీన్‌ఫీల్డ్ స్కూలులో జరిగిన సంఘటన మూడు రోజుల తర్వాత బయటికి వచ్చింది. ఆ పాఠశాలలకు ప్రభుత్వ గుర్తింపు లేదని చెబుతున్నారు. అన్ని పాఠశాలలు తప్పనిసరిగా ప్రభుత్వం గుర్తింపు పొందాల్సిన అవసరముంది. ఆ పాఠశాల కరెస్పాండెంట్/ప్రిన్సిపాల్ అమానుషంగా ప్రవర్తించినా కూడా అతనిపై నాన్‌బెయిలబుల్ సెక్షన్లు పెట్టడంతో అతను వెంటనే బయటికి వచ్చాడు. అలా కాకుండా కఠినమైన సెక్షన్లు పెట్టాల్సిన అవసరముంది. ఆ నిందితునిపై బెయిలబుల్ సెక్షన్లు పెట్టడంతో న్యాయమూర్తి గారే తీవ్రంగా స్పందించి కఠినమైన సెక్షన్లు పెట్టడం జరిగింది. కాబట్టి కేసు నమోదు సమయంలోనే కఠినమైన సెక్షన్లు పెట్టి శిక్ష కూడా తొందరగా పడే విధంగా చేసినచో మరలా ఇటువంటి సంఘటనలు జరగకుండా ఉంటాయి, కాబట్టి ప్రభుత్వం తీవ్రంగా స్పందించాల్సిన అవసరముందని మీ ద్వారా కోరుతున్నాను.

శ్రీ ఎన్.చినరాజప్ప (పెద్దాపురం): అధ్యక్షా, నేర నిరోధంలో భాగంగా పోలీసుశాఖ చర్యలు తీసుకుంటున్నది. ఈ చర్యలలో ముఖ్యంగా అసాంఘిక శక్తులపై నిఘా పెట్టడం జరుగుతున్నది. బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు, వసతిగృహాల వద్ద అనుమతిపై నిఘా పెట్టడం జరుగుతున్నది. సమస్యలున్న ప్రాంతాలలో పగలు పెట్రోలింగ్ కూడా చేయడం జరుగుతున్నది. స్థానిక పోలీసుస్టేషన్లలో సెల్‌ఫోన్లు వివిధ ప్రాంతాలలో పెట్టి అందరికీ అందుబాటులో ఉండే విధంగా పోలీసు శాఖ చర్యలు చేపడుతున్నది. పాఠశాల యాజమాన్యాలు, విద్యాసంస్థలతో సంప్రదించి ప్రైవేట్ సెక్యూరిటీ ఏర్పాటుచేసి నేర నిరోధక చర్యలు తీసుకోవడం జరుగుతున్నది. ఇంటి యజమానులు, హోటల్ యాజమాన్యాలతో చర్చించి పద్నాలుగు సంవత్సరాల లోపు బాలబాలికలను పనులలో పెట్టుకోకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఈ కేసులలో వెంటనే చర్యలు తీసుకోవడమే కాకుండా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ద్వారా కొన్ని చర్యలు తీసుకొని ప్రజలలో చైతన్యం తీసుకురావడానికి శిక్షణా కార్యక్రమాలు కూడా నిర్వహించడం జరుగుతోంది. 2012 నుంచి అమలులోకి వచ్చిన లైంగిక వేధింపుల చట్టం కింద 18 సంవత్సరాలలోపు బాలికలకు రక్షణ పథకం వచ్చింది. దానిని నిర్భయ చట్టంగా వ్యవహరించడం జరుగుతుంది. అలాగే గౌరవసభ్యులు రంగారావు గారు తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన సంఘటన గురించి చెప్పారు. ఆ విషయంలో తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని మీ ద్వారా సభకు తెలియజేస్తున్నాను.

ప్రశ్న నెం .279 (84):

**సర్వశ్రీ తెనాలి శ్రావణ్‌కుమార్, కె.ఎస్.జవహర్, తలారి ఆదిత్య, ఎమ్మెల్యేలు.**

**గౌరవనీయులైన గ్రామీణాభివృద్ధి, గృహనిర్మాణ మరియు పారిశుధ్యం శాఖ మంత్రి గారు దయచేసి ఈ కింది సమాచారం తెలియజేస్తారా;**

అ) ఆంధ్రప్రదేశ్ రాజీవ్ స్వగృహ కార్పోరేషన్‌లో జరిగిన అవకతవకలు ప్రభుత్వం దృష్టికి వచ్చాయా;
ఆ) ప్రభుత్వం నుంచి అనుమతిని తీసుకోకుండా ఈ భూములను బ్యాంకులలో తనఖా పెట్టిన విషయం వాస్తవమేనా;
ఇ) అయితే, సంబంధిత అధికారులకు వ్యతిరేకంగా ప్రభుత్వం తీసుకొన్న చర్య ఏమిటి?

**గ్రామీణాభివృద్ధి, గృహనిర్మాణం, పారిశుధ్యం శాఖ మంత్రి (శ్రీమతి కె.మృణాళిని):**

అ) అవశేషాంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎ.పి.రాజీవ్ స్వగృహ కార్పోరేషన్ లిమిటెడ్ కింద ప్రాజెక్టులను చేపట్టడంలో వాస్తవ డిమాండ్‌ను సరిగా మదింపు చేయని కారణంగా లోపపూరిత ప్రణాళిక ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది.

ఆ) అవశేషాంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎటువంటి భూములను బ్యాంకులలో తనఖా పెట్టలేదు.

ఇ) ఈ విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉంది.

...

శ్రీ టి.శ్రావణ్ కుమార్ (తాడికొండ): అధ్యక్షా, నమస్కారం. గౌరవ ముఖ్యమంత్రి గారు రాజీవ్ స్వగృహ గురించి చెబుతూ అవకతవకలు గుర్తించారా అంటే కొంత అవునని, కొంత కాదని కొంచెం సందిగ్ధంగా చెప్పారు. అయితే రెండవ ప్రశ్న గురించి ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోకుండానే భూములను బ్యాంకులో తనఖా పెట్టిన విషయం వాస్తవమేనా అని అడిగితే లేదని చెప్పారు. అయితే దీని గురించి నా దగ్గరున్న సమాచారం మంత్రి గారి దృష్టికి తీసుకువస్తున్నాను. రాజీవ్ స్వగృహ కార్పోరేషన్ విషయంలో చాలా సివియర్‌గా చర్యలు తీసుకోవాలి. అనేక రకాలైన అవకతవకలు జరిగాయి. మన రాష్ట్రంలో బలహీన వర్గాల వాళ్లకు గానీ, మధ్య తరగతి వాళ్లకు గానీ ఇళ్లు కట్టించడానికి హౌసింగ్ బోర్డు ఉంది. ఆ హౌసింగ్ బోర్డును పక్కనబెట్టి 2007వ సంవత్సరంలో గౌరవ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి గారు రాజీవ్ స్వగృహ అనే కార్పోరేషన్‌ను స్థాపించారు. దీని ఉద్దేశం మధ్య తరగతి వాళ్లకు ఇళ్ల నిర్మాణం చేపడతామని. దీనిలో ఇళ్ల నిర్మాణం కొరకు మార్కెట్ రేట్ల కంటే 25 శాతం తక్కువ ధరలకు ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పి అనేక అప్లికేషన్స్ కాల్ ఫర్ చేశారు. రాష్ట్రంలోని 127 మునిసిపాలిటీల్లో 176076 మంది నుంచి అప్లికేషన్స్ తీసుకున్నారు. అప్లికేషన్‌తోబాటు ఒక్కొక్కరి నుంచి ప్లాటు కోసం కార్పోరేషన్లలో రూ.5000/- మునిసిపాలిటీల్లో రూ.3000/- తీసుకున్నారు. అసలు ఈ కార్పోరేషన్ స్థాపించడమే చాలా దారుణం. దీని ద్వారా ఆనాటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి గారు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారు. పేరుకి మధ్య తరగతి ప్రజలందరికీ ఇళ్లు నిర్మిస్తామని చెప్పి ప్రత్యేకంగా కార్పోరేషన్ ఏర్పాటు చేశారు.

ఈ కార్పోరేషన్‌లో జరిగిన అవకతవకలను నేను స్పష్టంగా మంత్రి గారి దృష్టికి తీసుకు వస్తున్నాను. 29 మునిసిపాలిటీల్లో 100 కంటే తక్కువ అప్లికేషన్స్ వచ్చాయని మానేశారు. 99 మునిసిపాలిటీల్లో 174788 ఇళ్లు నిర్మిస్తామని కార్పోరేషన్ ఏర్పాటు చేశారు. ఇందులో రూ.8742 కోట్లతో 24 చోట్ల 49353 ఇళ్లు ప్లాట్లు నిర్మిస్తామని ప్రకటించి చివరకు అది చేయలేక 16680 కి తగ్గించారు. ఆ ఇళ్ల కొరకు రూ.2858 కోట్లతో అనుమతి ఇచ్చారు. అయితే రూ.1353 కోట్లు ఖర్చు చేశారు. అందులో రూ.920 కోట్లు కాంట్రాక్టర్లకిచ్చారు. రూ.364 కోట్లు ప్రజల నుంచి తీసుకున్నారు.

(ఈ సందర్భంలో "ఇప్పుడేమి చేస్తున్నారో చెప్పండి" అని వైఎస్ఆర్‌సీపీ సభ్యులు శ్రీ జలీల్ ఖాన్ అన్నారు)

తొందరపడకండి. మేము ఏమి చేస్తామో కూడా మంత్రి గారు చెబుతారు. రూ.1000 కోట్లు 5 బ్యాంకుల నుంచి అప్పు తెచ్చారు. దానికి రూ.257 కోట్లు వడ్డీ కట్టారు. ప్రతీ నెలా రూ.13 కోట్లు వడ్డీ చెల్లిస్తున్నారు అది కాకుండా కోటి రూపాయలు నిర్వహణకు ఖర్చవుతోంది. రోజుకి ప్రజల మీద రూ.45,00,000/- వడ్డీ భారం పడుతోంది. అంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎట్లా చేశారో చెబుతాను. హైదరాబాద్‌లో బండ్లగూడ గానీ, కూకట్‌పల్లి గానీ, గచ్చిబౌలి గానీ ఇందూ ప్రాజెక్టుకి ఇచ్చారు. బండ్లగూడలో ఇదే స్వగృహ కార్పోరేషన్‌కి రాజశేఖర్‌రెడ్డి గారు హౌసింగ్ కోసం రూ.4 కోట్లకు ఇచ్చిన దానిని ఇందూ ప్రాజెక్టుకి రూ.65,00,000 కే ఇచ్చారు. ఎక్కడో దూరంగా ఉన్న జవహర్ నగర్ గానీ, గాజుల రామారం గానీ, బహదూర్‌పల్లి గానీ పోచారం లాంటి ప్రాంతాల్లో ఎక్కువ రేట్లు పెట్టి ఇచ్చారు. అందుచేత ఈ స్వగృహ కార్పోరేషన్‌కి నష్టాలు వచ్చాయి. అందువలన ఎవరూ తీసుకునే పరిస్థితి లేదు. తరువాత వచ్చిన ప్రభుత్వాలు కూడా ఏ మాత్రం చర్య తీసుకోలేదు. దాని వలన నష్టం వచ్చి ప్రతీ నెలా అప్పులకు వడ్డీ కట్టాల్సి వస్తోంది. రూ.1100 కోట్లలో ప్రభుత్వం రూ.240 కోట్లు అప్పు ఇచ్చింది. ఈ అప్పును మొత్తం మే నెలలో చెల్లిస్తామని చెప్పారు. ఇంత వరకూ చెల్లించలేదు. అయితే ఇక్కడ ఇంకో విషయం ఉంది. 300 ఎకరాలు వేలం వేసి రూ.90 కోట్ల నిధులను సమకూర్చుకుంది. నేను అడిగేది ఒక్కటే ఇన్ని అవకతవకలు జరిగిన ఈ కార్పోరేషన్‌ని రద్దు చేసి హౌసింగ్ బోర్డులో పెట్టాలి. అంతే కాదు ఇందూ ప్రాజెక్టుకి వాస్తవమైన ధరలకు ఇచ్చారా, లేదా ఇచ్చిన వాటన్నింటినీ ప్రభుత్వం ఏ రకంగా తిరిగి తీసుకోవాలనుకుంటున్నది? ఆల్‌రెడీ ఉన్న కార్పోరేషన్‌ను పక్కనబెట్టి డబ్బులు సంపాదించడానికి, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడానికి తను అనుకున్న వాళ్లకు భూములను బదలాయించడానికి ఇలాంటి కార్పోరేషన్‌ను గౌరవ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి గారు ఏర్పాటు చేశారు. ఆ రకమైన దోపిడీ గతంలో జరిగింది కాబట్టి దీని మీద ఎంక్వైరీ వేయాలని మీద్వారా మంత్రి గారిని అడుగుతున్నాను.

శ్రీ జలీల్ ఖాన్ (విజయవాడ-వెస్ట్): అధ్యక్షా, ఉదయం లేచినప్పటి నుంచి వాళ్లకు రాజశేఖర్ రెడ్డి గారి మీద ఆరోపణలు చేయడమే పనిగా ఉంది. ఇప్పుడు ఏమి చేస్తారో చెప్పండి. ఆయన చనిపోయారు. సభలో లేని వారి గురించి మాట్లాడటం సభా సంప్రదాయం కాదు. కాబట్టి దయచేసి మీరు ఏమి చేయబోతున్నారనే విషయం మీద మాట్లాడితే చాలా బాగుంటుంది. సభా సమయం కూడా వృథా కాదు.

శ్రీమతి కిమిడి మృణాళిని (చీపురుపల్లి): అధ్యక్షా, రాజీవ్ కార్పోరేషన్‌పైన నిజంగా రాష్ట్రంలో చాలా అయోమయమైన పరిస్థితి, చాలా అస్తవ్యస్తమైన పరిస్థితి నెలకొని ఉంది. గౌరవ సభ్యులు తెలియచేసినట్లుగా రాష్ట్రంలో మధ్య తరగతి వారికి, దిగువ మధ్య తరగతికి గృహాలు

నిర్మాణం చేపట్టాలని ఆరోజు గత ప్రభుత్వం రాజీవ్ స్వగృహ కార్పోరేషన్‌ను 2007వ సంవత్సరంలో స్థాపించడం జరిగింది. ఆరోజు అప్లికేషన్‌కు రూ.250/- చొప్పున 176000 అప్లికేషన్స్ రావడం జరిగింది. మునిసిపాలిటీస్‌లో ఇండిపెండెంట్ హౌస్ అని రూ.3000/- అప్లికేషన్ ధర అని, అదే విధంగా కార్పోరేషన్‌లో రూ.5000/- చొప్పున సేకరించడం జరిగింది. ఆ విధంగా రాష్ట్రంలోని ఆంధ్ర ప్రాంతంలో 10 టౌన్‌షిప్పులు, తెలంగాణ ప్రాంతంలో 14 టౌన్‌షిప్పులు ఉమ్మడి రాష్ట్రంలో చేయడం జరిగింది. అయితే మొట్టమొదటిగా హైదరాబాద్ పరిసరాల్లోని చందానగర్‌లో 1140 ఇళ్లు ప్రారంభించడం జరిగింది. 1140 ఇళ్లను కట్టి అమ్మడం కూడా జరిగింది. దీనిని ఆధారంగా తీసుకొని ప్రభుత్వం ఏ విధమైన కార్యక్రమాలు సక్రమంగా చేయకుండా రాష్ట్రం అంతా దుందుడుకుగా 23 ప్రాంతాల్లో ప్రారంభించడం జరిగింది. ఆ విధంగా హైదరాబాద్ చుట్టూ 5 ప్రాంతాల్లో నాగోలు-బండ్లగూడ , పోచారం, జవహర్‌నగర్, గాజులరామారంలలో ప్రారంభించడం జరిగింది. చందానగర్‌లో 1140 ఇళ్లు, నాగోల్-బండ్లగూడలో 2750 ఇళ్లు, పోచారంలో 2800 ఇళ్లు, జవహర్‌నగర్‌లో 2500 ఇళ్లు, గాజులరామారం లో 2500 ఇళ్లు ఈ విధంగా హైదరాబాద్ చుట్టూ 5 మెగా టౌన్‌షిప్పులు ప్రారంభించడం జరిగింది. అయితే ఈ 23 టౌన్‌షిప్పులను ప్రారంభించడానికి ఏదైతే ప్రజల దగ్గర నుంచి రూ.90 కోట్లు సేకరించామో దానితో ప్రారంభించడం జరిగింది. అయితే దీనిలో వున్న గైడ్‌లైన్సు ప్రకారం 25 శాతం లబ్ధిదారుడు ముందుగా కట్టాలి. మిగతా 75 శాతం బ్యాంకు నుంచి లోన్లు హౌసింగ్ బోర్డు ద్వారా ఇవ్వడం జరుగుతుంది. అయితే ఎప్పుడైతే చందానగర్‌లో 1140 ఇళ్లు తొందరగా అమ్ముడు పోయాయో అప్పుడున్న ప్రభుత్వం పూర్తిగా హైదరాబాద్ చుట్టుప్రక్కల ఈ 5 మెగా టౌన్‌షిప్పులు ఏవైతే ఉన్నాయో వాటి కోసమే తీసుకున్న డబ్బంతా ఖర్చు పెట్టడం జరిగింది.

...

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంకు, హౌసింగ్ బ్యాంకు ఈ విధంగా 5 బ్యాంకుల నుంచి రూ.200 కోట్ల చొప్పున రూ.1000ను తీసుకోవడం జరిగింది. ఈ రూ.1000 కోట్లలో రూ.900 కోట్లను హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉన్న 5 మెగా టౌన్‌షిప్పులకు, కేవలం రూ.100 కోట్లను మాత్రమే ఆంధ్ర ప్రాంతంలో ఉన్న టౌన్ షిప్పులకు ఖర్చు పెట్టడం జరిగింది. ఎప్పుడైతే ఈ డబ్బులు సరిపోవడంలేదో, గృహాలను పూర్తి చేయలేకపోతున్నామో, అటువంటి పరిస్థితుల్లో మొదట రూ.105 కోట్లను ప్రభుత్వం ఋణంగా మంజూరు చేయడం జరిగింది. ఈ రూ.105 కోట్లలో కేవలం రూ.55 కోట్లను మాత్రమే ఆంధ్రా ప్రాంతానికి కేటాయించడం జరిగింది. అదేవిధంగా మళ్లీ రూ.256 కోట్లను ఇచ్చారు. ఈ రూ.256 కోట్లను పూర్తిగా తెలంగాణా ప్రాంతంలో హైదరాబాద్‌లో ఉన్న 5 మెగా టౌన్‌షిప్పులకే ఖర్చు చేయడం జరిగింది. ఈ విధంగా తీసుకున్న రూ.1351 కోట్లలో ఆంధ్రా ప్రాంతానికి కేవలం రూ.160 కోట్లను మాత్రమే ఖర్చు పెట్టారు. తెలంగాణా ప్రాంతంలో ఉన్న మెగా టౌన్‌షిప్పులకు రూ.1191 కోట్లను ఖర్చు పెట్టారు. ఈవిధంగా అస్తవ్యస్తంగా చేయడం, ఏ విధమైన ప్రణాళికలను రూపొందించకపోవడం వలన ఆంధ్రా ప్రాంతానికి నష్టం జరిగింది. కేవలం హైదరాబాద్ పరిసర

ప్రాంతాల్లో ఉన్న 5 మెగా టౌన్‌షిప్పులకే తీసుకున్న నిధులన్నింటినీ ఖర్చు చేయడం జరిగింది. ఏ విధమైన అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయంటే, Land alienation కాకుండా గృహ నిర్మాణాన్ని ప్రారంభించారు. గవర్నమెంటు నుండి పర్మిషన్ తీసుకోవడం జరిగింది. కానీ మ్యూటేషన్ అనేది జరగలేదు. అడంగల్‌లో గవర్నమెంటు నుంచి రాజీవ్ స్వగృహకి ట్రాన్స్‌ఫర్ చేసే విధంగా మ్యూటేషన్ జరగాలి. మ్యూటేషన్ జరగకుండా గృహ నిర్మాణాన్ని ప్రారంభించడం జరిగింది. అదే విధంగా డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ నుంచి పర్మిషన్ తీసుకోవాలి. ఆ పర్మిషన్‌ని కూడా తీసుకోకుండా గృహ నిర్మాణాన్ని ప్రారంభించడం జరిగింది.

అదే విధంగా రాజీవ్ స్వగృహను, ప్రస్తుతం Non-performing asset గా ప్రభుత్వం గుర్తించడం జరిగింది. దీనంతటికీ కారణం, Defective planning due to improper assesment of actual demand. అంటే డిమాండ్‌కు అనుగుణంగా అసెస్ చేసుకొని గృహ నిర్మాణాన్ని చేపట్టలేదు. అదే విధంగా ఫైనాన్షియల్ ప్లానింగ్ కూడా సరిగ్గా చేసుకోలేకపోయారు. అధిక మొత్తంలో రూ.1000 కోట్లను ఋణంగా తీసుకోవడం వల్ల వడ్డీనే రూ.400 కోట్లు జమ అయ్యింది. ఈవిధంగా ప్రస్తుతం రూ.1400 కోట్లు భారంగా ఉంది. వడ్డీలు ఎక్కువ కావడం వల్ల, ఆరోజు ఉన్న ఎస్ఎఫ్‌టి రేటు రూ.2100 ఏదైతే ఉందో, ఈ వడ్డీ రేటు పెరగడం వల్ల ఈరోజున ప్రాంతాల వారీగా, అక్కడున్న పరిస్థితులకు అనుగుణంగా ఇంచుమించు రూ.2700, రూ.2900 లకు ఎస్ఎఫ్‌టి రేటు పెరిగింది.

అదేవిధంగా land alienation జరగకుండా తీసుకున్నారు. ఈ విధంగా అనేక అక్రమాలు ఉన్నాయి. అదేవిధంగా ఏదైతే డబ్బును ప్రజల నుండి ఆరోజున వసూలు చేశారో, అవన్నీ కూడా ఏ ప్రాజెక్టుకు ఆ ప్రాజెక్టు ఖర్చు పెట్టకుండా, ఎక్కడైతే డిమాండ్ లేదో అక్కడ ఖర్చు పెట్టడం జరిగింది. దీని వల్ల ప్రజలకు అవసరమైన గృహాలను పూర్తి చేయలేకపోయారు. ఈ విధంగా అనేకమైన ప్రాజెక్టులను ఒకేసారి ప్రారంభించడం జరిగింది. Many projects simultaneously without proper demand leading to completion at various levels అదే విధంగా Accumulated interest burden stands till the works were stopped at different levels resulting in further loss. ఈ విధంగా చాలా అస్తవ్యస్తమైన పరిస్థితులు ఉన్నాయి. గత ప్రభుత్వంలో తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు, అవినీతి విధానం వలన ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వేల మంది ప్రజలు డబ్బులు కట్టి రాజీవ్ స్వగృహ నుంచి గృహాలు వస్తాయని ఆశపడిన మధ్యతరగతి, దిగువ మధ్య తరగతి ప్రజలు, ఆ గృహ నిర్మాణాలు నిలిచిపోవడం వలన ఈరోజున ఆంధ్ర రాష్ట్రంలో ఉన్న ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

**MR.SPEAKER: Question No. 194 (85) is postponed at the request of the Member.**

**Question No. 275 (86), Minister for Municipal Administration and Urban Development.**

**From now on, single supplimentaries only.**

శ్రీ పి.విష్ణు కుమార్ రాజు (విశాఖపట్నం-నార్త్) : (మైక్ లేకుండా) వారు చెప్పినవి వాస్తవాలు కాదు, కేవలం రాజశేఖరరెడ్డి గారి మీద బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారు. వాస్తవాలను నేను చెబుతాను, అవకాశం ఇవ్వండి అధ్యక్ష.

MR. SPEAKER: Now, there is no time. We have already exceeded the time.. Mr. Vishnu Kumar Raju garu, please kindly liste to me. There is a procedure laid down. When the question is over, I have already announced the next question and we have gone to the next question. Hence, it is not possible to come back to the previous question. Kindly come in a different form or question. Then I will give you an opportunity.

**ప్రశ్న నెం.275 (86) సర్వ శ్రీ గద్దె రామ్మోహన్, బోడె ప్రసాద్ ఎంఎల్ఏలు.**

**గౌరవనీయులైన పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?**

అ) విజయవాడ నుండి ఉయ్యూరుకు నిత్యం ప్రయాణిస్తున్న ప్రయాణీకులు ట్రాఫిక్ సమస్యలను ఎదుర్కొంటున్నారన్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా?

ఆ) ఆటోనగర్, కానూరు, పోరంకి మీదుగా ఎన్‌టిఆర్ విగ్రహం నుండి పునాదిపాడు వరకు రోడ్డును వేయాలని విజిటి పట్టణాభివృద్ధి సంస్థ ప్రతిపాదించిన విషయం వాస్తవమేనా?

ఇ) అయితే, ఆ వివరాలేమిటి?

**పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి (పి.నారాయణ) :**

అ) లేదండీ.

ఆ) లేదండీ.

ఇ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీ గద్దె రామ్మోహన్ (విజయవాడ-ఈస్ట్): అధ్యక్షా, మంత్రి గారు ఇచ్చిన సమాధానానికి అక్కడ వాస్తవాలు వేరుగా ఉన్నాయి. విజయవాడ నుండి ఉయ్యూరు రోడ్ అంటే దానిని బందర్ రోడ్ అంటారు. విజయవాడలో నిర్మాణాలు బాగా పెరిగిన తర్వాత నివాసాల కోసం అందరూ బందరు రోడ్ వైపుకు రావడం, ఆ రోడ్డు ఈరోజున కాదు గత పదిహేను ఇరవై సంవత్సరాల నుంచి చాలా రద్దీగా ఉండే రోడ్డది, ఆ విషయాన్ని గమనించాల్సిందిగా కోరుతున్నాను. నేను విజయవాడ పార్లమెంటు సభ్యుడిగా ఉన్నప్పుడు అంటే 15 సంవత్సరాల క్రితం, అక్కడి స్థానికుల కోరిక మేరకు బందర్ రోడ్డుకి పెర్లల్‌గా ఒక రోడ్డును నిర్మించాలనే ఉద్దేశంతో, ఎన్‌టిఆర్ సర్కిల్ నుంచి కానూరు మీదగా పోరంకి అక్కడ నుండి పునాదిపాడుకు ఒక రోడ్డు వేయాలని అనుకున్న మాట వాస్తవం కాదా అని అడుగుతున్నాను.

ఆ రోజున పార్లమెంటు సభ్యుడిగా రూ.25 లక్షలను నా నిధుల నుంచి, విజిటి ఉడా నుంచి రూ.75 లక్షలు, మున్సిపల్ కార్పోరేషన్ నుంచి రూ.50 లక్షలు ఆ విధంగా మొత్తం కోటిన్నర రూపాయలతో ఎన్‌టిఆర్ సర్కిల్ నుంచి సనత్‌నగర్ వరకు రెండున్నర కిలో మీటర్ల పరిధిలో రోడ్డును నిర్మించిన మాట వాస్తవం కాదా అని అడుగుతున్నాను. ఆ తర్వాత సనత్‌నగర్ నుంచి కానూరు వరకు రూ.6 కోట్లతో టెండర్లను పిలిచిన మాట వాస్తవం కాదా అని అడుగుతున్నాను. కాబట్టి కానూరు నుంచి పునాదిపాడు వరకు ఉన్న 11 కిలో మీటర్లను కూడా మనం పూర్తి చేసుకోగలిగితే బందర్‌రోడ్డుకి పెర్లల్‌గా ఒక చక్కటి రోడ్డును నిర్మించుకున్నట్లవుతుంది, తద్వారా ట్రాఫిక్‌ను కూడా నియంత్రించే అవకాశం ఉంది కాబట్టి, దయచేసి మంత్రి గారిని దాని మీద శ్రద్ధ వహించి దానికి కావాల్సిన నిధులను సమకూర్చగలరా అని నేను వారిని ప్రశ్నిస్తున్నాను.

శ్రీ పి.నారాయణ (మునిసిపల్ శాఖ మంత్రి) : అధ్యక్షా, 2002, 2006 సంవత్సరాల్లో విజిటిఎం అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ వారు ఎన్‌టిఆర్ విగ్రహం నుండి ఆటోనగర్ వరకు 2.25 కిలో మీటర్ల పొడవు గల రోడ్డుని 100 అడుగుల వెడల్పుతో వేయడం జరిగింది. ఆ తర్వాత ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ వారు 0.25 కిలో మీటర్ రోడ్డును పొడిగించడమైనది. విజిటిఎం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వారు ఆటోనగర్ నుంచి కానూరు గ్రామం వరకు 3.10 కిలో మీటర్ల పొడవు కలిగిన రెండు లైన్ల రోడ్డును రూ.6.25 కోట్లతో చేపట్టడం జరిగింది. ఇది తేది 17.04.2012న అడ్మినిస్ట్రేటివ్ క్లియరెన్స్ వచ్చింది. తేది 09.05.2013న టెక్నికల్ క్లియరెన్స్ కూడా వచ్చింది. ఆ తర్వాత తేది 02.07.2013న

టెండర్‌ను ఖరారు చేయడం జరిగింది. వల్లభనేని కన్‌స్ట్రక్షన్స్ వారు తేదీ.07.02.2014న అథారిటీ వారితో అగ్రిమెంటు చేసుకోవడం జరిగింది. పనులు ఇంకా ప్రారంభం కాలేదు. ఆ పనులను ప్రారంభించకపోవడానికి గల కారణమేమంటే encroachments remove కావాల్సి ఉంది. అంతే కాకుండా ఇరిగేషన్ డిపార్ట్‌మెంటు నుంచి క్లియరెన్స్ కూడా రావాల్సి ఉంది. ఈ రెండింటి విషయమై కృష్ణా జిల్లా కలెక్టర్‌కి, ఎస్ఇ, ఇరిగేషన్ వారికి తేది 14.08.2014న లేఖ రాయబడింది. వీలైనంత తొందరలో వాటిని క్లియర్ చేసి ఆ వర్కును టేకప్ చేయడం జరుగుతుంది. అయితే కానూరు గ్రామం నుండి పునాదిపాడు వరకు ప్రస్తుతం ఎటువంటి ప్రతిపాదన లేదు. అయితే అక్కడ ఉన్న ట్రాఫిక్ సమస్యను ఎస్టిమేట్ చేసి అవసరమైన చర్యలను తీసుకుంటాము.

శ్రీ జలీల్‌ఖాన్ (విజయవాడ-వెస్ట్): అధ్యక్షా, తమరి ద్వారా మంత్రి గారికి తెలియజేసేదేమంటే, విజయవాడ త్వరలోనే రాజధాని కాబోతుంది. ఇప్పటికే తాత్కాలిక రాజధాని అని చెప్పడం జరిగింది. దానిని దృష్టిలో పెట్టుకొని బందర్ రోడ్డులో గజం రూ.3 లక్షలు ఉన్న స్థలాల్లో ఆఫీసర్లు ఉంటున్నారు. ఆ స్థలాన్ని ఖాళీ చేయించి మల్టీస్టోరీడ్ బిల్డింగును నిర్మించినట్లయితే అటు కార్పోరేషన్‌కి ఇటు ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. అట్లాగే ఆఫీసర్లందరూ, హైదరాబాద్ నుంచి వచ్చిన ఆఫీసర్లకు స్థానికంగా ఉన్న వారికి కూడా అక్కడ స్థలాన్ని కేటాయించవచ్చు. దాని వల్ల కనీసం 15ఎకరాల స్థలం కలిసి వస్తుంది. దాని మీద మంత్రి గారిని దృష్టిని కేంద్రీకరించమని కోరుతున్నాను. అట్లాగే ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం నిమిత్తం ప్రభుత్వం రూ.2300 కోట్లను కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించడం చాలా సంతోషకరమైన విషయం. కానీ ఒకటి ఒకిటన్నర సంవత్సర కాలంలో మాకు పుష్కరాలు రాబోతున్నాయి. మీరు ఎప్పుడు శంఖుస్థాపన చేస్తారు? దానిని ఎప్పుడు పూర్తి చేస్తారనేది దయచేసి తెలియజేయాల్సిందిగా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

...

శ్రీ బోడె ప్రసాద్ (పెనమలూరు): అధ్యక్షా, సభలో మొట్టమొదటిసారిగా మాట్లాడే అవకాశం కల్పించిన గౌరవ స్పీకర్ గారికి మరియు సభకు నమస్కారాలు తెలియజేసుకుంటున్నాను. గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో ఆనాటి పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నటువంటి గద్దె రామ్మోహన్ రావు గారి వల్లనైతే గానీ, ఆనాటి మంత్రి గారైన స్వర్గీయ శ్రీ బి.వి.మోహన్ రెడ్డి గారి వల్లనైతే నేమి దాదాపు మూడు కిలోమీటర్ల దూరాన్ని విజయవాడ నగరంలోని పంటకాలువ రోడ్డును అభివృద్ధి చేసుకోవడం జరిగింది. అయితే, ఈరోజున బందరు రోడ్డు పరిస్థితిని చూసినట్లైతే దాదాపు 15-16 కిలోమీటర్ల దూరంలో గత 2012, 2013 మరియు 2014 వ సంవత్సరం ఈనాటి వరకు సుమారు 582కు పైగా రోడ్డు ప్రమాదాలు జరిగిన కారణంగా 168మంది చనిపోయినారనేది వాస్తవం. ఈరోజున బందురు రోడ్‌కు రెసిడెన్షియల్ కళాశాలలు గానీ, కళ్యాణ మంటపాలు గానీ, కార్పొరేట్ స్కూల్స్ గానీ,

హాస్పిటల్స్ విరివిగా పెరిగిపోయిన కారణంగా నిత్యం ట్రాఫిక్ జామ్ వల్ల ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాకుండా నిత్యం వి.ఐ.పి.లు తిరిగే రోడ్ కాబట్టి ట్రాఫిక్‌జామ్‌తో వాహనాలు ఎక్కడికక్కడ నిల్చిపోయే పరిస్థితిని నిత్యం చూడడం జరుగుతోంది. ఈరోజున లెనిన్ సెంటర్, బెంజ్ సర్కిల్ నుండి కంకిపాడు వెళ్లాలంటే సుమారు గంట సమయం తీసుకుంటోంది. ఈరోజున ఎటువంటి భూసేకరణ కూడా లేకుండా ఆటోనగర్ రోడ్ నుంచి పోరంకి లిమిట్స్ వరకు ఉన్న దాదాపు మూడు కిలోమీటర్ల దూరాన్ని అతి తక్కువ మొత్తంతో రూ.6.00 గానీ, రూ.7.00 కోట్ల వ్యయంతో ఆ రోడ్‌ను అభివృద్ధి చేసుకోవచ్చు. గతంలో ఆటోనగర్ నుంచి కానూరు వరకు రోడ్ విస్తరణ పనులకు టెండర్లను పిలిచే ప్రక్రియ పూర్తయింది. కాబట్టి ఆ టెండర్ల ద్వారా ఆరోడ్ విస్తరణ పనులను త్వరగా పూర్తిచేయాలని తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను. అలాగే పోరంకి నుండి గంగూర్ దాకా ఉన్న రోడ్‌ను ఎటువంటి భూసేకరణ అదనంగా లేకుండా అతి తక్కువ ఖర్చుతో అంటే సుమారు రూ.7.00-8.00 కోట్ల వ్యయంతో విస్తరించుకునే అవకాశం ఉంది కాబట్టి అక్కడ జరుగుతున్న రోడ్ ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని గానీ, సమస్య సత్వర పరిష్కారానికై మీద్వారా గౌరవ మంత్రిగారికి విన్నవించుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పి.నారాయణ (మునిసిపల్ శాఖా మంత్రి): అధ్యక్షా, గౌరవ సభ్యులు అడిగినట్టుగా దాదాపు 16.60 కిలోమీటర్ల రోడ్‌ను విస్తరించాల్సి ఉంది. ఇప్పటికే దాదాపు 2.50 కిలోమీటర్ల రోడ్ విస్తరణ పనులను ప్రభుత్వం పూర్తి చేయడం జరిగింది. తరువాత 3.10 కిలోమీటర్ల దూరం కల్గిన రోడ్ విస్తరణ పనులకు గాను నిధులు మంజూరైనాయి. పనులు సత్వరమే ప్రారంభమవుతాయి. మిగిలిన 11.00 కిలోమీటర్ల దూరం గల రోడ్‌ను పరిశీలించి ప్రభుత్వం తగు సత్వర నిర్ణయం తీసుకుంటుందనే విషయాన్ని తమరి ద్వారా సభకు తెలియజేస్తున్నాను.

**MR SPEAKER: Question No. 204 (87) Minister for Backward Classes**

**ప్రశ్న నెంబర్: 204 (87)** **శ్రీ ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే**

**గౌరవనీయులైన వెనుకబడిన తరగతుల సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా :-**

అ) ఆప్కో ద్వారా చేనేతకారులు ఉత్పత్తి చేసిన వస్త్రాలను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం వద్ద ఏదైనా ప్రతిపాదన ఉన్నదా;

ఆ) అయితే, ఆ వివరాలేమిటి?

**<u>వెనుకబడిన తరగతుల సంక్షేమం, చేనేత, జౌళి పరిశ్రమల శాఖ మంత్రి (శ్రీ కొల్లు రవీంద్ర) గారి సమాధానం:</u>**

అ) లేదండి

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీ ఆళ్ల రామకృష్ణారెడ్డి(మంగళగిరి): అధ్యక్షా, చేనేత సహకార సంఘాల నుంచి ఆప్కో గత మూడు మాసాలుగా కొనుగోలు చేసిన వస్త్రాలకు గాను డబ్బు చెల్లించకపోవడం కారణంగా రెక్కాడితే గానీ డొక్కాడని చేనేత కార్మికులు పూటగడవక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాబట్టి ఆప్కో కొనుగోలు చేసిన వస్త్రాలకు సంబంధించిన డబ్బును సత్వరమే చేనేత సహకార సంఘాలకు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని తమరి ద్వారా ప్రభుత్వాన్ని కోరుకుంటున్నాను. గతంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలుచేసిన కార్యక్రమమైన "జనతా వస్త్రాల కొనుగోలు" కార్యక్రమాన్ని మరల తిరిగి పునరుద్దరించడం జరుగుతుందనే విషయాన్ని మొన్నటి సార్వత్రిక ఎన్నికల సందర్భంగా తెలుగుదేశం పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చడం జరిగింది. కానీ నిన్నటి బడ్జెట్‌లో అందుకు సంబంధించిన నిధులను కేటాయించలేదు. ఆ కార్యక్రమాన్ని తిరిగి పునరుద్దరింపజేసి, అందుకు కావల్సిన నిధులను కేటాయించి చేనేత రంగాన్ని ఆదుకోవల్సిందిగా తమరి ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ కాగిత వెంకట్రావు (పెడన): అధ్యక్షా, గౌరవ మంత్రి గారు మొదటి ప్రశ్నకు సంబంధించి "ప్రభుత్వం వద్ద ఏ విధమైన ప్రతిపాదన లేదు" అని సమాధానం చెప్పారు. మా జిల్లాలో ఎక్కువ సంఖ్యలో చేనేత కార్మికులున్నారు. చేనేత సహకార సంఘాల్లో కోట్ల రూపాయల లోన్లు బకాయిలు ఉండడం వల్ల ఇప్పటికే చేనేత కార్మికులు తిరిగి వారు తయారు చేసిన చేనేత వస్త్రాలను చేనేత సహకర సంఘాల ద్వారానే విక్రయాలు చేసే అవకాశం లేకుండా పోతోంది. వెంటనే చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి, సదరు మొత్తాన్ని ప్రభుత్వం ద్వారా చెల్లించాలనే విషయంలో ఇప్పటికే గౌరవ మంత్రి గారికి రిప్రజెంటేషన్ ఇవ్వడం జరిగింది. సుమారు రూ.11.00 కోట్ల విలువైన చేనేత వస్త్రాల నిల్వలు మా జిల్లాలో ఉన్నట్టుగా సమాచారం ఉంది. చాలా పెద్ద మొత్తంలో నిల్వలుండడం వల్ల ఇవాళ కార్మికులకు జీవనోపాధి కరువైంది. ఆ కుటుంబాలకు వేరే స్థిరాస్తులు లేని కారణంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురౌతున్నారు. ఆప్కో ద్వారా వస్త్రాల కొనుగోలు జరిపి చేనేత కార్మికులకు సత్వరమే డబ్బు చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిందిగా తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ కొల్లు రవీంద్ర (మచిలీపట్నం): అధ్యక్షా, ఆప్కో ద్వారా చేనేత సహకార సంఘాల ద్వారా మాత్రమే ప్రొక్యూర్‌మెంట్ చేయడం జరుగుతోంది. ఇండివిజ్యువల్ వీవర్స్ నుంచి కూడా ప్రొక్యూర్‌మెంట్ చేపట్టాలనే ఉద్దేశం ప్రభుత్వానికి ఉంది. అవసరమైతే వారితో ఒక మ్యాచ్ సొసైటీగా ఏర్పాటు చేసి తద్వారా ప్రొక్యూర్‌మెంట్ చేపట్టాలనే ఆలోచనను ప్రభుత్వం చేస్తోంది. ఈ సంవత్సరం జూలై 14-15వ తేదీ వరకు ఉన్నటువంటి చేనేత నిల్వలను కొంతవరకు ప్రొక్యూర్‌మెంట్ చేయడం జరిగింది. మిగిలిన చేనేత వస్త్రాలకు సంబంధించిన రూ. 15.00 కోట్ల విలువ చేసే నిల్వలను కూడా త్వరలోనే ప్రొక్యూర్ చేసే దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకునే ప్రక్రియ ఇప్పటికే జరిగిపోయింది. నిధుల విడుదల కూడా జరిగింది. ఈ సంవత్సరం కూడా గత సంవత్సరం మాదిరిగానే ప్రతి వీవర్ దగ్గర ఉండే నిల్వలను కొనుగోలు చేసి పూర్తి స్థాయిలో చేనేత కార్మికులను ఆదుకోవడం జరుగుతుందనే విషయాన్ని తమరి ద్వారా సభకు తెలియజేస్తున్నాను.

**MR SPEAKER: Question No. 76 (88.) On behalf of the Hon'ble Chief Minister, Minister for Labour and Employment will answer the question.**

**గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:-**

అ) తూర్పు గోదావరి జిల్లాలోని అంతర్వేది, చింతలమోరి, శంకరగుప్తం, కేసనపల్లి, రాజోలులోని కరవాకలను ఒక సర్క్యూట్‌గా ఏర్పాటుచేసి, వాటిని పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసే ప్రతిపాదన ఏదైనా ఉందా;

ఆ) దేశంలోని ప్రధాన ఆధ్యాత్మిక కేంద్రాలలో ఒకటైన అంతర్వేది వద్ద యాత్రికుల సౌకర్యార్థం ఒక వసతి గృహాన్ని నిర్మించే ప్రతిపాదన ఏదైనా పర్యాటక శాఖ వద్ద ఉందా;

ఇ) అయితే, ఆ వివరాలేమిటి?

**గౌరవ ముఖ్యమంత్రి గారి తరపున కార్మిక మరియు ఉపాధి కల్పన శాఖ మంత్రి (శ్రీ కె.అచ్చెన్నాయుడు) గారి సమాధానం:**

అ) అవునండి. చింతలమోరిని ఎకో బీచ్ రిసార్ట్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేయడమవుతున్నది. అంతర్వేదిలో పర్యాటక అభివృద్ధిని మెగా పర్యాటక సర్క్యూట్ క్రింద మంజూరు చేయడమయింది.

ఆ) అవునండి.

ఇ) అంతర్వేది వద్ద పర్యాటక సదుపాయ కేంద్రం కోసం రూ.285.57లక్షల మొత్తాన్ని మంజూరు చేయడమయింది. పనులను త్వరలో ప్రారంభించడమవుతుంది.

* * *

శ్రీ గొల్లపల్లి సూర్యారావు (రాజోలు ): స్పీకర్ సార్, తూర్పు గోదావరి జిల్లా అనేక ప్రసిద్ధమైన పుణ్యక్షేత్రాలతో, సహజ సిద్ధమైన ప్రకృతి సౌందర్యాన్ని సంతరించుకున్న జిల్లా అని చెప్పవచ్చు. ఆ జిల్లాలో కోనసీమ అని పిలువబడే ఒక దివి ఉంది. ఆ దివి పూర్వకాలంలో క్రీస్తు పుట్టకమునుపే ఆ దివిని పరిపాలించిన నాగ జాతి సంతతికి చెందినటువంటి "నాగులు" అని పేరు గల్గిన ఒక రాజు పరిపాలించిన ప్రాంతం అది. ఈ కోనసీమ ప్రాంతంలో అంతర్వేది, ద్రాక్షారామం, అయినవెల్లి వంటి పుణ్యక్షేత్రాలు కల్గి ఉన్నాయి. గడచిన ఎనిమిది, తొమ్మిది సంవత్సరాల నుండి జిల్లాలోని దిండి అనే పర్యాటక కేంద్రాన్ని గత ప్రభుత్వం అభివృద్ధి పర్చింది. గత ప్రభుత్వం దిండి ప్రాంతాన్ని ఒక పర్యాటక కేంద్రంగా గుర్తించి అక్కడ ఒక రిసార్ట్‌ను నిర్మించడం జరిగింది. అక్కడే నాలుగైదు ప్రైవేట్ సంస్థలు రిసార్ట్స్‌ను నిర్మించడం వల్ల ఆ ప్రాంతం ఒక గొప్ప, ప్రముఖ పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందింది. రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటకులు ఆ ప్రాంతానికి నిరంతరం వచ్చి ప్రకృతి సౌందర్యాన్ని తిలకించడమే గాకుండా ఆ ప్రక్కనే ఉన్న ఆదూర్రు, అంతర్వేది వంటి పుణ్యక్షేత్రాలను సందర్శించుకునే అవకాశం కల్గింది.

అధ్యక్షా, గౌరవ మంత్రి గారు మొదటి ప్రశ్నకు సమాధానంగా "చింతలమోరిని ఎకో బీచ్ రిసార్ట్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేయడమవుతున్నది. అంతర్వేదిలో పర్యాటక అభివృద్ధిని మెగా పర్యాటక సర్క్యూట్ క్రింద మంజూరు చేయడమయింది" అని సభకు చెప్పడం జరిగింది. అందుకు నేను ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, ప్రస్తుతం మనం శాసనసభ సమావేశాలను నిర్వహించుకుంటున్న ఈ శాసనసభ కల్గిన ప్రాంతం కేవలం తాత్కాలికమే. మనమంతా జీతాలు పొందాలనుకున్నా, ప్రభుత్వోద్యోగులకు జీతాలు చెల్లించాలన్నా, ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలేవైనా ప్రభుత్వం చేయాలన్నా చాలా పెద్ద మొత్తంలో నిధులు మనకు కావల్సి ఉంటుంది. రాష్ట్ర విభజన అనంతరం మన రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మాట వాస్తవం. స్వతహాగా మన రాష్ట్రంలో కేంద్రీకృతమైన పదమూడు జిల్లాలు కూడా పర్యాటకంగా అభివృద్ధి గాంచిన ప్రాంతాలనడంలో ఎటువంటి సందేహం లేదు. తూర్పుగోదావరి దిల్లాలో ఇప్పటికే ఒక ప్రత్యేకమైన, నిర్దిష్టమైన వెనుకబడిన ప్రాంతాలుగా రాజోలు తదితర ప్రాంతాలు ఉన్నాయి. రాజోలు పరిసర ప్రాంతంలో ఉన్నటువంటి అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం ఉంది. ఆ దేవాలయం ఎప్పుడో త్రేతాయుగంలో వెలిసినటువంటి దేవాలయం అది. అంతేగాకుండా ఆ ప్రాంతంలో సుమారు నూరు

సంవత్సరాలకు పైబడిన క్రైస్తవ దేవాలయాలు కూడా చాలా ఉన్నాయి. ఆదుర్రు ప్రాంతంలో ఆనాటి అశోకుడు కాలం నాటి నుంచి ఉన్న బౌద్ధ దేవాలయం, బౌద్ధ క్షేత్రాలున్నాయి. కాబట్టి కోనసీమ ప్రాంతాన్ని ప్రత్యేక టూరిజమ్ ప్రాజెక్టుగా తీర్చిదిద్ది, కోనసీమ అనేది ఒక దివి కాబట్టి కోనసీమ దివిగా కొత్తగా నామకరణంచేసి ప్రత్యేక ప్యాకేజీ క్రింద సుమారు రూ.1,000.00 - 1,500.00 కోట్లు ఖర్చు చేసి ప్రభుత్వం ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేసినట్లైతే, బహుశా ఈ రాష్ట్రానికి సాలిన వచ్చే ఆదాయంలో కనీసం నాలుగొంతుల ఆదాయం ఈ కోనసీమ ప్రాంతం నుంచి వచ్చే అవకాశాలెక్కువగా ఉన్నాయి. ప్రభుత్వం ఈ ప్రాంత అభివృద్ధికి గాను ప్రత్యేక దృష్టి సారించి పర్యాటక రంగ సేవలను ఆ ప్రాంతంలో విస్తరింపజేసే ఆలోచన చేయాల్సిందిగా తమరిద్వారా గౌరవ మంత్రి గారిని కోరుకుంటున్నాను.

...

మిస్టర్ స్పీకర్ : వర్మ గారు..

శ్రీ ఎస్‌విఎస్‌ఎన్.వర్మ (పిఠాపురం) : నమస్కారం అధ్యక్షా, టూరిజం అభివృద్ధి గురించి గడచిన 10సంవత్సరాలుగా మా తూర్పుజిల్లాకు సంబంధించి ఏ విధమైన అభివృద్ధి జరుగలేదు. గౌరవ ముఖ్యమంత్రిగారు అభివృద్ధిని ప్రతిష్టాత్మకంగా తీసుకోడం చాలా అభినందదాయకం. గోదావరి కాకుండా సముద్రతీర ప్రాంతమైన కాకినాడ, ఉప్పాడ, తొండంగి సుదీర్ఘమైన తీరప్రాంతం తూర్పుగోదావరి జిల్లాలో ఉండటం చాలా అదృష్టం. కాకినాడ నుండి క్రూయిజి టూరిజంగా పర్యాటకులకు డెవలప్ చేస్తున్నారా, ఉప్పాడ తీరప్రాంతంలో టూరిజం అభివృద్ధి చేస్తున్నారా, ఇంతేకాకుండా టూరిజం ప్రాంతాలున్నచోట ప్రజల ఇల్లులు ఏవైతే ఉన్నాయో అవి పర్యాటకులకు ఇచ్చే విధంగా, వారిని కూడా ఆర్థికంగా తోడ్పాటు చేస్తే బాగుంటుందని ఆ అవశ్యకత ఉందని తెలియజేసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్ : మినిస్టర్ గారు.

శ్రీ కె.అచ్చెన్నాయుడు (టెక్కలి) : అధ్యక్షా, నూతనంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి పర్యాటక శాఖ ఒక ప్రాధాన్యతాంశంగా తీసుకోవడం జరిగింది. ఒక్కప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్న సమయంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పర్యాటక రంగానికి పేరు వచ్చినటువంటి సంగతి ఇక్కడున్న సభ్యులందరికీ తెలుసు. గతంలోకి మేము వెళ్లము. ఈరోజు పర్యాటక శాఖను అభివృద్ధి చేసుకుంటే రాష్ట్ర ఆదాయం పెరగడమే కాకుండా ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ, చాలా మందికి ఉపాధి దొరికే అవకాశాలున్నాయి కాబట్టి ముఖ్యమంత్రిగారు ప్రత్యేకంగా ఈ శాఖను తమవద్ద ఉంచుకొని ఉన్నటువంటి అవకాశాలు ఉదాహరణగా చూస్తే తూర్పుగోదావరి జిల్లాలో చాలా పర్యాటక ప్రాంతాలున్నాయి. అవన్నీ కూడా వెలికితీయడం జరుగుతుంది. ఈరోజు కేంద్రప్రభుత్వ సహాయంతో ముఖ్యంగా కోనసీమ ప్రాంతంలో చాలా వరకు గుర్తించడం జరిగింది. ఈ కోనసీమ ప్రాంతమే కాకుండా విశాఖపట్నానికి సంబంధించి

అరకు వ్యాలీకి గానీ ఆ ప్రాంతంపై ప్రత్యేకమైన దృష్టి సారించి అక్కడ కూడా కొన్ని ప్రాజెక్ట్సును గుర్తించాం.

అధ్యక్షా, దీనికి తోడుగా మన 13 జిల్లాల్లో 970కిమీ. సుదీర్ఘమైన తీరప్రాంతం ఉంది. తీర ప్రాంతాలను కూడా ఒక పర్యాటక కేంద్రాలుగా తయారు చేయాల్సి ఉంది. మన రాష్ట్రంలో బౌద్ధిజం ఉంది దానిని కూడా పరిగణనలోనికి తీసుకొని ఉన్నటువంటి అవకాశాలన్నీ తీసుకొని కొద్ది రోజుల్లోనే డెవలప్ చేస్తాం. గతంలో మన రాష్ట్రానికి వచ్చేటువంటి ఆదాయాల్లో ఎక్కువ ఆదాయం పర్యాటక శాఖకు నుండి వచ్చేది. మళ్లీ అదే స్థాయిలో దేశ, విదేశాలనుండి పర్యాటకులందరినీ ఆకర్షించే విధంగా, ఆంధ్రప్రదేశ్ పర్యాటకంగా అభివృద్ధి జరిగిందని అందరు చెప్పుకునే విధంగా అన్నీ ప్రాజెక్టులను గుర్తించాం. ఈ విషయం కేంద్రప్రభుత్వం దృష్టిలో పెట్టాం. వీలైనంత తొందరగా ఆంధ్రప్రదేశ్‌ను ఒక పర్యాటక హబ్‌గా తయారు చెయ్యాలని ముఖ్యమంత్రిగారు నిర్ణయించారు. వీలైనంతర త్వరలో ఆ కార్యక్రమం తుది రూపం దిద్దుకుంటుందని తెలియజేసుకుంటున్నాను. జిల్లా కలెక్టర్స్‌ను మీ , మీ జిల్లాల్లో ఏవైనా టూరిస్ట్ సెంటర్స్ ఉంటే గుర్తించాల్సిందిగా లేఖలు ద్వారా కోరాం. మన రాష్ట్రంలో చాలా పుణ్యక్షేత్రాలున్నాయి. అవన్నీ పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. అన్నీ జిల్లాల కలెక్టర్స్‌ను మీ జిల్లాల్లోని పర్యాటక కేంద్రాలను తెలియపర్చవల్సిందిగా లేఖలు రాయడం జరిగింది. అదే విధంగా పబ్లిక్ సలహాలు తీసుకొని ఒక్క చోటే కాకుండా అన్నీ ప్రాంతాల్లో 13 జిల్లాలను పరిగణనలోకి తీసుకుంటాం. పర్యాటక శాఖను ఆదాయ మార్గం ద్వారానే కాకుండా ప్రతి ఒక్కరికీ ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ఈ శాఖ ద్వారా సేవలందిస్తామని మీ ద్వారా సభ్యులకు రాష్ట్ర ప్రజానీకానికి తెలియజేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్ ః ప్రశ్న నెంబరు 209. మినిష్టర్ ఫర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్.

**ప్రశ్ననెంబరు.209 (89)**

**శ్రీ ఎం.అశోక్‌రెడ్డి. ఎమ్మెల్యే**

**గౌరవనీయులైన పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా ః**

ఎ) గిద్దలూరు పట్టణంలో త్రాగునీరు కొరతగా వున్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా ?

బి) అయితే, ఈ విషయంలో ప్రభుత్వం తీసుకొన్న చర్యల వివరాలు ఏమిటి ?

**పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి (శ్రీ పి. నారాయణ) గారి సమాధానం.**

ఎ) అవునండి.

బి) గిద్దలూరు పట్టణంలో త్రాగునీటి కొరతను అధిగమించడానికి తగిన ప్రత్యామ్నాయ వనరును ప్రభుత్వం గుర్తించడమవుతున్నది. ఈ విషయంలో ప్రాసెస్ ఉంది.

మిస్టర్ స్పీకర్ : అశోక్ రెడ్డి గారు.

శ్రీ ఎం.అశోక్‌రెడ్డి (గిద్దలూరు) : అధ్యక్షా, మంత్రిగారు గిద్దలూరు త్రాగునీటి సమస్య ఉందని గుర్తించినందుకు సంతోషంగా ఉంది. మా గిద్దలూరులో ఎక్కువగా ఫ్లోరైడ్ ఎఫెక్ట్ ఉన్నటువంటి వాటర్ ఉంది. అక్కడ మాకు రోజుకు 2.92 మిలియన్స్ లీటర్ల నీరు రిక్వైర్‌మెంట్ ఉంది. అక్కడ సప్లై చేసేది మాత్రము 1.33 మిలియన్ లీటర్లు రోజుకు సప్లై చేస్తున్నారు. దీనికి సంబంధించి 73 పవర్ బోర్స్ ద్వారా, 40 ట్రిప్పుల ట్రాక్టర్స్ నీరు తోలకం ద్వారా 1.33 మిలియన్స్ నీరును మాకు సరఫరా చేయడం జరుగుతోంది. ఈ సమస్య తీర్చేందుకు 2005వ సంవత్సరంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటుకు పర్మిషన్ ఇవ్వడం 2007లో దానిని ప్రారంభించి ఏదైతే ఒక ప్రజాప్రతినిధికి లాభం చేకూర్చే విధంగా ఉందో దానిని ఆర్‌డబ్ల్యుఎస్ డిపార్ట్‌మెంట్ వారు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను, పైప్‌లైన్ సోర్స్‌ను పట్టించుకోకుండా 11.4కిమీ. ఉన్నటువంటి దాంట్లో ఎస్ఎస్.ట్యాంక్ నుండి గిద్దలూరు వరకు 5.4కిమీ. ఏర్పాటు చేశారు. కానీ ఫారెస్ట్‌లో ఉన్నటువంటి బైరేడిగుండాను ఫారెస్ట్‌లో ఉన్న 6 కిమీ.లను పైపులైన్ ఏర్పాటును ఫారెస్ట్ క్లియరెన్స్ లేదనే కారణంగా నిలుపుదల చేశారు.

ఫారెస్ట్ క్లియరెన్స్ ఇప్పించి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వచ్చేట్లు చేస్తే మా సమస్య తీరుతుంది. అంతేకాకుండా గిద్దలూరుకు నల్లమల ఫారెస్ట్‌లో సఖిలేరు అనే వాగుపై చెక్‌డ్యాం నిర్మించి, ఆ చెక్‌డ్యాం ద్వారా ఇప్పుడున్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌కు, చెక్‌డ్యామ్‌కు తగినన్ని నిధులు ఇవ్వగలరని మంత్రిగారిని కోరుకుంటున్నాను. మా గిద్దిలూరులో 14.2 కిమీ.ల పైపు లైను 35 సంవత్సరాల కిందట వేసిన పైప్‌లైన్ పూర్తిగా తుప్పుపట్టి పోయి, నీరు కలుషితమై ప్రజలు రోగాల బారీనా పడుతున్నారు. ఆ పైపులైను మార్చడానికి కావల్సిన డబ్బును శాంక్షన్ చేయమని తమ ద్వారా మంత్రిగారిని కోరుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్ : మంత్రిగారు..

శ్రీ పి.నారాయణ (మునిసిపల్ శాఖ మంత్రి) : అధ్యక్షా, గిద్దలూరులో 41813 మంది జనాభా ఉన్నారు. 73 బోర్‌వెల్స్ ద్వారా మరియు ఒక్కొక్క ట్యాంకర్ 4000 లీటర్లు చొప్పున 4 ట్యాంకర్స్ ద్వారా 40 ట్రిప్పులు ద్వారా వాటర్ సప్లై చేయబడుతుంది. ఈ మధ్య 5 బోర్‌వెల్స్ ఎండిపోగా ప్రస్తుతం 68 బోర్‌వెల్స్ మాత్రమే పనిచేస్తున్నాయి. వీటిద్వారా 2.30 ఎంఎల్‌టి. వాటర్ సరఫరా చేస్తున్నాం. అయితే లీన్ పిరియడ్‌లో1.15ఎంఎల్‌టీ. మాత్రమే అక్కడ సప్లై చేయడం జరుగుతుంది. సభ్యులు చెప్పినట్లు 2007వ సంవత్సరంలో రూరల్ వాటర్ సప్లై వారు రూ.6.కోట్లతో ఒక ప్రాజెక్టును టేకప్ చేశారు. దీనిద్వారా 15 గ్రామాలకు మరియు గిద్దలూరు పట్టణానికి వాటర్ సప్లై చేసే విధంగా, ప్రత్యేకించి గిద్దలూరు పట్టణానికి 1ఎంఎల్‌టి. వాటర్ సప్లై చేసేవిధంగా ఇచ్చారు. అందులో ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ 6కిమీ. క్లియరెన్స్ రావల్సి ఉంది. అది ఆగిపోయింది. దానిని వీలైనంత త్వరలో క్లియరెన్స్ చేసి గిద్దలూరుకు ఆ 1ఎంఎల్‌టి. వాటర్ సప్లై వచ్చే విధంగా చేస్తాం.

**MR.SPEAKER: Question No.82 (90) postponed at the request of the Member.**

**Moving the Demands for Grant for the year 2014-2015.**

SRI PRATHIPATI PULLA RAO (MINSITER FOR AGRICULTURE, AGRI-PROCESSING, MARKETING AND WAREHOUSING, ANIMAL HUSBANDRY AND FISHERIES): Sir, with your permission, I beg to move:

"That the Government be granted a sum not exceeding Rs.7523,61,91,000/- under Demand No. XXVII (27) –Agriculture."

"That the Government be granted a sum not exceeding Rs.913,94,51,000/- under Demand No. XXVIII (28)- Animal Husbandry and Fisheries."

SRI BOJJALA GOPALAKRISHNA REDDY (MINISTER FOR ENVIRONMENT AND FORESTS, SCIENCE AND TECHNOLOGY AND CO-OPERATION): Sir, with your permission, I beg to move:

"That the Government be granted a sum not exceeding Rs.156,87,40,000/- under Demand No. XXX (30) Cooperation".

శ్రీమతి పరిటాల సునీత (రాప్తాడు): అధ్యక్షా, పౌరసరఫరాల శాఖ పరిపాలనకు సంబంధించిన 2014-15కు మెత్తం ప్రణాళికా, మరియు ప్రణాళికేతర పథకాల కింద రూ.

2342.86 బడ్జెట్ ప్రతిపాదనలను సభ ముందు ఉంచడం జరిగింది. ఈ ప్రతిపాదనలను ఆమోదించవలసినదిగా కోరుతున్నాను.

...

SRI RAVELA KISHORE BABU (MINISTER FOR SOCIAL WELFARE) ON BEHALF OF SRI GANTA SRINIVASA RAO, (MINISTER FOR HUMAN RESOURCES DEVELOPMENT) Sir, on behalf of Minister for Human Resources Development: with your permission, I beg to move:

"That the Government be granted a sum not exceeding Rs.12594,63,55,000/- under Demand No. XII (12) – School Education."

"That the Government be granted a sum not exceeding Rs.2349,69,85,000/- under Demand No. XIII (13) – Higher Education."

"That the Government be granted a sum not exceeding Rs.737,07,09,000/- under Demand No. XIV (14) – Technical Education."

SRI K. ATCHENNAIDU (MINISTER FOR LABOUR AND EMPLOYMENT, FACTORIES, YOUTH AND SPORTS, SKILL DEVELOPMENT AND ENTREPRENEURSHIP) Sir, with your permission, I beg to move:

"That the Government be granted a sum not exceeding Rs.126,21,62,000/- under demand No. XV (15) –Sports and Youth Services ".

SRI BOJJALA GOPALAKRISHNA REDDY (MINISTER FOR FORESTS) ON BEHALF OF SRI KAMINENI SRINIVAS, (MINISTER FOR HEALTH AND MEDICAL EDUCATION) on behalf of Minister for Health and Medical Education: Sir, with your permission, I beg to move:

"That the Government be granted a sum not exceeding Rs.4387,94,44,000/- under Demand No. XVI (16) – Medical and Health."

**MR. SPEAKER: Discussion on Demands for grants on Agriculture, Animal Husbandry and Fisheries will be taken up on tomorrow.**

**Leave of Absence was granted to Minister for Irrigation. Discussion on Demands for grants on Irrigation will be taken on Wednesday.**

**Now the House is adjourned for Tea Break for 15 Minutes.**

**(Then the House stands adjourned (10.43 am) for Tea Break for 15 minutes.)**

…

**(స్వల్ప విరామానంతరం సభ తిరిగి గం.11.16 ని.లకు ప్రారంభమైనది.)**
**(గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు.)**

* * *

## సంతాప తీర్మానం

మిస్టర్ స్పీకర్: సంతాప తీర్మానం. సభానాయకులు, శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు.

శ్రీ నారా చంద్రబాబునాయుడు (కుప్పం): అధ్యక్షా, నిన్నటిరోజున పరమపదించిన శ్రీ బాపు గారికి, సంతాప తీర్మానం ప్రవేశపెడుతున్నాను. తెలుగు గీతకు, తెలుగు రాతకు ప్రాణ ప్రతిష్ట చేసిన వ్యక్తి శ్రీ బాపు గారు. ప్రఖ్యాత దర్శకుడు. మహా చిత్రకారుడు. ప్రముఖ కార్టూనిస్టు. అటువంటి వారు ఈరోజు లేరంటే నమ్మలేకపోతున్నాను. వారు, గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ, నిన్నటిరోజున, చెన్నైలోని మలర్ హాస్పిటల్‌లో తుదిశ్వాస విడిచారు. మనం ఒక మహాదర్శకుడిని పోగొట్టుకున్నాం. ఒక ధ్రువతార నేలరాలింది. 1933 డిసెంబరు 15వ తారీఖున పశ్చిమ గోదావరి జిల్లా, నర్సాపూర్‌లో వారు జన్మించారు. వారి అసలు పేరు సత్తిరాజు లక్ష్మీనారాయణ. వారి తల్లిదండ్రులు శ్రీమతి సూర్యకాంతం, శ్రీ వేణుగోపాల రావు.

శ్రీ బాపు గారు, వారి 12వ ఏటనే ఆంధ్రపత్రికలో పొలిటికల్ కార్టూనిస్ట్‌గా చేరడంతో వారి యొక్క కెరీర్ ప్రారంభమయ్యింది. తెలుగు తెరను తేజోవంతంగా చేసిన గొప్ప దర్శకుడిగా ఎదిగారు. చిత్రకారుడిగా వారు గీసిన బొమ్మ, 'బాపుగారిబొమ్మ'గా ప్రపంచస్థాయి బ్రాండింగ్ సంపాదించుకుంది. ఇల్లస్ట్రేటర్‌గా, కార్టూనిస్ట్‌గా, డిజైనర్‌గా, మూవీ డైరెక్టరుగా అంచెలంచెలుగా ఎదిగిన బాపుగారు, తెలుగు అక్షరానికి క్రొత్త సొగసులు దిద్దారు. వారు గీసిన బొమ్మ 'బాపుబొమ్మ' అయితే, వారు వ్రాసిన వ్రాత 'బాపు ఫాంట్'గా రూపుదిద్దుకుంది. దర్శకుడిగా, చిత్రకారుడిగా, కార్టూనిస్టుగా... బాపుగారికి ఈ ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపు వచ్చింది. వారు ఎదగని ఎత్తుల్లేవు. వారు ఎరుగని ఎల్లలు లేవు. అలాంటి ఒక మహావ్యక్తి వారు.

తెలుగువాకిట వేసిన 'ముత్యాల ముగ్గు'... 'బాపు'. తెలుగునాట వెలిగిన 'గోరంత దీపం'... 'బాపు'. తెలుగులోగిళ్ళ 'సంపూర్ణ రామాయణం'... 'బాపు'. తెలుగుదనానికి నిలువెత్తు 'సాక్షి'... 'బాపు'. తెలుగువారి 'పెళ్ళిపుస్తకం'... 'బాపు'. తెలుగింట వెల్లివిరిసిన స్నేహం ... 'బాపు'. తెలుగు మధ్యతరగతి 'సుందరకాండ'... 'బాపు'.

...

తెలుగు అక్షరాన్ని తేజోవంతం చేసిన శ్రీనాథ కవిసార్వభౌముడు బాపు గారు. తెలుగుసీమలో సీతాకల్యాణం జరిపించిన రామబంటు బాపు. తెలుగు చిన్నారులకు బాలరాజు కథలు చెప్పిన బుడుగు బాపు. తెలుగు సినీ కథానాయకున్ని అందాలరామున్ని చేసిన బుద్ధిమంతుడు బాపు. తెలుగుజాతికి శ్రీరామరాజ్యం అందించిన త్యాగయ్య బాపు. 1953, 1955లలో మద్రాసు యూనివర్సిటీలో వరుసగా బీకాం, బి.ఎల్. పట్టాలు పొందారు. అక్కడ నుంచి తన వృత్తిని ప్రారంభించారు. తన 10 సంవత్సరాల వయస్సులో శ్రీ ముళ్ళపూడి వెంకట రమణ గారితో పరిచయం అయ్యింది. అప్పటి నుంచి ఇద్దరూ ప్రాణ స్నేహితులుగా మెలిగారు. ఒకే ఇంట్లో క్రింది పోర్షన్‌లో బాపు గారుంటే, శ్రీ రమణ గారు పై పోర్షన్‌లో ఉండేవారు. మొట్ట మొదటిసారిగా 1945వ సంవత్సరంలో 'అమ్మమాట వినకపోతే' అనే టైటిల్‌తో రమణ గారు కథ రాస్తే దానికి బాపు గారు బొమ్మ గీశారు. అది 'బాల' అనే మ్యాగజైన్‌లో ప్రచురించారు. అక్కడ నుంచి నిన్నటి శ్రీ నందమూరి బాలకృష్ణ నటించిన 'శ్రీరామరాజ్యం' వరకు వారి సాన్ని హిత్యం కొనసాగింది.

హిందూ పురాణ పాత్రల్ని తన చిత్రలేఖనం ద్వారా ప్రపంచానికి చాటి చెప్పారు. తన చిత్రాలతో బొమ్మల రామాయణాన్ని తీర్చిదిద్దారు. ఒక చిత్రకారుడిగా ఆయన ఖండాంతరాలు దాటి తెలుగు వారి ప్రతిష్టను ఇనుమడింపచేశారు. పురాణపురుషులైన కృష్ణుడు, రాముడు ఎలా ఉంటారో బొమ్మలతో ఆయన గీసి వారికి ఒక రూపం ఇచ్చిన మహావ్యక్తి బాపు గారు.

పొడువాటి వాలుజడ, చారడేసి కళ్లు, అందమైన మోముతో తెలుగు అమ్మాయిలను ఏ విధంగా చిత్రీకరించారో చిత్రీకరించారు. వ్యక్తులు, జాతి ఏ విధంగా ఉండాలి, పురాణపురుషులు ఏ విధంగా ఉండి ఉంటారు అనే దానికి రూపురేఖలు దిద్దిన వ్యక్తి బాపు గారు.

ఇతిహాస పాత్రలైన శివుడు, భీముడు, దుర్యోధనుడు తనదైన శైలిలో వారు ఏ విధంగా ఉంటారో చిత్రీకరించారు. వారు తీసిన ఒక్కొక్క చిత్రం ఒక్కొక్క మహాకావ్యంగా తీర్చిదిద్దారు. తెలుగు, తమిళం, హిందీ బాషల్లో 51 చిత్రాలకు వారు దర్శకత్వం వహించారు.

వాల్మీకి మహర్షి రామాయణాన్ని గ్రంథస్తం చేస్తే బాపు గారు దానిని అద్భుత దృశ్యకావ్యంగా 'సంపూర్ణ రామాయణం'గా మలిచారు. సీతమ్మ తల్లిని సుగుణాల రాశిగా,

తెలుగింటి అందాల భరణిగా మార్చిన చిత్రం 'సీతా కల్యాణం' మలిచింది బాపు గారే. ఒక కళా ఖండంగా మిగిలిపోయే చిత్రం 'ముత్యాల ముగ్గు'.

నటసామ్రాట్ శ్రీ అక్కినేని నాగేశ్వరరావు గారికి లెక్కలేని అవార్డులు వచ్చాయంటే దానికి కారణం బాపు గారే. శ్రీ నందమూరి తారక రామారావు గారితో చాలా చనువుగా ఉండడమే కాకుండా ఎన్టీఆర్ రాజకీయాలలో ఉన్నప్పుడు 'శ్రీనాథ కవిసార్వభౌముడు' చిత్రాన్ని తీశారు. శ్రీ నందమూరి తారక రామారావు గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బాపు, రమణలను ఉపయోగించుకొని విద్యావిధానంలో ఏ విధమైన మార్పులు తీసుకొని రావాలో 'దృశ్య శ్రవణ విద్యా విధానం'లో వారిద్దరినీ భాగస్వాములను చేశారు. త్యాగయ్య, భక్త కన్నప్ప, రామాంజనేయ యుద్ధం తదితర పౌరాణిక చారిత్రక చిత్రాలు చేయడంలో వారు తోడ్పడ్డారు.

బాపు గారికి రాని అవార్డులు లేవు. 2013వ సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం 'పద్మశ్రీ'తో సత్కరించింది. 1986వ సంవత్సరంలో రఘుపతి వెంకయ్య జీవిత సాఫల్య అవార్డు అందుకున్నారు. తిరుపతిలోని అకాడమీ ఆఫ్ ఫైన్ఆర్ట్స్ నుంచి, రాష్ట్రపతి నుంచి అవార్డ్‌లు పొందారు. ముత్యాలముగ్గు, మిస్టర్ పెళ్లాం చిత్రాలకు జాతీయ ఉత్తమ చలనచిత్ర పురస్కారాలు వచ్చాయి. 1978వ సంవత్సరంలో 'సీతాకల్యాణం', 1980వ సంవత్సరంలో 'వంశవృక్షం' చిత్రాలకు 'ఫిల్మ్‌ఫేర్' అవార్డులు వచ్చాయి. ఇటీవల వారు తీసిన 'శ్రీరామరాజ్యం' చిత్రానికి నంది అవార్డు వచ్చింది. ఇలా అనేక అవార్డులు వారికి వచ్చాయి. అలాంటి వ్యక్తి చనిపోవడం తెలుగు జాతికి ఒక తీరనిలోటు. వారికి నివాళులు అర్పించాల్సిన అవసరం ఉంది. ఇలాంటి వ్యక్తిని శాశ్వతంగా భావితరాలు గుర్తుపెట్టుకోవాలి. విజయవాడలోని కోస్టల్ మ్యూజియానికి బాపు గారి పేరు పెట్టాలని ప్రభుత్వం తరపున ఆలోచిస్తున్నాం.

(అధికారపక్ష సభ్యులు బల్లలు చరిచారు)

కొత్త రాజధానిలో ఒక వరల్డ్ క్లాస్ కళాక్షేత్రం నిర్మించి 'బాపు రమణ కళాక్షేత్రం' అని పేరుపెట్టాలని యోచిస్తున్నాం. వారిరువురూ కలిసి పనిచేయడమే కాకుండా 70 సంవత్సరాలు స్నేహితులుగా ఉన్నారు. మిత్రులకు మారుపేరుగా, ఆదర్శంగా ఉన్నారు.

రేపు వారి అంతిమ సంస్కారాలు ఉన్నాయి. వారి అబ్బాయి జపాన్ నుంచి రావాలి. ఆ కార్యక్రమానికి మంత్రి గారిని పంపించి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరఫున తుది వీడ్కోలు పలుకుతామని తెలియజేస్తున్నాను. వారి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి (పులివెందుల): అధ్యక్షా, బాపు గారి మరణం నేపథ్యంలో సానుభూతిని తెలిపే అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను. మరణం లేని మహా మనిషి బాపు గారు. తెలుగు వారు ఎప్పటికీ గుర్తించుకునే వ్యక్తి. 80 సంవత్సరాల వయస్సులో అనారోగ్యంతో బాధ పడుతూ తుది శ్వాస విడువడం యావదాంధ్ర ప్రజానీకానికి బాధ కలిగించే విషయం. 1933 డిసెంబర్ 15వ తేదీన పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో జన్మించి, అంచె లంచెలుగా ఎదుగుతూ, 12వ యేటనే వారి కార్టూనులు పత్రికలలో ప్రచురణయ్యాయి. తాను తీసిన చిత్రాలకు 6 నంది అవార్డులు రావడం, కేంద్ర ప్రభుత్వ అత్యున్నత పురస్కారమైన 'పద్మశ్రీ' వచ్చింది. బాపు మృతితో సినీలోకం ఒక్కటే కాకుండా యావత్ తెలుగుజాతి కూడా ఒక అద్భుతమైన వ్యక్తిని కోల్పోవడం జరిగింది. దర్శకుడిగా, చిత్రకారుడిగా, కార్టూనిస్టుగా ప్రసిద్ధిగాంచిన బాపు గారి గీతా, రాత తెలుగువారి సంస్కృతిలో ఒక భాగమైంది. దాదాపు అన్ని తెలుగు పత్రికలలో బాపు చిత్రాలు, కార్టూన్లు ప్రచురితమయ్యాయి. బాపు దస్తూరి మీద 'బాపు ఫాంట్' ఏర్పడింది.

ఇలాంటి గొప్ప వ్యక్తి మరణంతో తెలుగుజాతి ఒక ఆణిముత్యాన్ని కోల్పోయింది. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి భగవంతుడి అండదండలు సంపూర్ణంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి (రాజమండ్రి రూరల్): అధ్యక్షా, తెలుగువారి పౌరుషాన్ని, భావావేశాల్ని, కళాకారుడి గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన వ్యక్తి బాపు గారు. నేను యువకుడిగా ఉన్నప్పుడు గోదావరి కేంద్రంగా ఆత్రేయపురం మండలం, పులిదిండి గ్రామంలో సాక్షి సినిమా షూటింగ్ చేస్తున్నపుడు బాపు గారిని మొట్టమొదటిసారిగా కలిశాను. ఆ తరువాత గోదావరిని, అక్కడి ప్రకృతి అందాలను విస్తృతపరుస్తూ రాజమండ్రి కేంద్రంగా వారు అనేక సినిమాలు తీయడం జరిగింది. ముఖ్యంగా జమీందారు ఎస్పీబీ సత్యనారాయణ రావు గారి ధవళేశ్వరం గెస్ట్ హౌస్‌ని కేంద్రంగా చేసుకొని సాక్షి, బుద్ధిమంతుడు, అందాల రాముడు, మనవూరి పాండవులు, ముత్యాల ముగ్గు దాకా అనేక చలనచిత్రాలు వారు అక్కడ తీశారు. ముఖ్యంగా అన్నగారితో వారి అనుబంధం ప్రత్యేకమైనది. మా నాయకుడు చంద్ర బాబునాయుడు గారు చెప్పినట్లుగా రామారావు గారు వారిని ప్రత్యేకంగా పిలిపించి సులభతరమైన రీతిలో దృశ్య శ్రవణ మాధ్యమం ద్వారా పిల్లలకు సంపూర్ణ అక్షరాస్యత నేర్పించాలి, వారికి పాఠాలు నేర్పించాలన్న కార్యక్రమం వారికి అప్పగించినప్పుడు వారెంతో కష్టపడి ఆ పాఠాల్ని తీర్చిదిద్ది ఒక మంచి విధానానికి రూపకల్పన చేసిన వారు బాపు గారు. అలాగే అన్న గారు తీసిన శ్రీనాథ కవి సార్వభౌమ సినిమాలోని క్లయిమాక్స్ సీన్స్ కోసం రాజమండ్రి వచ్చారు. రాజమండ్రిలోని పట్టిసీమలో షూటింగ్ పెడితే ఆ సమయంలో తుఫాను వచ్చి పది రోజుల పాటు షూటింగ్ నిలిచిపోతే ఆ పది రోజులూ వారితోటి, అన్నగారితోటి గడిపిన రోజులు మేం మరచిపోలేము. ఆయన గీసిన చిత్రాలు కాని, కార్టూన్లు కాని ప్రతి తెలుగింటా,

ప్రతి తెలుగువాడి గుండెల్లో నిలిచిపోతాయి. ఆ మహానుభావుడికి స్నేహ ధర్మం ఎక్కువ. రమణ గారిని ప్రాణ స్నేహితునిగా చూశారు. ఇద్దరూ జంటకవుల్లా తెలుగు భాష నుడికారాన్ని, గోదావరి యాసను కూడా ప్రపంచానికి చూపిన అద్భుత వ్యక్తులు. వారికి రాజమండ్రితో వున్న అనుబంధానికి గుర్తుగా రేపు రాబోయే గోదావరి పుష్కరాల నాటికి ఆయన ఆ ప్రాంతాన్ని ప్రభావితం చేసిన దానికి గుర్తుగా ఆయన విగ్రహాన్ని అక్కడ నెలకొల్పడానికి ప్రభుత్వం తరఫున చర్యలు తీసుకోవాలని నేను ముఖ్యమంత్రి గారిని కోరుతూ ఆయన మరణం తెలుగు భాషకు నుడికారానికి తీవ్రమైన లోటుని తెలియజేస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని నేను భగవంతుణ్ణి కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ సిహెచ్.అయ్యన్నపాత్రుడు(నర్సీపట్నం)ః అధ్యక్షా, మన తెలుగు చలనచిత్ర పరిశ్రమలో వున్న దర్శకులలో బాపు గారికి ఒక ప్రత్యేక స్థానముందని మనందరికీ తెలిసిన విషయమే. ఆయన సినిమాలలో ప్రతి ఫ్రేమ్ కూడా తెలుగుదనం వుట్టిపడుతుందన్న విషయం కూడా మనందరికీ తెలుసు. వారు సాక్షి సినిమాతో తెలుగు చలనచిత్ర రంగంలో ప్రవేశించారు. వారి చివరి సినిమా శ్రీరామ రాజ్యం. వారు సమారు 51 సినిమాలకు దర్శకత్వం వహించారు. అయితే ప్రతి సినిమాకు కూడా బాపు మార్కు వుంటుంది. వారు సినిమాలు తీసే సమయంలో నేను అనేక పర్యాయాలు వారితో కలవడం జరిగింది. వారు ఏదైనా సీన్ తీసేముందు ఒక ఫ్రేమ్‌లో దానికి సంబంధించిన బొమ్మలు గీసి తీయడం నాకు తెలుసు. దానిని బాపు గారి మార్కుగా మేమంతా చెబుతుంటాం. సినిమా పరిశ్రమలోని చాలా పెద్ద హీరోలు, హీరోయిన్లు ఇతర ఆర్టిస్టులు అందరు కూడా బాపు గారి సినిమాలో నటించాలంటే పూర్వ జన్మ సుకృతంగా భావించడం నాకు తెలుసు.

1975లో రావు గోపాల రావు గారితో ముత్యాలముగ్గు సినిమా తీశారు. ఆ రోజుల్లోమేకప్ లేకుండా తీసిన సినిమా అది. ఆ సినిమాలో రావు గోపాలరావు గారిచేత బ్రహ్మాండంగా నటింపజేశారు. నాకు తెలిసి రావు గోపాలరావు గారు కొత్తగా ప్రవేశించిన రోజుల్లో ఆయన వాయిస్ బాగోలేదని ఆయనకు డబ్బింగ్ చెప్పించిన సందర్భాలున్నాయి. అటువంటి పరిస్థితుల్లో ముత్యాల ముగ్గు సినిమాలో రావు గోపాలరావు గారితోనే సొంతంగా డబ్బింగ్ చెప్పించారు. ఆ తరువాత ఆ సినిమాలోని డైలాగులు ఎంత పాపులరయ్యాయంటే ఆ డైలాగులు ఈనాటికి కూడా అందరి చెవుల్లో గింగురుమంటున్నాయి. భావి తరాల వారికి అవి గుర్తుండిపోతాయి. వారు అంతటి మహా దర్శకులు. అంతేకాకుండా ఆ రోజుల్లో చలన చిత్రాల్లో శ్రీ రాముడు కాని, శ్రీ కృష్ణుడు కాని పాత్ర పోషణ చెయ్యాలంటే ఎవరి దృష్టిలో నైనా ఎన్‌టి రామా రావు గారే మెదిలేవారు. అటువంటి పరిస్థితుల్లో కూడా శోభన్ బాబు గారిని శ్రీకృష్ణునిగా శ్రీరామునిగా నటింపజేసి గొప్ప విజయాలు సాధించిన వ్యక్తి బాపు గారు. అటువంటి మహా వ్యక్తి ఈ రోజున మన మధ్య లేకపోవడం చాలా బాధాకరం. వారి మరణం

సినిమా పరిశ్రమకు, సినిమా వ్యక్తులకు తీరనిలోటుగా నేను భావిస్తున్నాను. వారి ఆత్మకు శాంతి చేకూరాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

శ్రీమతి ఆర్.కె.రోజా (నగరి): అధ్యక్షా, బాపు గారు ఇక లేరు అంటే నిజంగా ప్రతి ఒకరూ బాధపడుతున్నారు. ఎందుకంటే ఆయన సినీ రంగానికే కాకుండా యావత్ తెలుగుజాతికే ఆణిముత్యం లాంటి వారు. బాపు గారు తెలుగువారు కావడం మనమంతా గర్వపడాల్సిన విషయం. చిత్రకారునిగా, కార్టూనిస్ట్‌గా, డైరెక్టర్‌గా తెలుగు వారి ఖ్యాతిని ఉన్నత స్థానానికి తీసికెళ్లిన ఘనత బాపు గారికి దక్కింది. ఆయన తీసిన కొన్ని సినిమాలు పుణే ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో పాఠ్యాంశాలుగా వున్నాయంటే ఆయన గొప్పతనాన్ని మనం అర్థం చేసుకోవలసిన అవసరం ఎంతో వుంది. కొందరికి అవార్డులు రావడం వల్ల వారికి గౌరవం పెరుగుతుంది. కాని కొందరికి అవార్డులివ్వడం వల్ల సత్కరించుకోవడంవల్ల వాటికి గౌరవం పెరుగుతుంది. అలాంటి అరుదైన వ్యక్తుల్లో బాపు గారు ముఖ్యమైన వ్యక్తని చెప్పుకోవాలి. ఎత్తు గురించి చెప్పాలంటే మనం ఎవరెస్ట్ గురించి చెబుతాం. అలాగే అందం గురించి మనం ఇచ్చే బెస్ట్ కాంప్లిమెంట్ ఏమిటంటే బాపు బొమ్మ లాగుందని. ఆయన తీసిన ఎన్నో సినిమాల్లో తెలుగుదనం వుట్టిపడేలా బాపు బొమ్మల్లా వుండే హీరోయిన్స్‌ని మనం చూశాము. ఆయన సినిమాలైన ముత్యాల ముగ్గు, మిస్టర్ పెళ్లాం, శ్రీరామరాజ్యం వంటి అద్భుత కళాఖండాల్ని మనం చూశాం. అలాంటి అద్భుత కళాఖండమైన శ్రీరామరాజ్యం సినిమాలో భూదేవి పాత్ర పోషించే అవకాశం నాకు వచ్చినందుకు నిజంగా నేను చాలా ఆనందించిన రోజు. ఆ రోజు నాకు ఫోన్ చేసి ఈ సినిమాలో భూదేవిగా యాక్ట్ చెయ్యాలన్నప్పుడు నేను చాలా ఆనందించాను. ఎందుకంటే ఎప్పట్నుంచో బాపు గారి సినిమాలో నటించాలన్నది నా కల. వెంటనే పరుగెత్తుకుంటూ వెళ్లి ఆ సినిమాలో నటించడం జరిగింది. ఆ సినిమాలో ఎంతో పవర్‌ఫుల్‌గా నా రోల్‌ను చిత్రీకరించడం జరిగింది. నాకెంతో పేరు రావడం జరిగింది. ఈ రోజు బాపు గారు ఇక లేరు అంటే నాకు మాటలు కూడా రావడం లేదు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు భగవంతుడు ఎల్లవేళలా అండదండగా వుండాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్: గౌరవ సభ్యులు బాపు గారి మృతి పట్ల సంతాపం తెలియజేశారు. నాకు కూడా వారంటే అభిమానం, ఆరాధనే కాదు అనుబంధం కూడా వుంది. కోటప్పకొండ పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేసే క్రమంలో 1997లో నేను వారిదగ్గరకు వెళ్లడం జరిగింది. కోటప్పకొండ ఒక పుణ్యక్షేత్రం, ఒక శివాలయం అని భక్తులు లక్షల సంఖ్యలో వచ్చి దర్శనం చేసుకుని, పూజలు చేసుకుని వెళతారు తప్పితే దాని స్థలపురాణం గురించి చాలా కొద్దిమందికే తెలుసు. స్థల పురాణం గురించి పూజారులో, గైడ్స్ చెప్పడం కష్టమని భావించి స్థల పురాణానికి సంబంధించిన చిత్రాలను గీయమని వారికి చెప్పాను. వారు 12 చిత్రాలను గీశారు. ముఖ మంటపంలో ఆ చిత్రాలను పెడితే భక్తులు ఒకటి తరువాత ఒకటి చొప్పున అన్నిచిత్రాలను చూసి

ఎవరినీ అడగకుండానే స్థల పురాణం, స్థల మహాత్మ్యాన్ని భక్తులు తమకుతామే తెలుసుకునే విధంగా వారు ఆ చిత్రాలను గీశారు. అదే నాకు వారితో వున్న అనుబంధం. నిజంగా వారినినేను చాలా గుర్తు చేసుకున్నాను. అదేవిధంగా నరసరావుపేటలో కూడా ఒక కల్చరల్ సెంటర్లో బాపు గారు నవరసాలను ప్రతిబింబించే విధంగా తొమ్మిది చిత్రాలను వేశారు.

శ్రీ నారా చంద్రబాబు నాయుడు (కుప్పం)ః అధ్యక్షా, బుచ్చయ్య చౌదరి గారు ఒక సూచన చేశారు. బాపు, రమణ గారులు గోదావరి జిల్లాలో పుట్టారు. అక్కడి వాతావరణాన్ని బయటి ప్రపంచానికి ఏ విధంగా చూపించాలో ఆ విధంగా చూపించారని చెప్పారు. రాబోయే సంవత్సరంలో గోదావరి పుష్కరాలు వస్తున్నాయి. ఇది ఒక మంచి అకేషన్ కూడా. అందుకే గోదావరి తీరాన ఒక మంచి ప్లేస్ ఐడెంటిఫై చేసి బాపు గారి విగ్రహం పక్కనే రమణ గారి విగ్రహం ఏర్పాటు చేస్తాం. ఎందుకంటే నేను చాలాసార్లు చూశాను. ఎన్టీ రామారావు గారు ఎప్పుడన్నా మీటింగ్ పెడితే ఇద్దర్నీ పిలిచేవారు. ఇద్దరూ వచ్చే వారు. వారి జీవితంలో 70 సంవత్సరాల పాటు వాళ్ల స్నేహ బంధం కొనసాగిందంటే ఏ విధంగా వారు ముందుకు పోయారన్నది అందరికీ ఒక ఆదర్శం. ఇద్దరూ కలిసి వారి కళల్ని ఏ విధంగా పైకి తీసుకొచ్చారన్నది మనందరికీ ఆదర్శం. భావి తరాల వారు కూడా గుర్తు పెట్టుకోవలసిన అవసరముంది. అందుకే ఇద్దరి విగ్రహాలు ఒకే మెమోరియల్ కింద బ్యూటిఫుల్‌గా తయారు చేసి గోదావరి తీరాన ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ పరంగా నిర్ణయించాము అధ్యక్షా. ఆ విషయాన్ని మీ అందరికీ తెలియజేస్తున్నాను.

...

మిస్టర్ స్పీకర్ః దర్శకుడిగా, చిత్రకారుడిగా, కార్టూనిస్టుగా చెరగని ముద్ర వేసిన బాపు గారు పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం సమీపంలోని కంతేరులో 1933 డిసెంబర్ 15వ తేదీన జన్మించారు. బాపు గారి అసలు పేరు సత్తిరాజుల లక్ష్మీనారాయణ. 1955వ సంవత్సరంలో బి.ఎల్. పూర్తి చేశారు. చిత్రలేఖనంపై ఉన్న మక్కువతో పెన్సిల్ లేఖా చిత్రకారుడిగా పేరుగాంచారు. బాపు గీసిన బొమ్మలు తెలుగు సంస్కృతి, సంప్రదాయానికి సాక్ష్యాలు. 1967లో సాక్షి సినిమాతో వారు సినీ జీవితం ప్రారంభించారు. 2011లో శ్రీరామరాజ్యం సినిమాతో సుమారు 51 సినిమాలకు దర్శకత్వం వహించారు. ఇప్పటిదాకా ముత్యాలముగ్గు, మిస్టర్ పెళ్లాం, సినిమాలకు ఉత్తమ జాతీయ అవార్డులు అందుకున్నారు. పెళ్లిపుస్తకం, శ్రీరామరాజ్యం, బాలరాజు కథ మొదలైన చిత్రాలకు నంది అవార్డులు అందుకున్నారు. 2013 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో బాపు గారిని సత్కరించింది. దర్శకుడిగా, చిత్రకారునిగా, కళా సాహిత్య రంగాలకు ఎనలేని సేవలు చేసిన బాపు గారు 2014 ఆగస్టు 30వ తేదీన పరమపదించారు. వారి స్మృతికి సంతాపసూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటిద్దాం.

**(సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది)**

Now, resume your seats. Kagitha Venkata Rao garu.

శ్రీ కాగిత వెంకటరావు (పెడన): అధ్యక్షా, ఈ రోజు సభ ద్వారా మీ దృష్టికి ఒక విషయం తీసుకురావడానికి మీ అనుమతి తీసుకుంటున్నాను. ఈ రోజు ఆంధ్రజ్యోతి పత్రికలో కడప జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో "స్పీకర్ స్థానంపై ఫ్యాక్షనిస్టు" అని కమలాపురం శాసనసభ్యులు శ్రీ ఆర్.రవీంద్రనాథ్‌రెడ్డి గారు కామెంట్ చేశారు. దాంట్లో చాలా విషయాలను కూడా పొందుపరచి అకారణంగా అపవాదు వేసి స్పీకర్ గారిని, స్పీకర్ స్థానాన్ని అవమానపరచినందుకు ప్రివిలెజ్ మోషన్ మూవ్ చేస్తున్నాను.

**MOVING OF PRIVILEGE MOTION**

SRI KAGITHA VENKATA RAO: Sir, with your Permission, I beg to move:

“That a Privilege Motion be moved against Sri P Ravindranath Reddy, MLA, Kamalapuram Constituency, Cuddapah District, for making derogatory remarks against the High Office of the Speaker on Sunday, the 31st of August 2014, thus committing Breach of Privilege and Contempt of the House.

While addressing a Press Conference, held on Sunday, the 31st of August 2014, the Member alleged that a factionist is holding the High Office of the Speaker of the Andhra Pradesh Legislative Assembly.

He had further alleged that the Speaker is kind towards TDP Members in the Assembly, which is also against the Rule -168 of the Rules of Procedure and Conduct of the Business of the Andhra Pradesh Legislative Assembly. Such allegations would not only degrade the High Office of the Speaker and the august House but also an attempt to malign the character and impartial conduct of Hon’ble the Speaker.

Therefore, Sri P, Ravindranath Reddy had unequivocally committed Breach of Privilege and Contempt of the House, by making such remarks against the Hon'ble Speaker and His High Office, thus making an effort to lower the dignity of the High Office of the Hon'ble Speaker in the eyes of the Public. Hence, his behaviour is liable to be examined under a Motion of Privilege.

Therefore, this case may be immediately be referred to the Committee of Privileges for necessary examination, investigation and report.

ప్రివిలెజ్ మోషన్ మూవ్ చేయడమే కాకుండా వారి చర్యలను ఖండిస్తున్నాను. ఇటువంటివి భవిష్యత్తులో జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మన మీద ఉంది కాబట్టి ఈ అంశాన్ని ప్రివిలెజ్ కమిటీకి రిఫర్ చేయవలసిందిగా మిమ్మల్ని కోరుతున్నాను.

**MR.SPEAKER: It is noted. It will be referred to the Committee of Privileges.**

**Now, Discussion on Demands. Roads & Buildings, Ports and Airports.**

శ్రీ కాగిత వెంకటరావు (పెడన): అధ్యక్షా, రోడ్లు భవనాలు, ఓడరేవులు, విమానాశ్రయాల డిమాండ్‌పై మొట్టమొదటగా మాట్లాడే అవకాశం నాకు కల్పించినందుకు రోడ్లు భవనాల శాఖామాత్యులు శ్రీ సిద్ధా రాఘవరావు గారికి, ముఖ్యమంత్రి గారికి, మీకు నా నమస్కారాలు తెలియజేస్తున్నాను. ఈ రాష్ట్రంలో జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులతోబాటు జిల్లా పరిషత్ పరిధిలో వేల కిలోమీటర్ల గ్రామీణ రోడ్లు ఈ రోజు వరకు ఏ విధమైన అభివృద్ధికి నోచుకోలేని పరిస్థితులున్నాయి. ఈనాడు బడ్జెట్‌లో రూ.2693.9337 కోట్లు మించని మొత్తాన్ని గ్రాంటుగా ప్రతిపాదించారు. కోరినట్లుగానే జాతీయ రహదారులలో కొంత భాగాన్ని జాయింట్ వెంచర్‌గానూ, రాష్ట్ర రహదారులను, జిల్లా పరిషత్ రోడ్లను గానీ గత పది సంవత్సరాలుగా ఎక్కడికక్కడ అత్యంత అధ్వాన్నంగా ఉండడంతో మౌలిక సదుపాయాలను కూడా కల్పించలేకపోయారు. ఆనాడు తెలుగుదేశం పార్టీ హయాంలో చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వేసిన రోడ్లు తప్ప గత పది సంవత్సరాలలో కొత్త రోడ్ల

నిర్మాణం చేయలేదు. ఒకవేళ ఎక్కడైనా చేసి ఉంటే వెంటనే పాడైపోయాయి లేదా అధ్వాన్న పరిస్థితిలో ఉన్నాయి. కోట్ల రూపాయలు ఖర్చు చేసినా కూడా పనికిరాకుండా పోయాయి. మంత్రిగారు అవసరమైన పనులకు బడ్జెట్ కేటాయించినా కూడా ఇంకా ఆ శాఖకు నిధులు పెంచాల్సిన అవసరముంది. ఇవాళ రాష్ట్ర విభజన తర్వాత మిగిలిన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వచ్చిన చంద్రబాబు నాయుడు గారు అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసి రైతాంగంతోబాటు ప్రజలందరికీ మేలు జరిగేలా అన్ని రకాలుగా అభివృద్ధి వైపు రాష్ట్రాన్ని నడుపుతున్నారు. అందులో భాగంగానే రోడ్లు, మౌలిక సదుపాయాలు, ఓడరేవులు, విమానాశ్రయాలకు ఎక్కువ నిధులు కేటాయించడంతోబాటు కేంద్ర ప్రభుత్వం నుంచి వీలైనంత ఎక్కువ నిధులు సమీకరించి రోడ్లకు మరమ్మతులు చేయాల్సిన అవసరముంది. ఒకసారి ఆలోచిస్తే మన భారతదేశంలో వెనుకబడిన రాష్ట్రం ఏదైనా ఉందంటే అవశేషాంధ్రప్రదేశ్ రాష్ట్రమని తెలుసు. మన రాష్ట్రానికి నిధులు చాలా తక్కువగా ఉన్నప్పటికీ అందుబాటులో ఉన్న నిధులతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని ముఖ్యమంత్రి ఈ రంగానికి నిధులు సమకూర్చారు. ఈనాడు మనం రాజధానిని నిర్మించుకోవడంతోబాటు దానిని అనుసంధానించేందుకు రోడ్లు, విమానాశ్రయాలు, ఓడరేవులు కూడా ఒక భాగం కాబట్టి ప్రస్తుతమున్న పరిస్థితులలో మనకు అనేక రకాలుగా అభివృద్ధి జరిగి ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగావకాశాలు పెరుగుతాయి కాబట్టి వీటిని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చుకోవాలి. జాతీయ రహదారులు, ఆర్ అండ్ బి పరిధిలోని రాష్ట్ర రహదారులు, జిల్లా పరిషత్ రోడ్ల మరమ్మతుల గురించి శాసనసభ్యులు కోరిన విధంగా బడ్జెట్ ప్రతిపాదనలు ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఏది ఏమైనా అంచెలంచెలుగా వాటిని ప్రణాళిక, ప్రణాళికేతర పద్దుల కింద గానీ పెట్టి పూర్తి స్థాయిలో వాటికి మరమ్మతులు చేయాలి.

విజయవాడ నగరం రైల్వే కూడలిగా ఉంది. విజయవాడ కేంద్రంగా రాజధానిని ఏర్పాటు చేయాలని ఎక్కువ మంది ప్రజల అభిప్రాయంగా ఉందని పత్రికలలో చూశాం. ఓడరేవుల విషయానికొస్తే కృష్ణపట్నం, మచిలీపట్నం, కాకినాడ రేవులను మరింతంగా అభివృద్ధి చేసుకొని విమానాశ్రయాలను కూడా అభివృద్ధి చేసుకొని కేంద్రంగా పెట్టుకుంటే బాగుంటుందని సూచనప్రాయంగా తెలియజేస్తున్నాను. తద్వారా కొంతవరకు మౌలికసౌకర్యాలు కల్పించడంతోబాటు రవాణా, ఉద్యోగావకాశాలు సమకూరడానికి అవకాశం ఉంటుంది.

...

కార్పోరేషన్ల ద్వారా కొన్ని రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు. వాటిల్లో కొన్ని బడ్జెట్‌లో ప్రణాళికాబద్ధంగా ఆ నిధులు పూర్తిగా ఖర్చు కాలేదు. బడ్జెట్ కొంత మిగిలినా పెరిగిన రేట్ల వలన, ఇతర విషయాల వలన రవాణ వ్యవస్థ దెబ్బ తింటున్నది. డీజిల్, ఆయిల్ రేటు పెరుగుతున్నది. మోటార్ వెహికల్ రేట్లు కూడా పెరుగుతున్నాయి. కాబట్టి రోడ్ల మరమ్మత్తు చేయాలి. అవసరమైతే టోల్‌గేట్లను బివోటి కింద పిలిచి వీటిని ప్రైవేట్ రంగానికి ఇస్తే సదుపాయాలు పెరిగే అవకాశం ఉందని నేను సూచన చేస్తున్నాను.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు సెక్టార్ ప్రాజెక్టు కింద హైడెన్సిటీ కోర్ రోడ్ల నెట్‌వర్క్ ద్వారా రోడ్ల వెడల్పు పెంచాల్సిన అవసరం ఉంది. ఇప్పటికీ రూరల్ ఏరియాల్లో సింగిల్ రోడ్లు మాత్రమే ఉన్నాయి. కారు, కారు తప్పుకోవాలన్నా, లారీ, కారు తప్పుకోవాలన్నా, చివరకి మోటార్ సైకిల్ తప్పుకోవాలన్నా వెడల్పు లేని పరిస్థితుల్లో యాక్సిడెంట్స్ జరుగుతున్నాయి. వాటి నివారణకు అవకాశం కల్పించి ఆర్ అండ్ బి రోడ్లకు ఎక్కువ నిధులు కల్పించి, రోడ్ల వెడల్పు పెంచి మరమ్మత్తులు చేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం ఎస్టిమేట్ వేసి మొత్తం రోడ్ల మరమ్మత్తులు చేయాలని మంత్రి గారిని కోరుతున్నాను. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం కాబట్టి నిధులు అందుబాటులో ఉన్నంత వరకూ కేటాయించడం జరిగింది. ప్లాన్‌లో గానీ, నాన్‌ప్లాన్‌లో గానీ అందుబాటులో ఉన్న బడ్జెట్‌నంతా ఖర్చు చేయాలి. రూరల్ ఏరియాల్లో వర్షాల వలన రోడ్లు ఎక్కువగా పాడవుతుంటాయి. కాబట్టి రోడ్ల నిర్మాణంలో క్వాలిటీ ఉండాలి. మెయింటెనెన్స్ ఉండాలి. ఎక్కడన్నా వర్షాలు పడితే గుంతలో నీళ్లు నిలిచి వాటిని బయటకు తొలగించడానికి, వాటి మెయింటెనెన్స్‌కు ఇబ్బంది అవుతోంది. గత 10 సంవత్సరాలుగా చూసాము, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉండి ఇప్పటి దాకా చాలా రోడ్లు సరిగా లేక యాక్సిడెంట్స్ జరిగిన పరిస్థితులను చూశాం. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని మనకు ఉన్న ఓడరేవులు, విమానాశ్రయాలు, మౌలిక సదుపాయాలను తయారు చేసుకుని వాటి ద్వారా ఈ రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లి ఆదాయాన్ని పెంచుకోవడానికి అవకాశం ఉంటుంది. వీటిని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి గారు కూడా ఈ ప్రణాళికలో పూర్తి స్థాయిలో ఆర్ అండ్ బీకి గానీ, స్టేట్ హైవేస్‌కు గానీ, నేషనల్ హైవేస్‌కు గానీ కేంద్ర నిధులు అందేలా చూడాలి. మా నియోజక వర్గంలో ఎన్.హెచ్.5, ఎన్.హెచ్.9, ఎన్.హెచ్.7 ఎన్.హెచ్.214A, 216 అన్నీ రోడ్లతో అనుసంధానం కలిగిన ప్రాంతము. మచిలీపట్టణం – పెడన నియోజక వర్గం. రాష్ట్రంలో ఎటు చూసినా అన్ని నేషనల్ హైవేస్ మా ప్రాంతానికి లింక్ అయ్యాయి. అందువలనే బందరు ఓడరేవును కూడా త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నాను. గతంలో ఉద్యమాలు జరిగాయి. ఒకటి, రెండు సార్లు శంఖుస్థాపన చేసినా వాటి ద్వారా ఏ మాత్రం పని జరగలేదు. ప్రజలకు మాటిచ్చిన విధంగా అంచెలంచెలుగా ఓడరేవుని పూర్తి చేసుకోవలసిన అవసరం ఉంది. దానితోబాటు ఈనాడు ఏదైతే రాజధాని ఏర్పాటు చేసుకోవాలనుకుంటున్నామో అదేవిధంగా ఓడరేవుల నిర్మాణం చేసుకోవాలనుకుంటున్నామో వాటి కొరకు అనుసంధానంతో ఉన్న రోడ్లు వేసుకోవాలి. ఈ రాష్ట్రంలో ఉన్న 13 జిల్లాలకు లింకు రోడ్లు వేసుకొని వీలైనంతగా దూరం తగ్గేలా నేషనల్ హైవేస్ తయారు చేసుకోవలసిన అవసరం ఉంది. ఎందుకంటే మార్గం ఎక్కువయ్యే కొద్దీ ఆయిల్ కన్‌సంప్షన్ ఉంటుంది. దూరం తగ్గితే రహదారి రవాణాకు టైమును తగ్గించుకోవడానికి అవకాశం ఉంటుంది. రోడ్ల పక్కన మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలి. రోడ్ల విస్తరణ వలన వంద సంవత్సరాల క్రితం నాటిన మొక్కలు కూడా కొట్టివేయడం జరిగింది. చెట్టు, నీరు ప్రాధాన్యంగా తీసుకుని చేస్తే అన్నింటికీ ఉపయోగంగా ఉంటుంది.

...

ఈ మధ్యనే చెట్లు నాటే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. హైవేస్ పక్కన మొక్కలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. రాజధాని హైదరాబాద్ –గుంటూరు మధ్య ఉంటే బాగుంటుందని నేను నా వ్యక్తిగత అభిప్రాయాన్ని ఈ సభ ముందుంచుతున్నాను. అనుసంధానమైన రోడ్లన్నీ కడప–కర్నూలు గానీ, శ్రీకాకుళం–విజయనగరం గానీ, దూర ప్రాంతాలన్నింటికీ స్టేట్ హైవేస్‌ను లింక్ చేసుకుని రహదార్ల మరమ్మత్తు చేసుకుంటే రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకు వెళ్లడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అక్షర క్రమంలో గానీ, అభివృద్ధిలో గానీ ముందుకు తీసుకు వెళ్లడానికి అవకాశం ఉంటుంది. ఆవిధంగా ముఖ్యమంత్రి గారు ఆలోచన చేస్తారని విన్నవించుకుంటున్నాను. మంత్రి గారు చెప్పిన వివరాల ప్రకారం బడ్జెట్ కేటాయింపుల్లో ప్లాన్, నాన్‌ప్లాన్‌లో మరిన్ని నిధులు ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచన చేస్తున్నాను. ఆర్ అండ్ బీ, ట్రాన్స్‌పోర్టు ద్వారా వచ్చే ఆదాయాన్ని బిఒటి ద్వారా రోడ్ల మరమ్మత్తు చేస్తే పెట్టుబడి కూడా తగ్గుతుంది. రహదారి మార్గానికి కూడా అనువైన ప్రదేశంగా ఉంటుంది కాబట్టి ఐడెంటిఫై చేసి నిర్ణయాన్ని తీసుకుంటే బాగుంటుందని మనవి చేస్తున్నాను.

ఆర్ అండ్ బి, విమానాశ్రయాలు, బిల్డింగులు, పోర్టులు అన్ని తీరప్రాంతంలో ఉన్న శ్రీకాకుళం నుంచి నెల్లూరు దాకా 1000 కిలోమీటర్ల దూరంలో సముద్ర తీర ప్రాంతం ఉంది. మేము కూడా తీర ప్రాంతంలో ఉన్నాము. 214A గానీ, 216 గానీ మా గ్రామం నుంచే నరసాపురం, మొగల్తూరు, పాలకొల్లు, పెడన, బందరు, నిడుమూరు, అవనిగడ్డ మీదుగా ఒంగోలు దాకా చేరడం జరిగింది. మీకు ఈ విషయాలన్నీ తెలుసు. 214A కింద ఏనాడైతే కేంద్రం నుంచి జీఓ తీసుకువచ్చినప్పుడు అది ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది తప్ప ఈనాటికీ కూడా పది సంవత్సరాల్లో దాని మీద దృష్టి పెట్టలేదు. కాలువ గట్లమీద ఉన్న చెట్లన్నీ కొట్టేశారు. రోడ్లు వెడల్పు చేస్తామంటున్నారు. పూర్తిగా నీడ లేకుండా పోయింది. దాని వలన డ్రింకింగ్ వాటర్, అగ్రికల్చర్ వాటర్ తీసుకునే కెనాల్స్ పాడవుతున్నాయి. గట్టంతా కూలిపోయే పరిస్థితి వస్తోంది. వాటికి కూడా నిధులు కేటాయించాలి. స్టేట్ హైవే మెయిన్‌టెయిన్ చేయకపోవడం వలన ఇవన్నీ డ్యామేజీ అయిపోతున్నాయి. కాబట్టి ఒకసారి మంత్రి గారు దీని మీద దృష్టి పెట్టి అంచనాలు తయారు చేసి భవిష్యత్తులో ఏ డిపార్ట్‌మెంటుకు ఏ వర్క్ వస్తుందనే విషయాన్ని దృష్టిలో పెట్టుకుని వాటికి కేటాయింపులు చేసి వెంటనే పని పూర్తి చేస్తారని నేను ఆశిస్తున్నాను. 6 లైన్ రోడ్లు, 4 లైన్ రోడ్లు కూడా ఒక డిజైను లేకుండా, ఒక ప్లాన్ ఆఫ్ యాక్షన్ లేకుండా ఖర్చు పెట్టిన వాటికే మరలా ఖర్చు పెడుతున్నారు. అందువలన డబ్బు వృథా అవుతోంది. అట్లా కాకుండా ప్లాన్ ప్రకారం ఆలోచన చేసి నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నాను.

...

ఈ రోజు ప్రధానంగా రవాణా సౌకర్యాలు, రోడ్లు మరియు భవనాలు, విమానాశ్రయాలు, ఓడ రేవులకు సంబంధించిన అంశాల మీద మాట్లాడే అవకాశం కల్పించిన మీకు, గౌరవ మంత్రి

గారికి, ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి గారికి మరొక్కసారి నా హృదయపూర్వకమైన ధన్యవాదాలను తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎస్.రఘురామిరెడ్డి (మైదుకూరు)ః అధ్యక్షా, ఈనాడు డిమాండ్స్‌లో సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి డిమాండ్ మీద డిస్కషన్ వచ్చింది. మరి సంబంధిత మంత్రి గారు సభలో లేకపోవడం దురదృష్టకరం.

**MR. SPEAKER: Leave is granted to him. ఆ డిమాండ్‌ను రేపు తీసుకుంటాము.**

శ్రీ ఎస్.రఘురామిరెడ్డిః ఈనాడు ఏ రాష్ట్రమైనా అభివృద్ధి పథంలో ముందుకు నడుస్తుందంటే ఆ రాష్ట్రం సస్యశ్యామలంగా ఉన్నప్పుడు మాత్రమే ఆ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినట్లు. మరిముఖ్యంగా సుజలాం..సుఫలాం..సస్యశ్యామలం అన్నారు. ఈ యొక్క జలాలు ఎక్కడైతే సమృద్ధిగా ఉంటాయో, ఎక్కడైతే మంచి పంటలు పండుతాయో అక్కడ సస్యశ్యామలంగా...

MR. SPEAKER:The concerned Minister is not here to note. ఆ సబ్జెక్టును ఎల్లుండి తీసుకుంటాము. ఈరోజున రోడ్లు, భవనాలు మరియు ఎనర్జీకి సంబంధించిన డిమాండ్ల పైన చర్చించుకుందామని ఇంతకు ముందే చెప్పాను.

శ్రీ ఎస్.రఘురామిరెడ్డిః సరే అధ్యక్షా, ఇరిగేషన్ డిమాండు పైన చర్చ జరిగే సందర్భంలో నేను మాట్లాడతాను.

శ్రీ ఎస్.వి.మోహన్‌రెడ్డి (కర్నూలు)ః అధ్యక్షా, రోడ్లు మరియు భవనాల శాఖకు సంబంధించిన డిమాండు పైన మాట్లాడేందుకు అవకాశం కల్పించినందుకు మీకు ధన్యవాదాలను తెలియజేస్తున్నాను. Roads indicate culture అని పెద్దలు చెబుతుంటారు. ఈరోజు రోడ్లను ప్రధాన అంశంగా తీసుకోవాల్సిన అవసరం ఉంది. రాష్ట్రం క్రొత్తగా ఏర్పడబోతోంది కాబట్టి క్రొత్త రాష్ట్రంలో క్రొత్త రాజధానికి కనెక్టివిటీ కలిగిన రోడ్లను తీసుకోవాల్సిన అవసరం ఉంది. వాటన్నింటినీ నాలుగు వరుసల రోడ్లుగా మారుస్తాము, సింగపూర్ స్థాయిలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి గారు చాలా సార్లు చెప్పారు. కాబట్టి కనెక్టివిటీ కలిగిన రోడ్లన్నింటినీ నాలుగు వరుసల రోడ్లుగా లేక రెండు వరుసల రోడ్లుగా మార్చాలనేది చాలా వ్యయంతో కూడిన అంశం. మొత్తం బడ్జెట్‌లో ప్లాన్ మరియు నాన్‌ప్లాన్ పద్దుల క్రింద రూ.2683 కోట్లను కేటాయించడం జరిగింది. ఇందులో రాష్ట్ర రోడ్ల కోసం రూ.777 కోట్లను,

భవనాల నిమిత్తం రూ.25 కోట్లు, కోర్ నెట్ వర్కు రోడ్ల క్రింద రూ.100 కోట్లు ఈ విధంగా మరి కొన్ని అంశాలను కలిపి రూ.2683 కోట్లను కేటాయించడం జరిగింది.

ప్రణాళికా వ్యయం క్రింద సచివాలయ శాఖ, రవాణా, రోడ్లు, భవనాల కోసం రూ.50 కోట్లు, రోడ్లు, వంతెనల మౌలిక సదుపాయాల కోసం రూ.200 కోట్లను మాత్రమే కేటాయించారు. అంటే ప్రణాళికా వ్యయం క్రింద చాలా తక్కువగా కేటాయిస్తున్నారు. ఇందులో ప్రణాళికేతరవ్యయమే ఎక్కువగా ఉంటూవస్తుంది. ఈరోజు రోడ్ల పరిస్థితిని చూసినట్లయితే చాలా అధ్వాన్నమైన పరిస్థితుల్లో ఉన్నాయి. దాదాపు ప్రతి సంవత్సరం రోడ్లు సరిగ్గా లేనందు వలన, గతుకుల రోడ్ల వలన చిన్న చిన్న యాక్సిడెంట్ల వలన దాదాపు 5 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో గాయపడటం జరుగుతోంది. అంతేకాకుండా పూర్తిగా చెడిపోయిన రోడ్ల వలన ద్విచక్ర వాహనాల మీద / నాలుగు చక్రాల వాహనాల మీద ప్రయాణం చేసే వారికి మెడలు నొప్పులు, నడుము నొప్పులు, బ్యాక్ బోన్ పెయిన్స్ వచ్చే అవకాశం ఉంది. ఆ రకంగా చాలా మంది నొప్పుల బారీనపడుతున్నారు. ఈరోజున ఆసుపత్రులకు వచ్చే రోగుల్లో 80 శాతం మంది రోడ్డు ప్రమాద బాధితులు ఉంటున్నారనేది ఒక సర్వే ద్వారా వచ్చిన రిపోర్టు.

రాష్ట్రంలో దాదాపు లక్ష తొంభై వేల కిలో మీటర్ల పొడవున రోడ్లు ఉన్నాయి. ఈ రోడ్లలో రోడ్లు మరియు భవనాల శాఖ ఆధీనంలో 70,394 కిలో మీటర్ల రోడ్లు ఉన్నాయి. అంతేకాకుండా ఈరోజు జిల్లాలను కలిపే రోడ్లు 32 వేల కిలో మీటర్లు ఉన్నాయి. జాతీయ రహదార్ల పరిస్థితి కొంత మెరుగుగా ఉన్నా 22 వేల కిలో మీటర్ల పోడవున ఉన్న రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. రోడ్లు మరియు భవనాల శాఖ ఆధీనంలో ఇంకా 3320 కిలో మీటర్ల పొడవునా మట్టి రోడ్లు ఉన్నాయి. అంతేకాకుండా 3177 కిలో మీటర్ల పొడవునా కంకర రోడ్లు ఉన్నాయి. కనీసం ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి ఈ రోడ్లకు మరమ్మత్తులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దాదాపు 6000 కిలో మీటర్ల రోడ్లకు మరమ్మత్తులు అవసరం. ఇందుకు రూ.1500 కోట్లు ప్రతి సంవత్సరం అవసరమవుతాయి. కేవలం మరమ్మత్తుల నిమిత్తం రూ.1500 కోట్లు అవసరం కాగా, బడ్జెట్లో రూ.2683 కోట్లను మిగిలిన అంశాలను కలిపి కేటాయిస్తే, ఈ మొత్తం మరమ్మత్తులకే సరిపోయే పరిస్థితి ఉంది.

రోడ్ల పరిస్థితి సరిగ్గాలేనందు వలన దాదాపుగా 2000 బస్సు సర్వీసులను రద్దు చేసిన పరిస్థితులు ఉన్నాయి. ప్రధానంగా ప్రమాదాలకు కారణమైన గతుకుల రోడ్ల మరమ్మత్తులకు ఇంత డబ్బు అవసరమైతే బడ్జెట్‌లో చాలా పెంచాల్సిన అవసరం ఉంది. అంతేకాదు చాలా చోట్ల స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయి. ఈ స్పీడ్ బ్రేకర్ల దగ్గర ఇండికేషన్ బోర్డులు, పెయింట్ వేయడం చేయకపోవడం వలన చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతి సంవత్సరం చిన్న పెద్ద ప్రమాదాలను కలుపుకొని సుమారు 40 వేల ప్రమాదాలు జరుగుతున్నాయనే రిపోర్టులు మాకు ఉన్నాయి. ఈ మధ్య కర్నూలు పట్టణంలో రాత్రి స్పీడ్ బ్రేకర్‌ని ఏర్పాటు చేశారు, అవసరమైన

ఇండికేషన్ బోర్డులు గానీ పెయింట్ గానీ వేయకపోవడం వలన తెల్లవారే సరికి ప్రభాకర్ అనే నా మిత్రుడు చనిపోయిన సంఘటనను తమరి ద్వారా సభ దృష్టికి తీసుకొస్తున్నాను.

ఈ రోజు రాష్ట్రంలో ఉన్న రోడ్ల పరిస్థితిని చూస్తే, అంత గతుకులు ఉన్న రోడ్లల్లో నిజంగా నెలలు నిండిన గర్భవతి ప్రయాణం చేసినట్లయితే ఆటోలో గానీ అంబులెన్స్‌లో గానీ ప్రసవించే పరిస్థితి ఉంది. ఉదాహరణకు, శ్రీకాకుళం జిల్లా రాజాం గ్రామం ఉజారామ్ గ్రామం మధ్య దాదాపు 22 కిలో మీటర్ల పొడవైన రోడ్డును 10 సంవత్సరాల క్రితం నిర్మించారు. మరమ్మత్తులు చేయకపోవడం వలన ఆ రోడ్డు యొక్క ఫోటోలను చూసినట్లయితే, ఇది ఆర్ అండ్ బి రోడ్డా లేక ఫారెస్ట్‌లో ఉండే మట్టి రోడ్డా అనే సందేహం కలుగుతుంది. కాబట్టి తమరి ద్వారా నేను ప్రభుత్వానికి మనవి చేసేదేమంటే, ఈరోజు రాష్ట్రం విడిపోయిన సందర్భంలో రాజధానికి కనెక్టివిటి కోసం గానీ, ఇతరత్రా గానీ ఈ రూ.2683 కోట్లు ఏ మాత్రం సరిపోదు. కాబట్టి ఇందులో క్రొత్త బిల్డింగులకు కూడా ప్రొవిజన్ పెట్టారు. ఈరోజున క్రొత్త బిల్డింగులను నిర్మించాలంటే వందల కోట్లు వేల కోట్లు అవసరమయ్యే పరిస్థితి ఉంది. కాబట్టి ఈ బడ్జెట్‌ను ఇంకా పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అంతేకాకుండా సీకోస్ట్ కారిడార్‌ను ఇందులోనే తీసుకుంటామంటున్నారు. దానికి ప్రత్యేకంగా ఎంత బడ్జెట్‌ను కేటాయిస్తారు? లేక కేంద్ర ప్రభుత్వ నిధులతోనే దానిని నిర్మిస్తారా అనే అంశాన్ని కూడా స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.

...

అంతేకాదు, ఈరోజున కనెక్టివిటి రోడ్స్ నిర్మాణం పనులను ప్రైవేట్ సంస్థలకు ఇవ్వడం జరుగుతుందని, తద్వారా టోల్‌గేట్స్ పెట్టే పద్ధతి క్రింద కనెక్టివిటి రోడ్స్ నిర్మాణం పనులను అప్పగించడం జరుగుతుందనే విషయాన్ని ప్రభుత్వం చెబుతోంది. ఈమధ్య కాలంలో టోల్‌గేట్స్ వద్ద ఆ యాజమాన్యం ప్రయాణికులపైన, వాహనాలపైన మోపే టోల్ చార్జీల భారంతో ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతోంది. ప్రస్తుతం వాహనాలకు అవసరమైన పెట్రోల్ మరియు డీజిల్ ఖర్చు కంటే కూడా టోల్‌గేట్ చార్జీ అధికంగా ఉంటోంది. ఉదాహరణకు కర్నూలు నగరం నుండి హైదరాబాద్ నగరానికి ఒక లారీ వచ్చి వెళ్లాలంటే టోల్‌గేట్ చార్జీల ద్వారా రూ.2,400/- లు ఖర్చు అయ్యే పరిస్థితి కనబడుతోంది. ఈరోజున కేవలం 250 కిలోమీటర్ల దూరం ప్రయాణానికే లారీకి రూ.2,400/- లు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉన్నందున లారీ నిర్వాహకులకు గానీ, లారీ ఓనర్లకు గానీ టోల్‌గేట్ చార్జీ పెనుభారమవుతోంది. తద్వారా ఆ భారమంతా తిరిగి ప్రజలపైనే మోపాల్సిన పరిస్థితి ప్రభుత్వానికి కల్గుతుంది. కనెక్టివిటి రోడ్స్ నిర్వాహణను ప్రైవేట్ సంస్థలకు ఇచ్చి తద్వారా టోల్‌గేట్ చార్జీలు ప్రజలపైన మోపే ఆలోచన ప్రభుత్వానికుంటే, రాబోయే రోజులో ప్రజలు రోడెక్కె పరిస్థితి కనబడదనే విషయాన్ని నేను మీద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నాను. కాబట్టి బడ్జెట్‌లో రోడ్లు మరియు భవనాల శాఖకు ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్‌ను పెంచాల్సిన అవసరం ప్రభుత్వానికెంతైనా ఉంది.

అధ్యక్షా, ఓడరేవులు మన రాష్ట్రంలో ప్రధానపాత్ర పోషించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రానికి ప్రధాన ఆదాయ వనరులుగా ఓడరేవులు ఉంటాయనే విషయం సభలోని గౌరవ సభ్యులందరికి విధితమే. కానీ, ఓడరేవులను పి.పి.పి. పద్ధతిన అభివృద్ధి పర్చడం జరుగుతుందనే విషయాన్ని ప్రభుత్వం ఈరోజున చెబుతోంది. ప్రభుత్వపరంగా ఏయే ఓడరేవులను అభివృద్ధిపరుస్తామనే విషయాన్ని ప్రభుత్వం చెప్పలేదు. ఆ విషయంలో ప్రభుత్వ ఆలోచన చెప్పాల్సిన అవసరముందని నేను భావిస్తున్నాను. కేవలం పి.పి.పి. పద్ధతినే అవలంభించి ఓడరేవులను అభివృద్ధి పర్చడం కంటే కొన్నింటిని ప్రభుత్వపరంగా అభివృద్ధిపర్చినట్లైతే రాష్ట్రానికి ప్రయోజనం ఉంటుందనే విషయాన్ని మీద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నాను.

అధ్యక్షా, నెల్లూరు జిల్లా గూడూరు నియోజకవర్గ పరిధిలో దుగరాజపట్నం ఓడరేవు కేంద్రీకృతమై ఉంది. గూడూరు నియోజకవర్గ పరిధిలో వాకాడు మండలం నందు దుగరాజపట్నం ఓడరేవు ఉంది. గతంలో దుగరాజపట్నం ఓడరేవు అభివృద్ధికి సంబంధించిన బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందడం జరిగింది. తద్వారా కేంద్ర ప్రభుత్వం చట్టం రూపొందించింది. కానీ కేంద్రప్రభుత్వాధికారులు కేవలం దుగరాజపట్నం ఓడరేవును సందర్శించి సర్వే పనులను మాత్రమే చేసి వెళ్లడం జరిగింది. మొన్నటి బడ్జెట్ నందు దుగరాజపట్నం ఓడరేవు అభివృద్ధికి సంబంధించిన నిధులను కేటాయించినట్టుగా కనబడలేదు. ఆ ప్రస్తావనే బడ్జెట్ ప్రసంగంలో కనబడలేదనే విషయాన్ని సభ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నాను.

అధ్యక్షా, రైల్వే ఓవర్‌బ్రిడ్జిలకు సంబంధించిన అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకురాదలిచాను. రైల్వే ఓవర్‌బ్రిడ్జిల నిర్మాణానికి గాను కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వం యాభై శాతం నిష్పత్తిలో ఖర్చును భరించాల్సి ఉంటుంది. కానీ, ఈనాడు రాష్ట్ర ప్రభుత్వం నుండి యాభైశాతం వాటా నిధులు విడుదల కాకపోవడం వల్ల చాల వరకు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం జరగలేదు. దాదాపు ఏడెనిమిది రైల్వే ఓవర్‌బ్రిడ్జిల నిర్మాణం మంజూరైనప్పటికి కూడా రాష్ట్ర ప్రభుత్వ వాటా మొత్తాన్ని విడుదలచేయకపోవడం వల్ల ఈనాటికి రైల్వే ఓవర్‌బ్రిడ్జిల నిర్మాణం పెండింగ్‌దశలో ఉన్నాయనే విషయాన్ని తమరిద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నాను. ఉదాహరణకు కర్నూలు పట్టణానికి సంబంధించి బెంగుళూరు - కర్నూలు పట్టణానికి సంబంధించి ఎన్.హెచ్.7 ను కలుపుతూ నిర్మించాల్సిన రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరైందని చెప్పడం జరిగింది కానీ రాష్ట్ర ప్రభుత్వం యాభై శాతం నిధులను మంజూరు చేయకపోవడం వల్లే ఆ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పెండింగ్‌లో ఉంది. ఆ విషయం గౌరవ మంత్రి గారి దృష్టికి వచ్చిందో, రాలేదో తెలియదు గానీ, ఆ అంశంపైన దృష్టి సారించాలనే విషయాన్ని తమరిద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను. అదే విధంగా కర్నూలు పట్టణంలోని కృష్ణానగర్ వద్ద ప్రధానమైన రైల్వే క్రాసింగ్ ఉంది. అక్కడ కూడా ఒక రైల్వే ఓవర్

బ్రిడ్జి గానీ, లోయర్ లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన మంజూరు అయినట్టుగా చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి యాభై శాతం వాటా రాకపోవడం వల్లే ఆ బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం లేదనే సమాచారాన్ని కర్నూలు రైల్వే అధికారులు చెబుతున్నారు. కర్నూలు పట్టణానికి సంబంధించిన రెండు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి గాను రాష్ట్ర ప్రభుత్వ వాటా సొమ్మును బడ్జెట్‌లో కేటాయించి సత్వరమే ఆ బ్రిడ్జిల నిర్మాణాన్ని చేపట్టేదిశగా గౌరవ మంత్రి గారు దృష్టి సారించాలనే విషయాన్ని తమరి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నాను.

అధ్యక్షా, ఈరోజున రహదారులు మరియు భవనాల శాఖకు బడ్జెట్‌లో ప్రభుత్వం కేటాయించిన మొత్తం చాలా తక్కువగా ఉందనేది వాస్తవం. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 15వ తేదిన గౌరవ ముఖ్యమంత్రి గారు కర్నూలు పట్టణానికి వచ్చి జాతీయపతాక ఆవిష్కరణ చేసిన సమయంలో కర్నూలు నగరంలో ఎయిర్‌పోర్ట్ నిర్మాణాన్ని చేపట్టడం జరుగుతుందనే విషయాన్ని ప్రస్తావించారు. గౌరవ ముఖ్యమంత్రి గారి దృష్టికి ఒక విషయాన్ని తమరిద్వారా తీసుకురాదలిచాను. కేవలం కర్నూలు నగరం నందు ఎయిర్‌పోర్ట్ నిర్మాణం జరిగితేనే ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ రాదు. కాబట్టి కర్నూలు నగరంలో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానంతరం కర్నూలు నగరానికి ప్రయాణికులు రాకపోకలు సాగించే విధంగా కర్నూలు జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధిచేసేందుకు అనుగుణంగా గౌరవ ముఖ్యమంత్రి గారి ఆధ్వర్యంలో ప్రభుత్వం చర్యలు ఉండాలి. ఎక్కడైనా ఎయిర్‌పోర్ట్‌ల నిర్మాణానంతరం అక్కడ అవసరమైన ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అభివృద్ధిపరిస్తేనే సార్ధకత ఉంటుంది కాబట్టి ఆ దిశగా ప్రభుత్వం అడుగులేయాల్సిన అవసరముంది. కేవలం ఎయిర్‌పోర్ట్‌లనే నిర్మించుకుంటూపోతే ఎటువంటి ప్రయోజనం ప్రభుత్వానికి ఉండదు. ఉదాహరణకు కడప నగరంలో ఒక ఎయిర్‌పోర్ట్ ఉంది. ఆ ఎయిర్‌పోర్ట్‌లో ఎటువంటి నిర్వాహణ, పర్యవేక్షణ, ప్రయాణికుల రాకపోకలు సాగించకపోవడం వల్ల ప్రస్తుతం అది మూతపడిన విషయాన్ని నేను తమరిద్వారా సభ దృష్టికి తీసుకువస్తున్నాను. కడప నందలి ఎయిర్‌పోర్ట్ కనీసం ప్రారంభానికి కూడా నోచుకోలేదు. ఎయిర్‌పోర్ట్‌లు నిర్మించాలనే ప్రభుత్వ నిర్ణయం మంచిదే అయినప్పటికి, నిర్మాణానంతరం ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు అనువైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అభివృద్ధిపరిచే దిశగా ప్రభుత్వ చర్యలు ఉండాలనే విషయాన్ని మీద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నాను. ఈరోజున ఆర్ అండ్ బి శాఖకు సంబంధించి, పోర్ట్స్‌కు సంబంధించి, ఎయిర్‌పోర్ట్స్‌కు సంబంధించిన బడ్జెట్ పద్దుపైన సభలో ప్రసంగించే అవకాశం కల్పించిన మీకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ గద్దె రామ్మోహన్ (విజయవాడ-ఈస్ట్): స్పీకర్ సార్, ప్రపంచంలో ఏ దేశమైన అభివృద్ధి చెందిందంటే, దాన్ని నిర్ధారించడానికి ఆ దేశంలో ఉక్కు వినియోగం, అదే విధంగా విద్యుత్ వినియోగం ప్రధానం. ఈ రెండింటిని బట్టి దేశాభివృద్ధిని నిర్ధారించడం జరుగుతుంది. ఈ మధ్య కాలంలో వ్యాపారాభివృద్ధి నిమిత్తం నేను ఆఫ్రికన్ దేశాల సందర్శనకు వెళ్లినప్పుడు

కొన్ని దేశాల్లో నేను చూడడం జరిగింది. ఆ దేశ రాజధానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాల్లో కరెంటు లేనటువంటి దుస్థితిని నేను చూడడం జరిగింది. అదే విధంగా కొన్ని యూరప్ దేశాలను చూస్తే జనసంచారం ఉన్నా, లేకపోయినా రాత్రి పూట దీపాల వెలుగులు చూస్తే, అది వాళ్ల యొక్క వెలుగు, వాళ్లయొక్క ఆర్థికస్థితిని తెలియజేస్తుంది. ఇవాళ విద్యుత్ అనేది నిత్యావసరవస్తువుగా మారిపోయింది.

అధ్యక్షా, ఒక నాయకుడి యొక్క సమర్థతను మనం కొలమానంగా తీసుకోవాలంటే, ఏ నాయకుడైతే విద్యుత్ విషయంలో అత్యంత శ్రద్ధకనబరుస్తాడో, ఏ నాయకుడైతే క్వాలిటీగల్గిన విద్యుత్‌ను ప్రజలకు ఇవ్వడానికి అవసరమైన చర్యలు తీసుకుంటాడో ఆ నాయకుడ్ని గొప్ప నాయకుడిగా చెప్పవచ్చు. శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి తొమ్మిది సంవత్సరాల పాలనలో నా అదృష్టవశాత్తు ఐదు సంవత్సరాల కాలంపాటు వారి నాయకత్వంలో శాసనసభ్యుడిగా ఉన్నాను. మరో ఐదు సంవత్సరాల కాలంపాటు వారి నాయకత్వంలోనే పార్లమెంట్ సభ్యుడిగా పనిచేశాను. మరల ఈనాడు వారి నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీ తరఫున శాసనసభ్యుడిగా ఎన్నికైనాను.

అధ్యక్షా, మేం ప్రాక్టికల్‌గా చూశాం. నిరంతరం విద్యుత్ విషయంలో సమీక్షలు చేయడంలో చంద్రబాబు నాయుడు గారు సఫలీకృతులైనారు. వారు చదువుకున్నది కామర్స్ సబ్జక్ట్ అయినప్పటికి విద్యుత్ ఇంజనీర్లకంటే మిన్నగా, ఎంతో అనుభవం కల్గిన ఇంజనీర్లతో సమానంగా ఆ విషయాలను సమీక్షల ద్వారా చర్చించి, మన రాష్ట్రాన్ని గాడిన పెట్టిన సంఘటనలు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి సంబంధించినవి అనేకం ఉన్నాయి. 1959వ సంవత్సరంలో ఆంధ్రరాష్ట్ర విద్యుత్‌చ్ఛక్తి బోర్డును స్థాపించిన నాటి నుంచి 1996వ సంవత్సరంలో శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీబాధ్యతలు స్వీకరించకముందు రాష్ట్రంలో విద్యుత్ ఉత్పాదక శక్తి 6,163 మెగావాట్లుగా ఉండేది. అంటే 35 సంవత్సరాల కాలం పాటు రాష్ట్ర విద్యుత్ రంగం చరిత్రలో విద్యుత్ ఉత్పాదక శక్తి కేవలం 6,163 మెగావాట్లుండగా, చంద్రబాబు నాయుడు గారి తొమ్మిదేళ్ల పాలనలో అదనంగా 5,634 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదక సామర్థ్యాన్ని జోడించి 2004వ సంవత్సరం నాటికి 11,797 మెగావాట్ల సామర్థ్యానికి తీసుకురావడం జరిగింది.

...

నారా చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ఎన్నిక కాబడిన కేవలం రెండు నెలలు. ముఖ్యమంత్రిగా ప్రమాణ సీకారం చేసేనాటికి 22000 మెగా యూనిట్స్ లోటు బడ్జెట్ ఉండగా దానిని అనేక సమీక్షలు ద్వారా అధికారులను అప్రమత్తం చేయడం ద్వారా జీరో డెఫిసిటీకి తీసుకువచ్చిన ఘనమైన నాయకుడు నారా చంద్రబాబు నాయుడు గారని నేను తెలియజేస్తున్నాను.

( ఈ సందర్భంలో అధికారపార్టీ సభ్యులు బల్లలు చరిచారు.)

ప్రభుత్వాల చిత్తశుద్ధి అధికారుల పట్టుదల నిబద్ధతో ప్రాజెక్టులన్నీ కూడా సకాలంలో నిర్ధేశిత కాల ప్రమాణాల మేరకు నిర్మితమైతే, గత పది సంవత్సరాల కాలంలో పనిచేసిన కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజాసేవ కంటే రాజకీయాలకు ప్రాముఖ్యతను ఇవ్వడం వలన వారి హయాంలో ప్రాజెక్టులన్నీ అలసత్వానికి గురైనాయి. గత పది సంవత్సరాలులో ఉచిత విద్యుత్ ఇచ్చామని గొప్పలు చెప్పుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయానికి ఇచ్చిన విద్యుత్ వినియోగాన్ని చూస్తే కాంగ్రెస్ హయాంలో 47 శాతం ఉండగా, తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో క్వాలిటీ విద్యుత్‌ను రైతులకు ఇచ్చింది 62.11 శాతం ఇది ఒక ఉదాహరణ.

రైతులకు ఆశలు చూపించి ఆరోజు క్వాలిటీ విద్యుత్ అందించకుండా రోజుకు 7 గంటలు అనిచెప్పి 3 గంటలు, 2 గంటలు అది కూడా రక రకాలుగా 2గంటలు ఇచ్చి మరలా 6 గంటలు ఇస్తూ తడిసిన నేల తడిసిందే తప్ప పంటలు పండని దుస్థితిని ప్రజలందరూ కూడా చూశారు. అందుకని ఈ రోజున రెండు నెలలులో ఆయన సాధించిన విజయాలే కాకుండా ఈరోజున మనకు 24x7 విద్యుత్ సరఫరా ఈ ఆంధ్రరాష్ట్రానికి ఒక వరంగా కాబోతుంది. అది నారా చంద్రబాబు నాయుడు గారి కృషివల్లనే అని తెలియజేస్తున్నాను.

(ప్రధాన ప్రతిపక్ష సభ్యులచే అంతరాయం)

ఈరోజున విద్యుత్ నిత్యావసర వస్తువుగా మారింది. పది సంవత్సరాల కాలంలో రూ.31కోట్లు ప్రజల మీద భారంవేస్తే, నారా చంద్రబాబు నాయుడు గారి హయాంలో కేవలం రూ.1500కోట్లు మాత్రమే ప్రజలమీద భారం వేసిన ఆరోజున అల్లర్లు చేసి కొందరి మరణానికి కారకులైన వ్యక్తులు ఆరోజున్న ప్రతిపక్ష పార్టీ.

ఈ రోజున అధికారంలోకి వచ్చిన రోజు 22మిలియన్ యూనిట్ విద్యుత్ లోటు ఉంటే రెండు నెలలులో జీరో డెఫిసిట్‌కు తీసుకు రావడమే కాకుండా విద్యుత్ కొరత లేని రాష్ట్రంగా ఈ రాష్ట్రాన్ని తీర్చిదిద్దబోతున్నారు మా నాయకులు నారా చంద్రబాబు నాయుడు గారని మీ అందరికీ తెలిజేస్తున్నాను.

వ్యవసాయానికి ఆనాటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు గారు రైతులకు హార్స్ పవర్ రూ.50లకే ఇచ్చి ఒక విప్లవం సృష్టించారని తెలియజేస్తున్నాను. అదే విధానంలో ఈరోజు చంద్రబాబు నాయుడు గారు 7 గంటలు నుండి 9 గంటలు నిరాటంకంగా రైతుకు విద్యుత్ ఇచ్చే విధంగా ముందుకు వెళుతున్నారని తెలియజేస్తున్నాను.

ఈరోజున గుజరాత్ వంటి రాష్ట్రం నారా చంద్రబాబు నాయుడు గారు చేపట్టిన సంస్కరణలను స్ఫూర్తిగా 2006వ సంవత్సరంలో తీసుకుంటున్నాయి. అది నేను చెప్పడం కాదు కాంగ్రెస్‌పార్టీకి చెందిన దిగ్విజయ్ సింగ్ గారు, షిండే గారు, ఆనాటి ప్రణాళికా సంఘం ఆ పేరు ఉచ్చరించాయి. నారా చంద్రబాబు నాయుడు గారు ఆంధ్రరాష్ట్రంలో చేపట్టిన విద్యుత్ సంస్కరణలు ఆదర్శమయ్యాయి. అలాంటి సంస్కరణలు చేపడితే ఏరాష్ట్రమైనా ముందుకు వెళుతుందని ఆనాడు మోదీ గారు ఆ సంస్కరణలు స్ఫూర్తిగా తీసుకొన్నారు. గుజరాత్ రాష్ట్రంలో సర్‌ప్లస్ స్థాయికి చేరిందంటే అది నారా చంద్రబాబు నాయుడు గారి మేధస్సు అని ఈ సందర్భంగా మీ ద్వారా తెలియజేస్తున్నాను. ఈరోజున గుజరాత్‌లో వ్యవసాయానికి సఫరేట్ ఫీడర్స్ అదే విదేవిధంగా పరిశ్రమలకు వేరుగా, గృహాలకు వేరుగా ఉన్నాయి.

ఇటువంటి ఆలోచన విజనరీ ఉన్న చంద్రబాబు నాయుడు గారు. గత 9 సంవత్సరాలు కాలంలోనే ఆ నిర్ణయం తీసుకోవడం జరిగింది. దురదుష్టవశాత్తు అక్కడ గవర్నమెంట్ పడిపోవడం వలన ఆ తర్వాత వచ్చిన 10 సంవత్సరాల కాంగ్రెస్ ప్రభుత్వ పాలన కాలంలో ఈ మొత్తం వ్యవస్థను చిన్నా భిన్నం చేశాయి. విద్యుత్ సంస్కరణలు ద్వారా ఆరోజున ట్రాన్స్‌కో, జన్‌కో అని వేరు చేసి వాటి సామర్థ్యాన్ని పెంచి చక్కటి విద్యుత్‌ను వినియోగంలోకి తీసుకొచ్చిన సందర్భం నుండి జన్‌కోను కాంగ్రెస్‌పార్టి ఆనాడు 6 సంవత్సరాలు పనిచేసిన ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి గారి నాయకత్వంలో కానీ, రోశయ్య గారి నాయకత్వంలో కానీ, కిరణ్‌కుమార్ రెడ్డి గారి నాయకత్వంలో కానీ దానిని చిన్నా భిన్నం చేసి దానిని స్వార్థ పూరిత రాజకీయాలుగా వినియోగించుకోవడం జరిగింది.

ఎక్కడో ఇతర రాష్ట్రాల్లో పవర్ ప్లాంట్స్ పెట్టడానికి జన్‌కోను ఒక ఆయుధంగా ఉపయోగించుకున్నారు. జెన్‌కోకు ఉన్న పరపతిని జన్‌కోకు ఉన్న అనుభవాన్ని వారు దాంట్లో పార్టనర్‌గా చేర్చుకొని ఆ టెండర్లు పొందే వరకు ఉంచుకొని టెండర్స్ పొందిన తరువాత జన్‌కోను ప్రక్కకు నెట్టిన సందర్భాలున్నాయి. అంతకంటే వేరే ఉదాహరణలేమీ చెప్ప వలసిన అవసరం లేదు. గత 10 సంవత్సరాలు కాలంలో వీరు చేపట్టిన అవినీతులు కానీ, అక్రమాలు కానీ బైబిల్ కంటే పెద్ద గ్రంథం తయారు చేయవచ్చు.. బైబిల్ కన్నా, ఖురాన్ కన్నా, భగవత్‌గీత కన్నా పెద్ద గ్రందం తయారు చేయవచ్చు. ఏదైనా కూడా దేశం అభివృద్ధి కోసం రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే నిరంతరం విద్యుత్ ఉండాలి. అందుకు ఈరోజు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగ పర్చే విధంగా రానున్న కాలంలో పెరిగే డిమాండ్‌ను చేరుకోడానికి సోలార్ విద్యుత్ ప్లాంట్స్ కానీ పవన విద్యుత్ ప్లాంట్స్ కానీ వీటన్నింటికి చక్కటి ప్రణాళికతో రూపు దిద్దుకోబోతుంది.

ఈ బడ్జెట్‌లో ఇచ్చిన కేటాయింపులన్నీ కూడా కేవలం సంవత్సర కాలంలోనే విద్యుదుత్పత్తి పెంచడానికి ప్రణాళిక చక్కని ప్రణాళికలను సిద్ధం చేశారు. దానికి చంద్రబాబు

నాయుడు గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. దశల వారీగా విద్యుత్‌ను పెంచడానికి అనేకమైన విధానాలు తీసుకున్న చంద్రబాబు నాయుడు గారికి ఈ రాష్ట్రం రానున్న రోజుల్లో మిగులు విద్యుత్ కలిగిన రాష్ట్రంగానూ, పరిశ్రమలు పెరిగే విధంగానూ తీసుకున్న విధానం పరోక్షంగాను, ప్రత్యక్షంగాను ఈ విద్యుత్ వలన ఎంప్లాయ్‌మెంట్ పెరిగే విధానం, ఇవన్నీ కూడా నాయకుడి సామర్థ్యంతో ముందుకు వెళ్లబోతున్నామని గర్వంగా తెలియజేస్తున్నాను. గత 10 సంవత్సరాల కాలంగా కరెంట్ కోతలతో మన కళ్లముందు అనేక పరిశ్రమలు మూతపడ్డాయి. ఆ కారణంగా ఆ పరిశ్రమల్లోని కార్మికులు రోడ్డున పడ్డారు. విజయవాడ లాంటి నగరంలో నారా చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉండగా ఒక్క నిమిషం కూడా విద్యుత్ కోత లేదు. ఇక్కడ మా జలీల్ ఖాన్ గారు కూడా ఉన్నారు. వారు అనేక సందర్భాల్లో సమావేశాల్లో కూడా చెప్పడం జరిగింది. తెలుగుదేశం పార్టీ అధికారంలో కరెంట్ కోత లేదు. ఈ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత రాజశేఖర రెడ్డి గారి నాయకత్వంలో కరెంట్ కోతతో చస్తున్నామని సోదర సభ్యులు జలీల్ ఖాన్ గారు కూడా చెప్పడం జరిగింది.

...

(జలీల్‌ఖాన్‌గారు మైకు ఇవ్వమని గౌరవ సభాపతిని కోరడం జరిగింది)

మిస్టర్ స్పీకర్ః జలీల్‌ఖాన్ గారూ..

శ్రీ జలీల్ ఖాన్(విజయవాడ-వెస్ట్)ః అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ గద్దె రామ్మోహన్‌రావుగారంటే నాకు చాలా అభిమానం, గౌరవం కూడా. ఇందాకే భగవద్గీత, ఖురాన్, బైబిల్ అన్నారు. అన్నా, ఒక్క మాట సభ సాక్షిగా, నిజంగా, రాజకీయాలకు అతీతంగా చెప్పు. డా.వై.ఎస్.రాజశేఖర్ రెడ్డిగారు ఉన్నప్పుడు విజయవాడలో కరెంటు ఉందా, లేకపోతే తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పుడు కరెంటు ఉందా? విజయవాడ నగరంలో ఎండా కాలంలో బయటికెళ్తే చీకటి. పగటిపూట ఎండాకాలంలో కరెంటు ఉండదు. కొన్ని వందల మంది కృష్ణానది కట్టన పడుకున్న మాట వాస్తవమా, కాదా?

మిస్టర్ స్పీకర్ః జలీల్‌ఖాన్‌గారూ దయచేసి పూర్తిచేయండి.

శ్రీ జలీల్ ఖాన్ః (అధికార పార్టీనుద్దేశించి) మీరు మాట్లాడిన సందర్భంలో.. సరే మీరు **అబద్ధాలు** చెప్పినా మేం వినేందుకు సిద్ధంగా ఉన్నాం కాబట్టి నోరు మూసుకొని ఉన్నాను. కానీ, (సభ్యులు శ్రీ గద్దె రామ్మోహన్‌ను ఉద్దేశించి) మీరు నా పేరును ప్రస్తావించి సాక్ష్యంగా పెట్టారు. కాబట్టి, వాస్తవం మాట్లాడుకోవాలి. నా ఆలోచనంతా ఒకటే. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడిగారి పరిపాలన ఒక విధంగా జరిగింది. డా.వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి గారి పరిపాలన మరొకవిధంగా జరిగింది. నేను గౌరవ సభ్యులందరకూ, పెద్దలకూ మనవి చేసేదేమంటే, మనం ఏం చేయబోతున్నాం అనే దానిమీద ప్రస్తావిస్తే బాగుంటుంది తప్ప,

సమయాన్ని వృథా చేయొద్దని, గత చరిత్ర గురించి చాలా తక్కువగా మాట్లాడవల్సిందిగా మీద్వారా కోరుతున్నాను.

(గౌరవ మంత్రి శ్రీ పల్లె రఘునాథరెడ్డిగారు మైకు ఇవ్వమని గౌరవ సభాపతిని కోరారు.)

మిస్టర్ స్పీకర్: రఘునాథరెడ్డిగారూ మాట్లాడండి.

శ్రీ పల్లె రఘునాథరెడ్డి (పుట్టపర్తి): అధ్యక్షా, సభ్యులు శ్రీ జలీల్‌ఖాన్‌గారు 'గుండె మీద చెయ్యి వేసుకుని చెప్పమనండి' అని ఒక మాట చెప్పారు. ఆ జలీల్‌ఖాన్ గారినే గుండెమీద చెయ్యి వేసుకుని చెప్పమనండి. 2009వ సంవత్సరంలో డా.వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డిగారు ప్రమాణస్వీకారం చేసినప్పుడు ఒక సంతకం చేశారు. ఆ సందర్భంగా, జూన్ 1వ తేదీ నుంచి 9 గంటల పాటు విద్యుత్‌ను ఇస్తామని వారు చెప్పారు. వారు జూన్, జూలై, ఆగస్టు నెల వరకు ఉన్నారు. ఈ మూడు నెలల్లో కూడా రోజుకు 9 గంటలపాటు విద్యుత్ ఇచ్చిన పాపాన పోలేదు. మూడు, నాలుగు గంటలు కూడా విద్యుత్ రాలేదు. విద్యుత్ ఎప్పుడు వస్తుందో ప్రజలకు, ప్రభుత్వానికి, చివరకు ఆ పుట్టించిన భగవంతునికి కూడా తెలియదు. అంధకార ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత ఆ పార్టీకే దక్కుతుంది. (ట్రెజరీ బెంచ్ నుంచి చప్పట్లు). అదేవిధంగా, (సభ్యులు శ్రీ జలీల్‌ఖాన్‌నుద్దేశించి) ఆయన్ని గుండె మీద చెయ్యి వేసుకుని చెప్పమనండి. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత, 1994 నుంచి 2003వ సంవత్సరం వరకు 9 సంవత్సరాలు 9 గంటల పాటు కరెంటు ఇచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు శ్రీ నారా చంద్రబాబునాయుడు గారిది కాదా అని ఒక్కసారి ఆలోచించాలి.

అదేవిధంగా క్రిజల్ రేటింగ్‌లో 2003-04వ సంవత్సరం వరకు 1వ స్థానం, ఏ రేటింగ్‌లో ఉండేది. వీళ్ళ కాలంలో బి, బి+ రేటింగ్‌లో, 31వ స్థానానికి వచ్చింది. ఏదేమైనా, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడిగారికుండే చాకచక్యం, సమర్థత వలన ఈ రాష్ట్రం, నెం.1 రాష్ట్రం కాబోతోంది. రాబోవు ఐదు సంవత్సరాల్లో, ప్రపంచంలోనే ఆదర్శవంత రాష్ట్రంగా మారుతుందనడంలో ఏమాత్రం సందేహం లేదు.

(వైఎస్సార్ కాంగ్రెస్ సభ్యులు శ్రీ జలీల్‌ఖాన్‌గారు మాట్లాడటానికి మైకు ఇవ్వమని గౌరవ సభాపతిని కోరడం జరిగింది)

మిస్టర్ స్పీకర్: మీ పేరు ఇచ్చారు మీరు మాట్లాడారు. గద్దె రామ్మోహన్‌గారూ మాట్లాడండి.

శ్రీ గద్దె రామ్మోహన్ (విజయవాడ-ఈస్ట్)ః అధ్యక్షా, విజయవాడ నగరంలో సభ్యులు శ్రీ జలీల్‌ఖాన్‌గారు ఒక శాసనసభ్యులుగా, రెండో సభ్యులుగా శ్రీ బి. ఉమా మహేశ్వరరావుగారు, మూడో సభ్యునిగా నేను ఉన్నాను. శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విజయవాడ నగరంలో కరెంటు ఉందా అని గుండెలమీద చెయ్యి వేసుకుని చెప్పమని గౌరవ సభ్యులు శ్రీ జలీల్‌ఖాన్ గారు అన్నారు. గుండెలమీదే కాదు సర్, నా భార్యా, పిల్లల మీద ప్రమాణం చేసి చెబుతున్నాను. విజయవాడ నగరంలో పవర్ కట్ అనేది లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఉంటే ఉండొచ్చు. శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాదు, విజయవాడ, విశాఖపట్టణ నగరాలలో ఎక్కడా కూడా పవర్‌కట్ లేదు. దీనిని ఒకసారి గమనించాలని కోరుతున్నాను. సోదరుడు సభ్యులు శ్రీ జలీల్‌ఖాన్‌గారు చాలా సందర్భాల్లో ఫ్రెండ్లీగా ఉంటారు కాబట్టి రిఫర్‌చేయడం జరిగింది. సభ్యులు శ్రీ జలీల్‌ఖాన్‌గారు చెప్పేవారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి వెళ్తే, మన కడుపులో ఉన్న ఆకలిని గ్రహించి, అన్నం పెడతారు, అదే కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి వెళ్తే, జేబులు కొడతారని కూడా ఆయన చాలా క్లియర్‌గా చెప్పేవాళ్లు. (ట్రెజరీ బెంచ్ నుంచి చప్పట్లు) దానికి సాక్ష్యం నేనొక్కడినే కాదు. విజయవాడ నగరంలో కొన్ని వేలమంది ప్రజలు సాక్ష్యం ఉన్నారు. ఆయన మాటలకి ప్రెస్‌వాళ్లు కూడా అట్రాక్ట్ అయ్యేవాళ్లు. ఒకసారి కాదు వందలసార్లు చెప్పారు. దానికి వేలమంది కాదు, అనేక వేలమంది సాక్ష్యం ఉన్నారు.

మిస్టర్ స్పీకర్ః జలీల్ ఖాన్‌గారూ..

శ్రీ జలీల్‌ఖాన్ (విజయవాడ-వెస్ట్)ః అధ్యక్షా, చెప్పిన మాట వాస్తవమే. (ట్రెజరీ బెంచ్ నుంచి చప్పట్లు) నేను ఆనాడు తెలుగుదేశం పార్టీలో ఉన్నాను. వాస్తవాల్ని గమనించాను కాబట్టి, కాంగ్రెస్‌పార్టీ కార్యాలయాలను పోల్చడానికి నేను చెప్పాను. కానీ, రామ్మోహన్ గారూ, తెలుగుదేశంపార్టీలో మీకు ప్రాధాన్యత లేనప్పుడు మీరు కూడా ఆ పార్టీ గురించి చాలా మాటలు మాట్లాడారు. మనం ఒకరి గురించి ఒకరం చెప్పుకోవటం కాదు. శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు మీకు ఎంఎల్ఏగా సీటు ఇస్తారో లేదో అని గతంలోనూ, మొన్న ఎన్నికల ముందు కూడా చాలా మాట్లాడారు. (సభ్యులు శ్రీ గద్దె రామ్మోహన్‌ను ఉద్దేశించి) ప్రతి ఒక్కరికీ ఒక చరిత్ర ఉంటుంది. డా.వై.ఎస్.రాజశేఖరరెడ్డిగారి పరిపాలన వారి పద్ధతిలో జరిగింది. శ్రీ నారా చంద్రబాబునాయుడుగారి పరిపాలన, వీరి పద్ధతిలో జరిగింది. సభ్యులు శ్రీ గద్దె రామ్మోహన్‌గారు ఇప్పుడు కరెంటు గురించి మంచి విషయం మాట్లాడుతున్నారు. మేం హర్షిస్తున్నాం. మీరు నా పేరును ప్రస్తావించి, నన్ను సాక్షిగా పెట్టడం కాదు, విజయవాడ నగర ప్రజలను సాక్షులుగా పెట్టండి.

మిస్టర్ స్పీకర్ః రామ్మోహన్ గారూ..

శ్రీ గద్దె రామ్మోహన్ (విజయవాడ-ఈస్ట్): అధ్యక్షా, అన్నిటికీ ప్రజలే సాక్ష్యం. ప్రజలే న్యాయ నిర్ణేతలు. సభ్యులు శ్రీ జలీల్‌ఖాన్‌గారు విజయవాడ గురించి ప్రస్తావించారు కాబట్టే, నేను వారి పేరును వాడానే తప్ప, మరొకటి కాదు.

ఏదిఏమైనా, వ్యవసాయానికి 9 గంటలు విద్యుత్ ఖచ్చితంగా ఇవ్వాల్సిన అవసరం ఉంది. దానికి మా నాయకుడు కట్టుబడి ఉన్నారు. అదేవిధంగా గృహ అవసరాలకు 24 గంటల విద్యుత్‌కోసం సెపరేట్ ఫీడర్స్ వేసి, వీటిని కూడా పునరుద్ధరించాలి. బడ్జెట్‌లో రూ.7,160 కోట్లు విద్యుత్ రంగానికి ప్రతిపాదించడం జరిగింది. ఇందులో ప్రణాళికేతర పద్దు కింద రూ.3,188 కోట్లు, వ్యవసాయరంగానికి ఇచ్చే రాయితీతోపాటు అదనపు విద్యుత్ కొనుగోలును దృష్టిలో పెట్టుకుని ఈ మేరకు కేటాయించడం జరిగిందని తెలియజేస్తున్నాను.

మనకు సుమారు 900 కిలోమీటర్ల పొడవైన, సువిశాలమైన కోస్తా ప్రాంతం ఉంది. విద్యుత్‌కు అనువైన ప్రాంతం అక్కడ కూడా ఉంది. దీనిని కూడా ప్రభుత్వం దృష్టిలో పెట్టుకుని, కోస్తా ప్రాంతమంతటా 6 లైన్ల రోడ్డుని ఏర్పాటుచేయగలిగితే, ఇటు విద్యుత్ పరిశ్రమలకీ, ఇతర పరిశ్రమలకి, అంతేకాకుండా ప్రతీ పట్టణానికి కూడా తక్కువ దూరంలో చేరుకోటానికి అవకాశం ఉంటుంది. దీనిని కూడా ప్రభుత్వం పరిశీలించవలసిందిగా తెలియజేస్తున్నాను.

ఈ విద్యుత్ ప్రభావం వ్యవసాయం మీద, పరిశ్రమల మీదనే కాకుండా ఆరోగ్యం, విద్య మీదే కాకుండా, అన్ని రంగాలమీద ప్రభావితం చేస్తుంది. గడిచిన వేసవిలో పరీక్షలకు హాజరయ్యే పిల్లలు కూడా కరెంటు లేకపోవడం వలన చదువుకోలేని పరిస్థితి వచ్చింది.

...

అంతేకాదు, ప్రభుత్వాసుపత్రుల్లో విద్యుత్ కోతల వలన, వెంటిలేటర్స్ పనిచేయక పసిపిల్లలు మరణించిన సందర్భాలు కూడా ఉన్నాయి. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని, విద్యుత్‌రంగ పటిష్టతను ఈ తెలుగుదేశం ప్రభుత్వం, తన ప్రాధాన్యతగా తీసుకున్నందుకు మా నాయకుడి గురించి, చాలా గర్వంగా చెప్పుకుంటున్నాము. 1998లో చేపట్టిన సంస్కరణలు, వాటి ఫలితాలను నిర్వీర్యం చేసిన తరువాత ప్రభుత్వాలు, వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని, ఆర్థికంగా ఈ రాష్ట్రం ముందుకు వెళ్ళడానికి, ఈ విద్యుత్‌ను ప్రధాన ఆయుధంగా చేసుకుని, విభజన తరువాత ఏర్పడిన అనేకమైన ఇబ్బందులను ఎదుర్కోవడానికి, మనకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంలో సఫలం కాగలమని ఆశిస్తున్నాను. విద్యుత్ విషయమై, కేంద్ర పభుత్వం ద్వారా ఎన్నిక కాబడిన మూడు రాష్ట్రాల్లో, మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కూడా ఇన్‌క్లూడ్ చేయబడడానికి, మన నాయకుడు శ్రీ చంద్రబాబునాయుడు గారి యొక్క శక్తిసామర్థ్యాలే కారణమని భావిస్తున్నాను. దీనిద్వారా అన్ని రంగాల్లో, భారతదేశంలోని అన్ని

రాష్ట్రాల కంటే వేగంగా, సింగపూర్, మలేషియాల కంటే ఎక్కువగా మన రాష్ట్రాన్ని మనం అభివృద్ధి పరచుకోవాలని కోరుకుంటూ, ఈ బడ్జెట్‌లో చేసిన ప్రతిపాదనలన్నింటినీ బలపరస్తున్నాను.

అదేవిధంగా, రవాణారంగాన్ని కూడా అభివృద్ధి పరుచుకోవాల్సిన అవసరముంది. అదేవిధంగా, మన రాష్ట్రానికి ఆశాజనకమైన పోర్టులను అభివృద్ధి పరచుకొని, ప్రతీ జిల్లాకు ఒక పోర్టును ఏర్పాటు చేసుకోగలిగితే, ఒకే పోర్టుతో సింగపూర్ ఏవిధంగానైతే అభివృద్ధి చెందిందో, అదేవిధంగా మన ఆంధ్రరాష్ట్రం కూడా అతికొద్ది కాలంలోనే, మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారి నాయకత్వంలో ఒక ఉన్నతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దబడబోతోందని తెలియజేస్తూ, నాకీ అవకాశాన్ని ఇచ్చినందుకు తమకు కృతజ్ఞతలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్ః విష్ణుకుమార్ రాజు గారు.

శ్రీ పి.విష్ణుకుమార్ రాజు(విశాఖపట్నం–నార్త్) ః అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ గద్దె రామ మోహన రావు గారు, శ్రీ జలీల్ ఖాన్ గారు, వారి పర్సనల్ విషయాలను కూడా సభలో మాట్లాడేస్తే ఎలా? ఇటువంటివి సభలో మాట్లాడితే, మిగిలిన సభ్యులకు ఇబ్బంది వస్తుంది, వాళ్ళకీ ఇబ్బందులు వస్తాయి, గౌవర ముఖ్యమంత్రి గారి ముందు చిన్నచూపుగా ఉండే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంది. అలాగే రకరకాలైనటువంటి ఇబ్బందులు వస్తాయి.

అధ్యక్షా, మా విశాఖపట్నంలో రోడ్లకు సంబంధించిన సమస్యలు చాలా ఉన్నాయి. గత పది సంవత్సరాల నుంచి, ఒక్క రోడ్డు కూడా వేయలేదు. చాలా ఘోరాతిఘోరం. నేనేమీ గత ప్రభుత్వాలనో, మరొక రాజకీయ పార్టీనో విమర్శించడానికి చెప్పడం లేదు. కేవలం ఉన్న వాస్తవాలను సభ దృష్టికి తీసుకురావాలని చెప్తున్నాను. అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు, 'మా విశాఖపట్నానికి అభివృద్ధి కావాలి, మాకు ఫలానా సౌకర్యాలు కావాలి' అని అడగడంలో, దురదృష్టవశాత్తు ఘోరమైన వైఫల్యం చెందారు. కాబట్టి, అధ్యక్షా, మా విశాఖపట్నం రోడ్లకు సంబంధించిన మాస్టర్ ప్లాన్‌లో ఏవైతే పేపర్ మీద ఉన్నాయో, వాటికి వాస్తవ రూపం కల్పించవలసిందిగా మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అధ్యక్షా, రాష్ట్రం సమైక్యంగా ఉన్నప్పుడు, విశాఖపట్నంలో ఉన్న వేలకోట్ల ప్రభుత్వ ఆస్తులను 'వుడా' ద్వారా అమ్మి, హైదరాబాద్‌లో రింగురోడ్లకు ఖర్చుపెట్టారు. ఇది వాస్తవం. ఆరోజు హైదరాబాద్‌కూడా మనదే కదా అని ఉద్యమాలు చేయలేదు. కానీ, ఉద్యమాలు తప్పదంటే ఖచ్చితంగా చేయగలము. దానిలో ఏమీ సందేహం లేదు. దురదృష్టవశాత్తు, విశాఖపట్నంలో ఆస్తులమ్మి, వచ్చిన డబ్బుతో, హైదరాబాద్‌లో అభివృద్ధి చేశారు. విశాఖపట్నం పరిస్థితేమిటంటే, అది స్ప్రెడ్ కాలేదు. రోడ్లన్నీ కూడా విశాఖపట్నంలోనే ఉన్నాయి. కాబట్టి,

విశాఖపట్నాన్ని కలుపుతూ బయటకు కూడా రోడ్లు వేస్తే, అందరికి సైట్లు గానీ, ల్యాండ్స్ గానీ అందుబాటులోకి వచ్చి ప్రజాజీవితం బాగుంటుందని తమరి ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను.

ప్రస్తుతమున్న హైవే విశాఖపట్నం మధ్యలోనుండి వెళ్తోంది. రోడ్లమీద బారియర్స్ పెట్టడం అక్కడ ప్రధాన సమస్యగా ఉంది. ఆ రోడ్డుపై ప్రయాణిస్తున్నప్పుడు, ముందరున్న వాహనం బారియర్ అడ్డంగా ఉందని, ఒక్కసారిగా ఎడమవైపునకు మళ్ళినప్పుడు, దాని వెనకాల ఉండే వాహనం, ఆ బారియర్ కనబడక, దానిని ఢీకొట్టడం జరుగుతోంది. ఈ విషయమై ఎన్ని సార్లు విన్నవించినా ఫలితమైతే ఏమీ రాలేదు.

అధ్యక్షా, విశాఖపట్నంలో ఒక చోట నుండి మరొక చోటకి నిర్దారిత సమయంలో వెళ్ళాలంటే, కేవలం మంత్రులకు మాత్రమే సాధ్యం. వాళ్ళ వాహనాలకు బల్బులుంటాయి కాబట్టి, వాళ్ళు స్పీడ్‌గా వెళ్ళగలుగుతున్నారు. అధ్యక్షా, నా కోరిక ఏమంటే..., ఎం.ఎల్.ఏ.లకు కూడా ఎందుకు ఆ బల్బులు ఇవ్వకూడదు. (సభలో నవ్వులు). ఎం.ఎల్.ఏ.లకు మంత్రులకు డిఫరెన్స్ ఉండాలంటే.... ఎం.ఎల్.ఏ.లకు రెండు బల్బులివ్వండి. ఆ బల్బులకు కూడా డబ్బులు ఖర్చు పెట్టక్కరలేదు. మేమే పెట్టుకుంటాం...ముందొకటి, వెనకాలొకటి...(సభలో నవ్వులు). అలాగే, సైరన్ సౌకర్యం కూడా పెట్టుకోవడానికి అనుమతివ్వండి. మా వాహనాలకు సెక్యూరిటీ కూడా అక్కరలేదు. నిజంగానే అక్కడి పరిస్థితి గురించి తమరు ఆలోచించవలసిన అవసముంది. మా మంత్రులు, శ్రీ సిహెచ్.అయ్యన్న పాత్రుడు గారుగానీ, శ్రీ గంటా శ్రీనివాసరావు గారు గానీ, ఎయిర్‌పోర్టుకు వెళ్ళాలంటే 10 నుండి 20 నిముషాల్లో వెళ్ళగలుగుతున్నారు. కానీ మేము వెళ్ళాలంటే, కనీసం గంట సమయం పడుతోంది. కాబట్టి, దయచేసి ఎం.ఎల్.ఏలకు రెండు బల్బులు ఇచ్చే విషయం గురించి తమరు సీరియస్‌గానే ఆలోచించాలని కోరుతున్నాను. (సభలో నవ్వులు).

అధ్యక్షా, అదేవిధంగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జెస్ లేకపోవడం వలన చాలా ప్రమాదాలు జరిగి, చాలా మంది చనిపోవడం జరుగుతోంది. విశాఖపట్నానికి ఫుట్‌ఓవర్ బ్రిడ్జెస్ కావాలి. విశాఖపట్నం నగరం మధ్యలోనుండి కలిపే విధంగా కనీసం రెండు, మూడు చోట్ల ఫ్లైఓవర్‌లు తప్పనిసరిగా నిర్మించాల్సిన అవసరముంది. ఈ ఫ్లైఓవర్‌ల గురించి రాష్ట్ర ప్రభుత్వాన్ని అడిగితే, కొన్నిచోట్ల ఎయిర్‌పోర్టు అథారిటీ చూస్తుందంటారు, కొన్నిచోట్ల హైవే అథారిటీ చూస్తుందంటారు, మరికొన్ని చోట్ల రైల్వే అథారిటీ చూస్తుందంటారు. కానీ, ఎవ్వరూ కూడా చేపట్టడంలేదు. కాబట్టి, అధ్యక్షా, ఈవిషయమై ఒక ప్రత్యేక కమిటీని నియమించడం ద్వారా, ఎక్కడెక్కడ బ్రిడ్జెస్ అవసరమున్నాయి, దానికి బాధ్యత ఎవరిది అనే అంశాలను కూడా చూడవలసిన అవసరముంది.

అదేవిధంగా, విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో సౌకర్యాలు చాలా ఘోరంగా ఉన్నాయి. ఎయిర్‌పోర్ట్ చూడడానికి చాలా పెద్దదిగా ఉంటుంది. కానీ, వర్షం వస్తే, నీళ్ళన్నీ లోపలే ఉంటాయి. ఎయిర్‌పోర్టు మంత్రివర్యులు, మన తెలుగుదేశం పార్టీ ఎం.పి. గారే కాబట్టి, వారి ద్వారా ఎయిర్‌పోర్టుకు కావలసిన సౌకర్యాలు మెరుగుపరచేవిధంగా ప్రభుత్వం తరపున కేంద్ర మంత్రివర్యులను కోరవల్సిందిగా, ప్రభుత్వాన్ని తమ ద్వారా కోరుతున్నాను.

అదేవిధంగా, త్రాగి నడిపే వారిపై చట్టంలో కఠినమైన నిబంధనలను పొందుపరచవలసిన అవసరముంది. అవి ఎలా ఉండాలంటే, త్రాగి వాహనం నడపాలంటే, చాలా భయపడాల్సిన పరిస్థితి ఉండాలి. అమెరికాలో ఎవరైనా ఏదైనా పార్టీకి వెళ్ళి, త్రాగి, ఆ తరువాత వాహనాన్ని కనుక నడిపినట్లైతే, ఆ ఆతిథ్యం ఇచ్చివారికి కూడా దానికి బాధ్యత వహించాల్సి ఉంటుంది. త్రాగి నడిపిన వారి లైసెన్సులు రద్దుకాబడుతాయి. అటువంటి, గట్టి చర్యలు తీసుకోకపోతే, ఈ ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. కేవలం, త్రాగి వాహనాలు నడిపిన వారే కాకుండా, అమాయకులు కూడా ప్రాణాలు కోల్పోతున్నారు. పోలీస్ డిపార్టుమెంట్ గానీ, ఎక్సైజ్ డిపార్టుమెంటుగానీ, అది ఏ శాఖ అయినప్పటికీ, ఈ చట్టంలో కఠినతరమైన మార్పులు తీసుకురావలసిన అవరసం తప్పనిసరిగా ఉందని తమద్వారా తెలియపరుస్తున్నాను. ఈ మార్పులు తీసుకువచ్చినప్పుడే, అమాయకుల ప్రాణాలు బలికాకుండా చూడగలిగినవారమవుతాం.

అదేవిధంగా, ఇప్పుడు విద్యుత్ సరఫరా బాగా మెరుగుపడింది. దానికి గౌరవ ముఖ్యమంత్రి గారిని మనస్ఫూర్తిగా అభినందించవలసిన అవసరముంది. అదేవిధంగా ఏ.పి.ఈ.ఆర్.సీ. కొన్ని రూల్స్ పెట్టడం జరుగుతోంది. ఆ రూల్స్‌ని ఉన్నదున్నట్లుగా అమలులోనికి తెచ్చేముందు, ఏ.పీ.ఈ.పీ.డీ.సీ.ఎల్. ఛైర్మన్ యొక్క అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుని, అప్పుడు ఆ రూల్స్‌ని, జీ.ఓ. రూపంలో తీసుకువస్తే మంచిదని నా వ్యక్తిగత అభిప్రాయం. ఇప్పటి వరకు, వాడినా వాడకపోయినా, 80 శాతం డిమాండ్ మేరకే కట్టవలసిన పరిస్థితి ఉంది. 20 శాతం మనం వాడకపోయినా ఫరవాలేదు. ఏ.పి.ఈ.ఆర్.సీ. ప్రతిపాదించే రూల్స్ ఎలా ఉన్నాయంటే, ఎవరైనా 100 కె.వి. రిక్వైర్‌మెంట్ కొరకు అప్లై చేసుకుని, డి.డి. కట్టి, కనెక్షన్ తీసుకుంటే, 20 నుండి 30 శాతం మాత్రమే విద్యుత్‌ను వినియోగించుకున్నా కూడా, కనెక్షన్ తీసుకున్న 100 కె.వి. మొత్తానికి చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అనధికారికంగా తెలిసింది.

...

ఇటువంటి రూల్స్ పరిశ్రమలకు చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. ఏపిఈఆర్‌సీ నియమ, నిబంధనలు తయారుచేసే ముందు డిస్ట్రిబ్యూషన్ కంపెనీల అధికారులతో, పారిశ్రా మికవేత్తలతో, స్థానిక సంస్థలతో కలిసి చేయవలసిందిగా కోరుతూ ఈ అవకాశాన్ని నాకు ఇచ్చి నందుకు ధన్యవాదాలు తెలుపుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కాకాని గోవర్ధన్ రెడ్డి (సర్వేపల్లి): అధ్యక్షా, గౌరవసభ్యులు విద్యుచ్ఛక్తి మీద అనేక రకాలైన విషయాలు చెప్పారు. ప్రభుత్వం దానిపై శ్వేతపత్రాన్ని కూడా విడుదల చేసింది. అది పూర్తి సత్యాలతో కాకుండా, అసత్యాలతో, అర్ధసత్యాలతో విడుదల చేసినట్లు మాకు అనిపిస్తుంది. ఇది చాలా దురదృష్టకరం. 2004వ సంవత్సరానికి ముందు విద్యుచ్ఛక్తి ఒక కమోడిటీగా ఉంటే 2004వ సంవత్సరంలో శ్రీ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రి అయిన తరువాత రాష్ట్ర అభివృద్ధిలో అది ఒక ప్రధానమైన అంశంగా మారింది. ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రంలో ఆత్మస్తుతి, పరనింద. . .

(అధికార సభ్యుల నుంచి అభ్యంతరాలు)

అధికారపక్షం వారు అనేక లెక్కలు చెప్పారు. విద్యుచ్ఛక్తి ఉత్పాదక కేంద్రాల గురించి మాట్లాడారు. వాటి గురించి మాట్లాడాల్సి వస్తే ఎన్‌టిపిపి, విజయవాడ 1979-1995 సంవత్సరాల మధ్య 1260 మెగావాట్ల నెలకొల్పడం జరిగింది. అంటే ఫిబ్రవరి 24, 1995 కల్లా పూర్తి అయ్యాయి. మీరు (అధికారపక్ష సభ్యులనుద్దేశించి) చెప్పిన విధంగా అది తెలుగుదేశం పార్టీ హయాంలో జరిగింది కాదు. ఒక విద్యుత్ కేంద్రాన్ని నిర్మించాలంటే మూడు నుంచి ఐదు సంవత్సరాల కాలం పడుతుంది.

నాలుగవ స్టేజ్ వచ్చేటప్పటికీ 28-01-2010 తేదీకి 500 మెగావాట్లు వచ్చింది. ఆర్టీపీపీకి సంబంధించి స్టేజ్1 క్రింద జరిగిన రెండు 210 మెగావాట్ల యూనిట్లు 31-03-1994, 25-02-1995 అంటే 420 మెగావాట్లు  మీ ప్రమేయం లేకుండానే నిర్మించారు. స్టేజ్2లో నిర్మించిన రెండూ కూడా 12-08-2007, 29-03-2008న నిర్మించడం జరిగింది. స్టేజ్3కి సంబంధించి 29-11-2010లో 210 మోగావాట్లు, మొత్తం 2810 మెగావాట్లు మీకు సంబంధం లేకుండా నిర్మించడం జరిగింది.

హైడల్ పవర్ గురించి మాట్లాడితే, శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్‌కు సంబంధించిన 770 మెగావాట్లు మీ పార్టీ పరిపాలనకు ముందుగానే జరిగింది. శ్రీ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారి హయాంలో పులిచింతల ప్రారంభం అయి 120 మెగావాట్లు జూన్, ఆగస్టు 2015కు ఉత్పాద నకు వచ్చే పరిస్థితి ఉంది.  శ్రీ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారి హయాంలో నాగార్జున సాగర్ టెయిల్ పాండ్‌లో నిర్మించిన 50 మెగావాట్లు అక్టోబర్, నవంబర్‌లో వచ్చే పరిస్థితి ఉంది.  సీలేరు ప్రాజెక్ట్ 1960-90లో నిర్మించారు. కాబట్టి ఈ విద్యుత్ ఉత్పాదక రంగాలు, ప్రభుత్వరంగ సంస్థల్లో జెన్‌కో చేపట్టింది కాబట్టి అవి శ్రీ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారి హయాంలో జరిగాయి. ఇవన్నీ మీ పరిపాలన రాకముందు  జరిగాయన్నది వాస్తవం.

(అధికారపక్ష సభ్యుల నుంచి అభ్యంతరాలు)

1994వ సంవత్సరం తరువాత తెలుగుదేశం పాలనలో కొన్ని జరిగాయి, ఆ వివరాలు కూడా చెబుతాను. ఏపీడీపీసీఎల్ జాయింట్ వెంచర్ క్రింద 272.5 మెగావాట్లు, 1997వ సంవత్సరంలో జీవికే 216 మెగావాట్లు, 1998వ సంవత్సరంలో స్పెక్ట్రం 208 మెగావాట్లు, ల్యాంకో 2000వ సంవత్సరంలో 350 మెగావాట్లు, 2002వ సంవత్సరంలో బిఎస్ఎస్ 220 మెగావాట్లు జరిగాయి. ఇందులో ప్రభుత్వరంగ సంస్థకు సంబంధించినవి ఉన్నాయో చెప్పాల్సిన అవసరం ఉంది. మీ హయాంలో ఫాస్ట్‌ట్రాక్ క్రింద కోనసీమ, వేమగిరి, జీవికే ఎక్స్‌టెన్షన్, గౌతమి పేర్లతో 1498 మోగావాట్ల విద్యుత్ ఉత్పాదన కేంద్రాలకు అనుమతిచ్చారు. వాటికి గ్యాస్ లేదు. ఆనాడు పబ్లిక్ హియరింగ్స్‌లో గ్యాస్ లేదని ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిటీ ముందు వాదిస్తే, అక్కడ ‘గెయిల్’ను తీసుకొచ్చి, మేము గ్యాస్ ఇప్పిస్తామని వారి ముందు ప్రజెంటేషన్ ఇప్పించి పీపీఏలు  ఎంటర్ అయిన విషయాన్ని మీ పరిపాలనలో జరిగిందో, లేదో గుర్తు తెచ్చుకోండని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. అవన్నీ నిరర్థక ఆస్తులుగా, గుదిబండగా మారి రూ.1020 కోట్లు ఫిక్స్డ్ చార్జీల రూపంలో చెల్లించాల్సి వస్తే శ్రీ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారు ఫిక్స్డ్ చార్జీలు చెల్లించకుండా 2009 నుంచి 2012 వరకు దాని ఉత్పాదనలో తీసుకొని వచ్చి 2013లో వాటిని పూర్తిగా క్లోజ్ చేయడం జరిగింది.

మీ హయంలో జరిగిన మినీ పవర్‌ప్లాంట్ ఎల్‌వీఎస్‌కు దాదాపు రూ.200 కోట్లు ఫిక్స్డ్ కాస్టు క్రింద చెల్లించారు. ఇంకా రూ.39 కోట్లు చెల్లించాల్సింది. అదే శ్రీ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి హయాంలో జరిగినవి ఒకసారి పరిశీలిస్తే ఎన్‌టిపీపీ 500 మెగావాట్లు, ఆర్‌టిపీపీ 200 మెగావాట్లు..

(మైక్ కట్ చేయబడింది)

(శ్రీ ఎస్.ఆనంద్ బాబు అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

శ్రీ పల్లె రఘునాథ రెడ్డి (పుట్టపర్తి)ః అధ్యక్షా, గౌరవసభ్యులు వాస్తవాలు చెప్పడం లేదు, సభను తప్పు దారి పట్టిస్తున్నారు.

(ప్రతిపక్ష సభ్యుల నుంచి సభకు అంతరాయం)

These are the records. వినండి. 1994 నుంచి 2004వ సంవత్సరాలలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇన్‌స్టాల్డ్ కెపాసిటీ  5634 మెగావాట్ల నుంచి 10694 మెగావాట్ల వరకు పెంచాం. 90% increase in installed capacity. అదే 2004-14 సంవత్సరాలలో తల్లి కాంగ్రెస్, పిల్ల కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు 10694 మెగావాట్ల నుంచి 16917 మెగా

వాట్లు, అంటే 56 శాతం మాత్రమే పెరిగింది. తెలుగుదేశం పార్టీ హయాంలో 10 సంవత్సరాలలో ఇన్‌స్టాల్డ్ కెపాసిటీ 90 శాతం పెరిగితే, అదే కాంగ్రెస్ పార్టీ హయాంలో 10 సంవత్సరాలలో 56 శాతం పెరిగినది వాస్తవమా? కాదా?

రెండవది ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్‌ను తీసుకుంటే, తెలుగుదేశం పార్టీ అధికారంలో లేనపుడు 68.7 శాతం ఉంది. అధికారంలోకి వచ్చిన తరువాత 86 శాతానికి పెంచాం. థర్మల్ పవర్ స్టేషన్స్ విటిపీఎస్, ఆర్‌టిపీపీ1, కేటిపీఎస్, స్టేజ్5 of the highest PLF in the country. ఇక్కడ ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ 68.7 శాతం నుంచి 86 శాతానికి పెరిగితే, అక్కడ 86 శాతం నుంచి 78 శాతానికి తగ్గితే, అంటే 8 శాతం తగ్గిన మాట వాస్తవమా? కాదా?

మూడవది ఎనర్జీ డెఫిసిట్. తెలుగుదేశం పార్టీ హయాంలో 14.4 శాతం నుంచి 1.4 శాతానికి తగ్గించడమైంది. గొప్పగా చెప్పే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 1.5 శాతం నుంచి 17.6 శాతానికి ఎనర్జీ డెఫిసిట్ పెరిగిన మాట వాస్తవమా? కాదా?

పవర్ సెక్టార్‌లో రేటింగ్స్ గురించి, AP Power Sector ranked first in the country by Crisil during the year 2003-2004. అంటే డిస్కమ్స్‌కు ఏ రేటింగ్ వచ్చింది. అదే కాంగ్రెస్ హయాంలో 31వ పొజిషన్ వచ్చింది. AP Discom given rating BB+ Rating వచ్చింది. బడ్జెట్‌లో 7.8 శాతం మనం కేటాయిస్తే, వారు 5 శాతం మాత్రమే కేటాయించారు. ఏ విధంగా చూసిన కాంగ్రెస్ పార్టీ 10 సంవత్సరాల పాలనలో విద్యుత్ పంపిణీ, సరఫరా చాలా తక్కువగా ఉంది. రైతులు చాలా ఇబ్బంది పడ్డారు అనేక ఉద్యమాలు జరిగాయి. విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద ధర్నాలు చేశారు. తెలుగుదేశం పార్టీ హయాంలో ఆ 9 సంవత్సరాలలో 9 గంటల పాటు నిరాటంకంగా నాణ్యమైన విద్యుత్‌ను ఇచ్చాం. ఇక ముందు కూడా 7 గంటలు ఇస్తాం, 9 గంటలు ఇవ్వడానికి ప్రయత్నం చేస్తాం.

...

శ్రీ కాకాని గోవర్ధన్ రెడ్డి (సర్వేపల్లి) : అధ్యక్షా, మంత్రిగారిని కోరేదేమంటే అన్నీ అడిగిన తరువాత వారు రిప్లై ఇస్తే బాగుంటుంది. ప్రతి దానికి తల్లి కాంగ్రెస్, పిల్ల కాంగ్రెస్ అని మాట్లాడుతున్నారు. మాట్లాడదాం. మామ తెలుగు దేశం అల్లుడు తెలుగు దేశం గురించి కూడా మాట్లాడుదాం. ఇబ్బందేమీ లేదు. అయితే ప్రధానంగా నేను అదే చెప్పాను. అయ్యా మీ శ్వేత పత్రంలో 31.3. 1995 నాడు ప్రారంభోత్సవం చేసినవి కూడా మీ ఖాతాలో వేసుకున్నారు. ఎప్పుడు ప్రారంభమయ్యాయి, ఎప్పుడు పూర్తయ్యాయన్న విషయాలు కూడా మీరు ఆలోచించండి. మీరు రాకముందువి కూడా మీ ఖాతాలో వేసుకున్నారని చెప్పడం జరిగింది. అయితే, రాజశేఖర రెడ్డి గారు ముఖ్యమంత్రి అయిన తరువాత ఎన్‌టిపిపి 500 మెగావాట్లు, ఆర్టీపీపీ టు 420 మెగావాట్లు, 2007, 2008, ఆర్టీపీపీ త్రీ 210 మెగావాట్లు 29.11.2010, కృష్ణపట్నం 800 మెగావాట్లు, ఆగస్టులో, ఇప్పుడు సిద్ధంగా వున్నవి ఆర్టీపీపీ 4, 600

మెగావాట్లు, హిందూజా 1998లో వచ్చినటువంటి ఆయన హయాంలో ప్రారంభమైనటువంటి 520 మెగావాట్ల విద్యుత్ ఫేజ్ -I, మరో 520 మెగావాట్ల విద్యుత్ ఫేజ్ -II. మీ హయాంలో గ్యాస్ బేస్డ్ క్రింద ప్రైవేట్‌రంగ విద్యుత్ సంస్థలకు మీరు కట్టబెట్టినటువంటి 1,000 మెగావాట్ల విద్యుత్, సింహాద్రి, ఎన్టీపిసి ద్వారా వచ్చినటువంటి 1,000 మెగావాట్ల విద్యుత్ తప్ప మరేమన్నా ఉందా అనే విషయంలో ఒకసారి ఆలోచన చేసుకోవాల్సిన పరిస్థితి కనబడుతోంది. అయితే, ఈ సందర్భంగా శ్వేతపత్రం చూసిన తరువాత నాకు ఒక చిన్న సామెత గుర్తుకు వస్తోంది. "అమెరికా దేశస్థుడొకడు వెంట్రుకవాసి సూదినొకదాన్ని నీడిల్ తయారు చేశాడంట. దాన్ని తీసుకుని జపాన్ దేశానికి తీసుకువెళ్లి ఈ నీడిల్‌ను కొద్దిగా డెవలప్ చేయమని అడగ్గా అందుకు జపాన్ దేశస్థుడు ఆ నీడిల్‌కు రెండు రంధ్రాలను వేసి పంపాడట. సరే దాన్ని ఫర్దర్‌గా ఏమైనా డెవలప్ చేస్తారేమోనని చెప్పి ఇండియాకు వస్తే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లండి అక్కడ టెక్నికల్ ఎక్స్‌పర్ట్స్ ఉన్నారని చెప్పి ఇక్కడకు పంపారట. సరే ఇక్కడికొస్తే, "టెక్నో డెమో పార్లర్" అనేదానికి తీసుకువచ్చారు. దాన్ని చూసి సరే రేపొద్దున రండి తిరిగి ఇస్తామని చెప్పగా తెల్లవారగానే వచ్చి చూస్తే దాని మీద ఏమి కనిపించలేదట. చూసి ఏమి కనిపించలేదనే విషయాన్ని చెప్పగా "పిచ్చోడా, నీ అద్దాలతో ఏమీ కనబడదు నా అద్దాలు పెట్టుకుని చూడు" అని చెప్పారట. అద్దాలు పెట్టుకుని చూశాడు. దాన్ని తయారు చేసింది అమెరికా దేశస్థుడు. రెండు రంధ్రాలు వేసింది జపాన్ దేశస్థుడు. వీళ్లు దాన్ని తీసుకుని ఆ నీడిల్ మీద "made by T.D.P." అనే ముద్ర వేసి ఆ నీడిల్‌ను తిరిగి ఇచ్చాడట.

(ప్రతిపక్షసభ్యుల నుంచి చప్పట్లు వినిపించాయి)

కాబట్టి ఎవరి హయాంలోనో వచ్చిన ప్రాజెక్టుల గురించో, ఎవరి హయాంలోనో అభివృద్ధి చేసినవో, మీ హయాంలో వాటికి రిబ్బన్లు కత్తిరించి, "అయ్యా ఇదంతా మా ప్రగతి, మేం అభివృద్ధి చేశాం" అని చెప్పుకుంటే ఎట్లా? మీకు అనుకూలంగా జరిగినటువంటివన్ని మీవిగా, అనుకూలంగా జరగనటువంటివన్ని మావిగా అధికారపక్షం చెప్పే రోజులొచ్చాయి. తెలుగుదేశం పార్టీ హై లెవెల్ కమిటీని హితేన్ బయ్యా కమిటీ అనే ఒక కమిటీని వేశారు. ఆ కమిటీ సూచనల ప్రకారం మా ప్రభుత్వం సంస్కరణలను తీసుకువచ్చిందని చెప్పడం జరిగింది. ఆ కమిటీ ఏం చెప్పింది? హితేన్ బయ్యా కమిటీ చెప్పినదేమిటంటే, రాష్ట్ర విభజన అంటూ జరిగితే, వాటిని గవర్నమెంట్ కంట్రోల్‌లో ఉండే విధంగా చేయమని కమిటీ చెబితే, మీరు వరల్డ్ బ్యాంక్ కండీషన్స్‌కు తలొగ్గి సంస్కరణలపేరుతో మీ ప్రభుత్వం చేపడుతున్నట్టి కార్యక్రమాలు సబబుగా లేవు. విద్యుత్ సరఫరా విషయమై మీ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ నగరంలోని బషీర్‌బాగ్‌లో ఉద్యమం చేస్తున్న వారిపైన జరిపిన పోలీస్ తుపాకీ కాల్పులు వాస్తవమా, కాదా? ఆ సంఘటన మీ హయాంలో జరిగినదా, లేదా? వాస్తవ పరిస్థితిని చెప్పాల్సిన అవసరముంది. అదే అధికారపక్షం రాజశేఖరరెడ్డి గారి పాలన గురించి మాట్లాడుతున్నారు. కానీ, రాష్ట్రంలో రాజశేఖరరెడ్డి గారి పాలన స్వర్ణయుగాన్ని తలపించే విధంగా జరిగింది. ఆనాడు రాజశేఖరరెడ్డి గారు మీలాగ అన్నీ మా హయాంలోనే జరిగాయనిచెప్పలేదు.

(అధికారపక్షం సభ్యుల నుంచి సభకు అంతరాయం)

అవును మీరు బాధపడాలి. కరెక్టుగా అందరూ బాధపడాలి. రాజశేఖరరెడ్డి గారు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించకముందు పాదయాత్ర చేసిన సందర్భంలో, రాష్ట్ర రైతాంగానికి అధికారంలోకి రాగానే ఉచిత కరెంటు సరఫరా చేస్తామని చెప్పిన తరువాత అధికారంలోకి రాగానే మొట్టమొదటి ఫైల్ మీద మొదటి సంతకం ఉచిత విద్యుత్ ఫైల్ మీద చేసి, వారి తుది శ్వాస విడిచే వరకు రాష్ట్ర రైతాంగానికి ఉచిత కరెంటును సరఫరా చేసిన ఘనత రాజశేఖరరెడ్డి గారికే దక్కుతుందనే విషయాన్ని నేను ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నాను. ఒక రూపాయి కూడా కరెంటు చార్జీ పెంచకుండా, మీలాగ రైతులకు రుణమాఫీ చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పి, తీరా అధికారంలోకి వచ్చిన తరువాత కమిటీలు వేస్తున్నామని చెప్పి రైతాంగాన్ని మభ్యపెట్టి కాలయాపన చేసిన దాఖలాలు ఆనాటి రాజశేఖరరెడ్డి గారి హయాంలో లేవు. విద్యుత్ బకాయిలు మాఫీ చేస్తామనే విషయాన్ని రాజశేఖరరెడ్డి గారు చెప్పి, అధికారంలోకి రాగానే రూ.12 వేల కోట్ల రూపాయల విద్యుత్ బకాయిలను మాఫీ చేసిన ఘనత రాజశేఖరరెడ్డి గారి హయాం నాటిది.

అధ్యక్షా, రాజశేఖరరెడ్డి గారు కనుక జీవించి ఉండి వుంటే ఓడరేవు 4,000 మెగావాట్ల విద్యుత్ గానీ, శ్రీకాకుళంలోని ఎన్టీపిసి ద్వారా 2,400 మెగావాట్ల విద్యుత్ గానీ, పులివెందుల ఎన్టీపిసి నుంచి 2,000 మెగావాట్ల విద్యుత్ గానీ వచ్చే అవకాశం ఉండేది. ఈరోజున మీరు మాట్లాడుతున్నారు.

శ్రీ కె.అచ్చెన్నాయుడు: అధ్యక్షా........

చైర్మన్: గోవర్ధన్ రెడ్డి గారు ఒక నిమిషం కూర్చోండి. మంత్రి గారు మాట్లాడతారు. అచ్చెన్నాయుడు గారు మీరు మాట్లాడండి.

శ్రీ కె.అచ్చెన్నాయుడు (టెక్కలి): అధ్యక్షా, సోదరుడు గోవర్ధన్ రెడ్డి గారు చాలా చక్కగా మాట్లాడుతున్నాడు. కానీ, ఈ సందర్భంగా నేను ఒక విషయాన్ని సభలో ఉన్నటువంటి సభ్యులకు, సభ ద్వారా రాష్ట్ర ప్రజానీకానికి తెలియజేస్తున్నాను. రాజశేఖరరెడ్డి గారు విద్యుత్ చార్జీల విషయమై ఒక రూపాయి కూడా వారి హయాంలో పెంచలేదు, పవర్‌ను విపరీతంగా జనరేట్ చేశారు, రాష్ట్ర రైతాంగం ఎక్కడ కూడా పవర్ కట్ లేకుండా చూసింది అని గోవర్ధన్ రెడ్డి గారు ఇందాక చెప్పడం జరిగింది. కానీ ఆ లెక్కలన్నీ అవసరం లేదు. చాలా లెక్కలను చెప్పే ప్రయత్నాన్ని సోదరుడు చేస్తున్నాడు. నేను వారికి సూటిగా ఒక విషయం చెప్పదలిచాను. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది, చంద్రబాబు నాయుడు గారి హయాంలోని ఈ మూడు

మాసాల్లోనే పవర్ బాగా జనరేట్ చేశామని, ప్రజలను ఉద్ధరించామనే విషయాన్ని మేం చెప్పడం లేదు.

(ప్రతిపక్షసభ్యుల చేత సభకు అంతరాయం)

మీరు నేను చెప్పేది వినండి. కొత్తగా సభకు వచ్చినారు కాబట్టి మీకు అన్ని విషయాలు తెలియాలి. విద్యుత్ వ్యవస్థను పూర్తిగా గాలికి వదిలేసింది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే. మేం అధికారంలోకి వచ్చిన, ఈ మూడు మాసాల్లో కొన్ని సంస్కరణలకు శ్రీకారం చుట్టడం జరిగింది. శ్రీ చంద్రబాబు నాయుడు గారు విద్యుత్ రంగంపైన ప్రత్యేకమైన దృష్టికి కేంద్రీకరించడం జరిగింది. ఈ మూడు నెలల కాలంలో విద్యుత్ ఉత్పత్తిని పెంచామని చెప్పడం లేదు. చంద్రబాబు నాయుడు గారు ఉన్న విద్యుత్‌ను అవసరాలకు అనుగుణంగా వాడుకోవాలని చెప్పడం జరిగింది. నేను ఈ సందర్భంగా ఒక విషయాన్ని అడుగుతున్నాను. మా ప్రభుత్వం జూన్ మాసం ఎనిమిదవ తారీఖున అధికారంలోకి వచ్చింది. మనం  అవసరంలేదు. ఎనిమిదవ తారీఖుకు ముందున్న పరిస్థితి గురించి గ్రామాలకు వెళ్లితే గానీ, ఇండస్ట్రీలకు వెళ్లితే గానీ విద్యుత్ సరఫరాకు సంబంధించిన అన్ని అంశాలు తెలుస్తాయి. ఈనాడు రాష్ట్రంలోని ఇండస్ట్రీలన్నీ కరెంటు సరఫరా లేక మూతపడినాయి.  ప్రమాణ స్వీకారానికి ముందు రోజు వరకు రాష్ట్రంలోని గ్రామాల్లో పదహారు గంటల పాటు పవర్ కట్ ఉండేది. చిన్న తరహా పరిశ్రమలన్నీ మూతపడ్డాయి. ఎక్కడికక్కడ పరిశ్రమలన్నింటికి కరెంటు సరఫరాలేనందున మూతపడిన పరిస్థితులు మనకు కనబడుతున్నాయి. ఏదో విద్యుత్ ఉత్పత్తి చేశామని చెప్పుకోవడం కాదు. నాయకుడన్న తరువాత గట్స్ ఉండాలి. నాయకత్వంలో గట్స్ ఉండాలి. ఉన్న విద్యుత్‌నే సక్రమంగా వినియోగించుకుంటున్నాం. మేం కూడా కొత్తగా విద్యుత్ ఉత్పత్తిని చేశామని చెప్పడం లేదు.  ఈ మూడు మాసాల్లో విద్యుత్ ఉత్పత్తి కొత్తగా చేయలేదు.  కానీ నాయకత్వం అలాంటిది. చంద్రబాబు నాయుడు గారు ప్రత్యేకమైన దృష్టిని సారించి ఉన్నటువంటి విద్యుత్‌ను ఎక్కడ కూడా నష్టం కల్గకుండా సక్రమమైనటువంటి పద్ధతిలో వినియోగంలోకి తెచ్చే ప్రయత్నాన్ని చేస్తున్నారు. ఈనాటి పరిస్థితుల్లో విద్యుత్ సబ్ స్టేషన్లల్లో కూడా మీటర్లు ఏర్పాటు చేసి ఏ గ్రామానికి ఎంత సమయంపాటు కరెంటు సరఫరా అవుతుందని గానీ, ఏ సమయంలో కరెంటు పోతుందని స్పష్టంగా సమాచారాన్ని అందించే వ్యవస్థ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.

(ప్రతిపక్షసభ్యుల చేత సభకు అంతరాయం)

గత పది సంవత్సరాల కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాల హయాంలో వ్యవస్థలన్నింటిని కుప్ప కూల్చారు. కానీ ఈ మూడు మాసాల మా ప్రభుత్వ కాలంలో కూలిపోయిన వ్యవస్థలను పునరుద్ధరించే పనిలో చంద్రబాబు నాయుడు గారు నిమగ్నమైనారు. లేని గొప్పలు చెప్పుకోకూడదు. కావాలంటే మీరు గ్రామాలకు వెళ్లి అడగండి.

(ప్రతిపక్షసభ్యుల చేత సభకు అంతరాయం)

చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలోని తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో గానీ, పట్టణాల్లో గానీ పవర్ కట్ తగ్గిందా, లేదా? ఈనాడు గ్రామాల్లో స్వచ్ఛమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందా, లేదా? గత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఏడు గంటల ఉచిత విద్యుత్ సరఫరా అని రైతాంగానికి చెప్పడం జరిగింది. ఇచ్చామని, విద్యుత్ చార్జీలు పెంచలేదని మీరు చెబుతున్నారు. సర్ చార్జీల పేరుతో విద్యుత్ బిల్లులు ఈనాటి వరకు వస్తున్న సంఘటనలు చాలా ఉన్నాయి. తద్వారా ప్రజానీకం ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవం కాదా?

(ప్రతిపక్షసభ్యుల చేత సభకు అంతరాయం)

విద్యుత్‌కు సంబంధించిన చర్చ సభలో జరుగుతున్న పరిణామాలను చూసి ప్రజానీకం నవ్వుతున్నారు. ఎవరు ఎన్ని మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన పెంచారన్నది అవసరం లేదు. కానీ గ్రామాల్లో కరెంటు సరఫరా అవుతుందా, లేదా అనేదే కావాలి. మేం అధికారంలోకి వచ్చిన ఈ మూడు మాసాల కాలంలో పవర్ కట్ లేకుండా చేశాం. ఏడు గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను రైతాంగానికి సరఫరా చేస్తున్నాం. నాకు ఈ శాఖ మీద పూర్తిగా అవగాహన లేకున్నా సరే నేను ఒక విషయాన్ని స్పష్టంగా చెబుతున్నాను. మా నాయకుడి మీద నాకు పూర్తిగా నమ్మకం ఉంది కాబట్టి నేను ఈ సభ ద్వారా చంద్రబాబు నాయుడు గారి తరఫున ప్రజానీకానికి స్పష్టంగా హామీ ఇస్తున్నాను. మేం ఏదైతే రాష్ట్ర రైతాంగానికి మాటిచ్చామో, తొమ్మిది గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను వీలైనంత త్వరలో రాష్ట్ర రైతాంగానికి ఇవ్వడం జరుగుతుందనే విషయాన్ని ఈ సభ ద్వారా ప్రజానీకానికి తెలియజేస్తున్నాను.

చైర్మన్: కాకాని గోవర్ధన రెడ్డి గారు మీరు మాట్లాడండి.

శ్రీ కాకాని గోవర్ధన రెడ్డి: అధ్యక్షా.......

శ్రీ పల్లె రఘునాథరెడ్డి: అధ్యక్షా, ఒక చిన్న క్లారిఫికేషన్ ఇవ్వదలిచాను. అవకాశం ఇవ్వండి.

(ప్రతిపక్షసభ్యుల చేత సభకు అంతరాయం)

చైర్మన్: గోవర్ధన రెడ్డి గారు మీరు కూర్చోండి. మంత్రి గారు మాట్లాడతారు. రఘునాథ రెడ్డి గారు మీరు మాట్లాడండి.

శ్రీ పల్లె రఘునాథరెడ్డి (పుట్టపర్తి): అధ్యక్షా, ఒక చిన్న క్లారిఫికేషన్ సభకు ఇవ్వదలిచాను. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో విద్యుత్ రేట్లను ఆనాటి మా ప్రభుత్వం పెంచిందని, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్న కాలంలో విద్యుత్ రేట్లను పెంచలేదనే అపోహను ప్రతిపక్షసభ్యులు కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. కానీ, అది వాస్తవం కాదు. 1994-2004వ సంవత్సరాల మధ్య కాలంలో 30% మాత్రం హైక్ ఉంది. కానీ, రూ.1,500.00 కోట్ల భారం మాత్రమే వినియోగదారులమీద పడింది.

...

(వైఎస్సార్‌సీపీ సభ్యులు పోడియం వద్దకు వచ్చి అధ్యక్షస్థానంతో వాగ్వాదానికి దిగారు)

శ్రీ పల్లె రఘునాథరెడ్డిః కానీ 1500కోట్ల రూపాయలు మాత్రమే వినియోగదారుల మీద పడింది. 2004 నుంచి 2014 మధ్య కాలంలో ఎక్కడా లేని విధంగా కనీవినీ ఎరుగని రీతిలో రూ.28,835కోట్లు వినియోగదారుల మీద భారం పడింది. విద్యుత్ ఛార్జీలు పెంచారు. అదనపు ఇంధన ఛార్టీల సర్దుబాటు పేరుతో పేదలను కూడా వదలిపెట్టకుండా ఇలా వేల కోట్ల రూపాయలు భారం వేశారు. 2009-10, 2010-11, 2011-12, 2012-13లలో నాలుగు సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారు. గృహ వినియోదారులకు 93శాతం, పరిశ్రమలకు 94శాతం, కమర్షియల్‌కు 86శాతం పెంచి పేద ప్రజలకు గుదిబండగా మార్చారు. రైతులకు కూడా చాలా అన్యాయం చేశారు. మొత్తం మీద రూ.28,835కోట్ల భారం వేశారని గౌరవసభ్యులకు మీ ద్వారా మనవి చేస్తున్నాను.

చైర్మన్ః గోవర్ధన్ రెడ్డి గారూ.

(వైఎస్సార్‌సీపీ సభ్యులు పోడియం నుంచి తిరిగి తమ స్థానాలకు వెళ్లారు)

శ్రీ కాకాని గోవర్ధన్‌రెడ్డి (సర్వేపల్లి) ః అధ్యక్షా, గౌరవ మంత్రులందరూ పాపం కవర్ చేయడానికి చాలా కష్టనష్టాలు పడుతున్నారు, తంటాలు పడుతున్నారు. గౌరవ మంత్రులు మాట్లాడుతూ మేం మార్గదర్శకులమని చెబుతున్నారు కానీ 2004కు ముందు రాజశేఖరరెడ్డి గారు ఉచిత విద్యుత్ ఇస్తామంటే కరెంట్ తీగల మీద బట్టలు ఆరవేసుకోవాలని ఎద్దేవా చేసిన మీరు 2009వ సంవత్సరం ఎన్నికలకు ముందు తొమ్మిది గంటల వ్యవసాయ విద్యుత్ ఇస్తామన్నారు, ఇపుడు మరలా ఉచిత విద్యుత్ ఇస్తామంటున్నారు. మీకు మార్గదర్శిగా రాజశేఖర్ రెడ్డి గారు నిలిచారా లేదా అని మీరే గుండె మీద చేయి వేసుకొని ఆలోచించి చెప్పాలని కోరుతున్నాను. మీ హయాంలో కరెంటు చార్జీలు ఏ విధంగా పెరిగాయో చూడండి.

వార్షికాదాయం పెరుగుతున్నా ప్రపంచ బ్యాంకు వత్తిడికి తలొగ్గి కరెంట్ ఛార్జీలను పెంచిన మాట వాస్తవం కాదా? అందుకని వాస్తవంలోకి వచ్చి ఈరోజు చేపట్టవలసిన కార్యక్రమాల గురించి మాట్లాడడం మరచిపోయి ఆత్మస్తుతి పరనిందలా చేయవద్దని కోరుతున్నాను. ఈ రోజు ప్రధానంగా మనకు విద్యుదుత్పత్తికి అవసరమైన బొగ్గు, గ్యాస్ కేటాయింపులు లేకపోవడంవల్ల విద్యుదుత్పత్తిలో కొంత అంతరాయం ఏర్పడిన మాట వాస్తవం. మీరు ఒకసారి పరిశీలించి చూస్తే 1989-94 మధ్య విద్యుత్ బోర్డు లాభాలలో ఉన్న మాట వాస్తవం కాదా? 1994-2004 మధ్య మీ హయాంలో మీరు రూ.20,000కోట్ల నష్టాలు మిగిల్చిన మాట వాస్తవమో, కాదో స్పష్టం చేయాలని కోరుతున్నాను. చార్జీలు ప్రతి సంవత్సరం పెంచినా సరే బోర్డుకు నష్టాలు వచ్చాయి. అక్కడ ప్రభుత్వరంగ సంస్థలకు సంబంధించి విద్యుదుత్పత్తి పథకాలను జెన్‌కో నిర్మించకుండా పూర్తిగా ప్రైవేట్ రంగానికి అప్పగిస్తూ వాటికి పెద్దపీట వేశారు. దాని వలన 31.03.1997 నాటికి ఆరు షార్ట్ జనరేషన్ ప్రాజెక్టులు, ఆరు నాఫ్తా ఆధారిత ప్రాజెక్టులు యూనిట్ విద్యుత్‌ను 97పైసల నుంచి రూ.1.35పైసలకు పెంచితే రాజశేఖర్ రెడ్డి గారు పోరాటం చేసి దానిని తిరిగి 97పైసలకు తెచ్చి అమలుచేసినందున ఆ ఘనత వారికి దక్కింది. హైడల్ పవర్ మొత్తం విద్యుదుత్పత్తిలో కేవలం 30శాతం మాత్రమే ఉంది. మహానుభావుడు రాజశేఖర్ రెడ్డిగారు అధికారంలో ఉన్నప్పుడు వర్షాలు పడ్డాయి కానీ ఇపుడు వర్షాలు కూడా పడడంలేదు. ఎక్కడో పడిన వర్షాల వల్ల మనకు కొద్దిగా జలవిద్యుదుత్పత్తి వచ్చే పరిస్థితి ఉంది. కానీ బొగ్గు, గ్యాస్ తగినంత సరఫరా లేకపోవడంవల్ల పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తి సంస్థలు పనిచేయడం లేదు. బొగ్గు, గ్యాస్ కొరతను అధిగమించగలిగితే మరో 5000మె.వా ఉత్పత్తి పెంచుకొనే అవకాశముంది. దానికి ప్రత్యామ్నాయంగా విండ్‌మిల్స్, సోలార్ ఎనర్జీ గురించి మాట్లాడుతున్నారు. వాటి ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ కేవలం 18శాతం మాత్రమే ఉంది 10,000మె.వా మనం సంపాదించుకోగలిగితే 1800 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. 1993-94లో 23,095 మిలియన్ యూనిట్లు కావాల్సి ఉంటే 2003-04 సంవత్సరానికి డిమాండ్ 34,446 యూనిట్లకు పెరిగింది. మీ హయాంలో 11,000 మిలియన్ యూనిట్లు పెరిగింది. రాజశేఖర్ రెడ్డిగారు ముఖ్యమంత్రి అయిన కాలంలో అనగా 2004-09 మధ్య కాలంలో డిమాండ్ 59,119 యూనిట్లకు పెరిగిన మాట వాస్తవమా, కాదా ఆలోచించండి. 2013-14లో 83,108 మిలియన్ యూనిట్లకు పెరిగింది. కాబట్టి మీరు అనుకున్నట్లుగా అనేక రకాలైన అంశాలున్నాయి. కాబట్టి వాటి మీద దృష్టి పెట్టండి. జరిగిన లోపాలను ఎవరెవరి వల్ల జరిగాయో తెలుసుకోకుండా మేలైన వ్యవస్థను తెచ్చామని చెప్పడం దురదృష్టకరం.

చైర్మన్: గోవర్ధన్‌రెడ్డి గారూ తొందరగా ముగించండి.

శ్రీ కాకాని గోవర్ధన్‌రెడ్డి: అధ్యక్షా, దానికి సంబంధించి రాష్ట్ర పునర్విభజన చట్టంలో విద్యుదుత్పత్తి సంస్థలు ఏ ప్రాంతంలో ఉన్నాయో ఆ ప్రాంతంలోనే పూర్తిగా వినియోగించడానికి వీలు లేకుండా విభజనకు ముందున్న వినియోగాన్ని బట్టి చేయడంతో విద్యుత్ కేటాయింపులలో

హేతుబద్ధత లేదు కాబట్టి మనం 1142 మెగావాట్ల విద్యుత్ కోల్పోయిన మాట వాస్తవం. మీకు విజ్ఞప్తి చేసేదేమంటే, సాధారణ ఎన్నికలకు ముందు మీరు పొత్తు పెట్టుకొన్న భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని ఎన్డీయే కూటమి అధికారంలో ఉంది కాబట్టి ఆ విషయం మీద దృష్టి పెట్టి పోలవరం ముంపు గ్రామాలను ఆర్డినెన్స్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో చేర్చినట్లుగా విద్యుత్ కేటాయింపులపై కూడా సవరణ తెచ్చేందుకు మీ పరపతి ఉపయోగించమని కోరుతున్నాను. అది కాకుండా ఎంతసేపటికీ రాజశేఖరరెడ్డి గారి మీద ఆరోపణలు చేయడానికి, మీ పార్టీ హయాంలో అన్ని గొప్ప పనులే చేసినట్లు చెప్పుకోవడానికి చేసే ప్రయత్నం తప్ప మరొకటి కాదని స్పష్టంగా తెలియజేస్తున్నాను.

చైర్మన్‌ః గోవర్ధన్‌రెడ్డి గారూ తొందరగా ముగించండి.

శ్రీ కాకాని గోవర్ధన్‌రెడ్డి (సర్వేపల్లి)ః అధ్యక్షా, కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి పీయూష్ గోయల్ గారు రాష్ట్రాన్ని విద్యుత్ సరఫరాలో మోడల్ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నం చేస్తామని చెప్పారు. కాబట్టి 24X7 విద్యుత్ సరఫరా చేస్తామని పదే పదే చెబుతున్నారు కాబట్టి విద్యుదుత్పత్తి కేంద్రాలకు అవసరమైన బొగ్గు, గ్యాస్ రాష్ట్రానికి కేటాయించేలా చూసి విద్యుత్‌ను ప్రజలకు మరింత చేరువ చేయాలని కోరుతున్నాను. ఏది ఏమైనా సరే స్పష్టం చేయాలని కోరుతున్నాను. మీ హయాంలో జరిగిన కేటాయింపులలో ఒక్క మెగావాట్ కూడా ఎపిజెన్‌కో ద్వారా రాలేదు, ప్రైవేట్ విద్యుదుత్పత్తి సంస్థల ద్వారా వచ్చింది కాబట్టి భవిష్యత్తులో ప్రైవేటైజేషన్ గురించి ఆలోచించకుండా ప్రజల మంచిచెడులను బేరీజు వేసుకొని సరైన నిర్ణయం తీసుకొని భవిష్యత్తులో మార్గదర్శకత్వంగా ఉండాలని ఆశిస్తూ నాకు ఈ అవకాశం కల్పించినందుకు మీకు ధన్యవాదాలు తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ టి.శ్రావణ్‌కుమార్ (తాడికొండ)ః అధ్యక్షా, విద్యుత్ అంశంపై మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు. విద్యుత్ రంగానికి బడ్జెట్ కేటాయింపు రూ.7162కోట్లు ఉంది. ఇంతకు ముందు గౌరవసభ్యులు చెప్పినట్లుగా ఏ దేశమైనా అభివృద్ధి చెందాలంటే అందుకు కొలమానంగా తలసరి విద్యుత్ వినియోగం చూస్తారన్న సంగతి మనకు స్పష్టంగా తెలుసు. తలసరి విద్యుదుత్పత్తి, వినియోగం గురించి కూలంకషంగా చూసుకుంటే చంద్రబాబు నాయుడుగారు ఈ రాష్ట్రానికి 1995లో ముఖ్యమంత్రిగా వచ్చేవరకు ఏపిఎస్ఈబీ ఉండేది. అప్పటి విద్యుత్ సంస్థ పనితీరు ఎలా ఉందో మనందరికీ తెలియనది కాదు. తరవాత సంస్కరణలు తీసుకొచ్చి ఏపిఎస్ఈబీని జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంలుగా విభజించిన అంశాన్ని ఒకసారి పరిశీలిస్తే గౌరవ ప్రతిపక్షసభ్యులకు అర్థమవుతుంది. ఎంత విద్యుదుత్పత్తి అవుతుంది, ఎక్కడ అవుతుంది, ట్రాన్స్‌మిషన్ ఎలా ఉంది, డిస్కంలకు ఎక్కడెక్కడి నుంచి వస్తుంది, గృహావసరాలకు, పరిశ్రమలకు, వ్యవసాయానికి ఏ విధంగా పంపిణీ జరుగుతుందనే అవగాహన లేదనే సంగతి నుంచి విద్యుత్ ఎలా ఉత్పత్తి అవుతుంది, సరఫరా ఎలా అవుతుందనే సంగతి

ప్రజలకు స్పష్టంగా తెలియజేశారు. దానివలన జరిగిందేమంటే అసలు విద్యుదుత్పత్తి ఎంత, ట్రాన్స్‌మిషన్‌కు ఎంత వెళుతుంది, ట్రాన్స్‌మిషన్ నష్టాలు ఎంత ఉందో అన్నింటినీ స్పష్టంగా పరిపాలకుడిగా ఒక అవగాహనకు వచ్చి కింది స్థాయి అంటే లైన్‌మెన్ దాకా ఉత్పత్తి అయిన విద్యుత్‌లో కిందివరకు ఎంత వెళుతుందనే విషయాన్ని అవగాహన కల్పించి విద్యుత్ సంస్థలను గాడిలో పెట్టి రాష్ట్రాన్ని మిగులు విద్యుత్‌లోకి తీసుకొచ్చారని మీ దృష్టికి తెస్తున్నాను.

...

1994 – 2004 సంవత్సరాల మధ్య జనరేషన్ గ్రోత్ 90 శాతం ఉంది. 2004 – 2014 సంవత్సరాల మధ్య గ్రోత్ ఉంది కానీ అది 50 శాతానికి పడిపోయింది. ఈ రకంగా జనరేషన్ నుంచి కింద వరకు వెళ్లే ట్రాన్స్‌మిషన్ లోటు గానీ వీటన్నింటినీ తగ్గించుకుంటూ ప్రజలకు అవసరమైన మేరకు చంద్రబాబునాయుడు గారు విద్యుత్ రంగాన్ని సంస్కరించారనే విషయాన్ని నేను గుర్తు చేస్తున్నాను. వ్యవసాయానికి ప్రత్యేక విద్యుత్ లైన్లు వేయడం గానీ, ఇండస్ట్రీలకు ప్రత్యేక లైన్లు వేయడం గానీ, గృహావసరాలకు ప్రత్యేకంగా ఫీడర్లు ఏర్పాటు చేయడం గానీ చంద్రబాబు నాయుడు గారి ఆధ్వర్యంలోనే జరిగింది. ఆ రకంగా చేయడం మూలంగా వచ్చిన మిగులు విద్యుత్ అంతా గమనించిన ఆనాటి ప్రతిపక్ష నాయకులు ప్రజలకు ఉచిత విద్యుత్ అని ఎరవేసి అందరికీ ప్రామిస్ చేశారు. ఆ ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పిన తరువాత పది సంవత్సరాల్లో రాష్ట్ర విద్యుత్ పరిస్థితి ఏమైంది – కొన్ని వేల పరిశ్రమలు మూతపడ్డాయి. అనేక మందికి ఉద్యోగాలు లేకుండా పోయాయి. గ్రామాల్లో వ్యవసాయానికి పంపిణీ చేసిన విద్యుత్ గురించి సభ దృష్టికి తీసుకు వస్తున్నాను. 350 మందికి పైగా రైతులు విద్యుత్ ఎప్పుడు వస్తుందో తెలియక పొలాలకు వెళ్లిన రైతులు పాముకాటుతో చనిపోయారు. వ్యవసాయదారులు, రైతులు రాత్రులు కాపురాలు పొలాల్లో చేశారు. ఇంతకు ముందు చెప్పినట్లుగా రైతు మోటార్ దగ్గరుంటే స్టార్టర్ దగ్గర ఆయన భార్య ఉండేది. ఏ టైముకు కరెంటు వస్తుందో తెలియదు. కానీ గతంలో జన్మభూమి కార్యక్రమంలో ఏ టైములో కరెంటు వస్తుంది, ఎన్ని గంటలు ఇవ్వబోతున్నారు, ఎప్పుడు కోత ఉంటుంది, ఎక్కడుంటుంది అని స్పష్టంగా నిమిషాలతో సహా చెప్పి కరెంటు ఇచ్చిన ఘనత చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వంది కాదా అని నేనడుగుతున్నాను. మూసేసిన పరిశ్రమలకు బాధ్యత ఎవరు తీసుకుంటారు. ఉద్యోగాలు పోయిన కార్మికులంతా రోడ్డు మీద పడినప్పుడు ఈ పరిశ్రమలకు కరెంటు అందించలేకపోవడం వలన ఏర్పడిన బాధకు ఎవరు బాధ్యత వహిస్తారు? గృహాల్లో 16 గంటలకుపైగా కోత విధించిన ఘనకార్యం ఎవరు సాధించారు? 10 సంవత్సరాల్లో 9 సంవత్సరాల గురించి గౌరవ ఎం.ఎల్.ఏ గోవర్ధనరెడ్డి గారు చాలా చక్కగా చాలా అందంగా చెప్పారు. కానీ ఈరకంగా రోడ్డు మీద పడిన కార్మికుల పరిస్థితి గురించి ఎవరు చెబుతారు. ఇన్ని వేల పరిశ్రమల మూతకు కారకులు ఎవరు? పిల్లలు చదువుకోవడానికి కూడా వీలు లేని విధంగా 16 గంటల పాటు కరెంటు కోత విధించారు. ఒక్కసారి గుర్తు చేసుకోండి. మనమందరం గుండె మీద చెయ్యి వేసుకుని చెప్పుకుంటే ప్రతీ ఇంట్లో ఇన్వర్టరు కొనుక్కోవలసిన పరిస్థితి ఏ ప్రభుత్వం కల్పించిందని నేను అడుగుతున్నాను.

బడ్జెట్ మీద చర్చించాల్సిన అంశాన్ని పట్టుకుని ఏదో స్వాగతాన్ని చెప్పుకుంటూ మనుషుల గురించి పొగడడం కాదు. వాస్తవాన్ని ప్రతిబింబించే విధంగా మాట్లాడితే బాగుంటుందని నేను సూచన చేస్తున్నాను. బడ్జెట్ విషయానికొస్తే ముఖ్యమైన దార్శనిక అంశంతో చంద్రబాబు నాయుడు గారున్నారు. అది స్పష్టం. ఇదే విషయాన్ని బడ్జెట్‌లో కూడా చెప్పాను. 2014 –15 ప్రాంతంలో సోలార్ విండ్ పవర్‌కు సంబంధించి 200 మెగావాట్ల ఉత్పత్తిని పెంచడానికి బడ్జెట్‌లో ప్రతిపాదన చేయడం జరిగింది. అంతేకాదు అల్ట్రా, మెగా సోలార్ పవర్‌ని కూడా 2500 మెగావాట్లతో కర్నూలు, కడపలో ఏర్పాటు చేయడానికి కూడా ప్రపోజల్స్ ఈ బడ్జెట్‌లో రెడీ చేశారు. దానికి కేటాయింపులు కూడా చేస్తున్నారనే విషయాన్ని మీదృష్టిలో పెడుతున్నాను. వ్యవసాయం గురించి వారు చెప్పారు. ఏడు గంటల విద్యుత్ ఇవ్వలేకపోయారు. మంత్రి గారు కూడా దానికి సమాధానం చెప్పారు. ఎలక్షన్‌లో చేసిన ప్రామిస్‌ను కూడా విస్మరించారు. మూడు, నాలుగు నెలలు ప్రభుత్వంలో ఉండి కూడా ఇవ్వలేని పరిస్థితి. ఇప్పుడు ఖచ్చితంగా ఏడు గంటల నాణ్యమైన విద్యుత్ ఇస్తామని చెబుతున్నారు. రాబోయే రోజుల్లో 9గంటల నాణ్యమైన విద్యుత్తుని ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. తదనుగుణంగా అవసరమైన కేటాయింపులు గానీ పరిపాలనలో తీసుకోవలసిన సంస్కరణలు గానీ చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో ఈ ప్రభుత్వం తీసుకొంస్తుందని మీ అందరికీ సభాముఖంగా తెలియచేస్తున్నాను. పునర్‌నిర్మాణం కోసం సర్దుబాట్ల కోసం కేవలం ఈ ట్రాన్స్‌కో డిస్కమ్ ఫీడర్లను డివైడ్ చేయడానికి..... వ్యవసాయానికి, పరిశ్రమలకు, గృహాలకి ప్రత్యేకంగా డివైడ్ చేసి ఫీడర్లను ఏర్పాటు చేయడం కోసం దాదాపు రూ.3000 కోట్లు బడ్జెట్‌లో ప్రవేశపెట్టిన సంగతి తమరి ద్వారా సభ దృష్టికి తీసుకు వస్తున్నాను.

వ్యవసాయదార్లు వాడుకోవడానికి ముఖ్యంగా పంపుసెట్లు చాలా అవసరం. ఐఎస్ఐ మార్కు లేని సుమారు 36,000 పంపుసెట్లను మార్పు చేయడానికి ఈ బడ్జెట్‌లో ప్రతిపాదన తయారు చేయడం జరిగింది. అంతేగాకుండా హైటెన్షన్, లోటెన్షన్‌కి సంబంధించి 1,48,482 సర్వీసుల్లో దాదాపు 14,299 అగ్రికల్చర్ కనెక్షన్ల కోసం ఈ బడ్జెట్‌లో ప్రతిపాదనలు సిద్ధం చేసిన విషయాన్ని మీదృష్టికి తీసుకువస్తున్నాను. విద్యుత్ సరఫరా గురించి మనం ఒకసారి మాట్లాడుకోవాలి. ఈ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 1669 మెగావాట్ల యూనిట్లు అంటే దాదాపు 9.8శాతం లోటు ఉంది. దానిని జూన్, 2014 నాటికి 16 మెగావాట్ల యూనిట్లకి, 2014 జూలై నాటికి 5 మెగావాట్ల యూనిట్లకి తగ్గించిన ఘనత నారా చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వానికి దక్కుతుంది. అలా తగ్గించడం మూలంగా ఈరోజు గ్రామాల్లో ఏరోజు వెళ్లినా సరే ప్రతి ఒక్కరూ విద్యుత్ పరిస్థితి మెరుగు పడిందని చాలా సంతోషపడుతున్నారు. అటు గృహావసరాలకు, వ్యవసాయానికి కూడా విద్యుత్ పరిస్థితి మెరుగుపడిందని ప్రతీ ఒక్కరికీ తెలుసు గానీ పైకి చెప్పలేకపోతున్నారు. అంతే కాదు జూలై, 31 నుంచి 132 కెవి సబ్‌స్టేషన్లు గానీ ఇతర లైన్లు వేయడంలో గానీ మొత్తం మీద అవసరమైన మేరకు విద్యుత్ రంగంలో మార్పులు తీసుకుని వచ్చి అనేక రకాలుగా కృషి చేసి చంద్రబాబు నాయుడు గారి

గవర్నమెంటులో ఈరోజున మనమందరం హాయిగా ఉండగలుగుతున్నాము. మా ఊరి నుంచి నేను హైదరాబాద్‌కు నిన్న వచ్చాను. ఇక్కడ కరెంటు కోత ఉంది గానీ పల్లెటూర్లో ఇక్కడ కంటే చాలా తక్కువ కరెంటు కోతతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేస్తున్న సంగతి సభ దృష్టికి తీసుకువస్తున్నాను. జూలై 31తేదీ నాటికి దాదాపు 57 సబ్‌స్టేషన్లు, 8201 ట్రాన్స్‌ఫార్మర్లు. ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ వస్తే 24 గంటల్లో మార్చి వెంటనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ వేయడానికి ఈ ప్రభుత్వం చర్య తీసుకుంటుంది. అంతకు ముందు రైతులు గంటల తరబడి ట్రాన్స్‌ఫార్మర్ కోసం వేచి ఉన్నా కూడా దొరకని పరిస్థితి ఉండేది. గత పది సంవత్సరాలలో రెండు, మూడు నెలలు పైగా ట్రాన్స్‌ఫార్మర్లు మార్పు కోసం ఎదురు చూసిన పరిస్థితిని మీదృష్టికి తీసుకువస్తున్నాను. ఈ ప్రభుత్వం సాధించిన ఘనత ట్రాన్స్‌ఫార్మర్ పాడైపోతే తిరిగి మరలా 24 గంటల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ అమర్చిన సంగతిని మీదృష్టికి తీసుకువస్తున్నాను. అంతేకాదు, ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ నష్టాలని 14.53 శాతం నుంచి 13.3 శాతానికి తగ్గించడం మీద ప్రత్యేకమైన దృష్టి పెట్టారు. విద్యుత్‌కు సంబంధించిన అనేక రకాలైన విషయాల మీద హైవోల్టేజీ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ ప్రాజెక్టుకి ఈ బడ్జెట్‌లో కేటాయింపుల జరిగిన సంగతిని మీదృష్టికి తీసుకు వస్తున్నాను. దానివలన జపాన్ ఇంటర్నేషనల్ కార్పోరేషన్ నుంచి రూ.251 కోట్ల లోను తీసుకుని మిగిలినవన్నీ డిస్కమ్‌లకు, ట్రాన్స్‌కోకి అప్పజెప్పి పంపిణీలోనూ, సరఫరాలో మరియు జనరేషన్‌లో ఉన్న విషయాలన్నీ సరిదిద్దే కార్యక్రమం ఈ ప్రభుత్వం చేయబోతున్నది. అందుకోసమే ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన ఇందిరమ్మ ఇళ్లలో ఖర్చు చేసిన డబ్బుల కింద కూడా ఈ ప్రభుత్వం కేటాయింపులు చేసింది. విద్యుత్తు ఉత్పత్తి చేయడం ఎంత ముఖ్యమో, విద్యుత్తుని ఆదా చేయడం కూడా అంతే ముఖ్యం. దానిమీద ప్రజలకు, పరిశ్రమలకు ప్రతీ ఒక్కరికీ కూడా దాని గురించిన విషయాలు.... ఎకానమీ మెజర్స్ తీసుకోవలసిన చర్యల మీద కూడా ఈ ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రవేశపెట్టి డబ్బులు కేటాయించి దాదాపుగా ఆ డబ్బు ద్వారా, ప్రచారం ద్వారా ప్రజలు ఏ రకంగా విద్యుత్తుని పొదుపు చేయాలనే విషయంలో బడ్జెట్ కేటాయింపులు చేసిన సంగతిని మీద్వారా అందరి దృష్టికి తీసుకు వస్తున్నాను.

...

అంతేకాదు దాదాపు వెయ్యి రుపాయల సబ్సిడీతో దాదాపు 5000 సోలార్ ల్యాంపులను డిస్ట్రిబ్యూట్ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అంతేకాదు మహిళల గురించి చంద్రబాబు నాయుడు గారు ఎప్పుడూ శ్రద్ధ తీసుకుంటారు. పొగరాని పొయ్యిలను జన్మభూమి కార్యక్రమంలో ఇవ్వడం చూశాము. మళ్లీ ఈ బడ్జెట్‌లో కూడా రూ.125 లకే 40 వేల పొగరాని పొయ్యిలను ఏర్పాటు చేయాలని ఈ బడ్జెట్‌లో కేటాయింపులు చేసిన విషయాన్ని తమరి దృష్టికి తీసుకొస్తున్నాను. అనేక పొదుపు చర్యల్లో భాగంగా ఎవైతే సిఎఫ్ఎల్ లైట్లు, టి5 లైట్లు, ఎఫ్‌టిఎల్ లైట్ల ఏర్పాటు కోసం కూడా ఈ బడ్జెట్‌లో నిధులను కేటాయించడం జరిగింది. కాబట్టి ఒక్కటి మాత్రం సభ్యులందరి దృష్టికి తీసుకొస్తున్నాను. వ్యవసాయదారులకు 30 శాతం సబ్సిడీతో సోలార్ పంపుసెట్లను అందిచడం కోసం రూ.200 లక్షలను ఈ బడ్జెట్‌లో కేటాయించిన విషయాన్ని ఈ సభ ద్వారా తమరి దృష్టికి తీసుకొస్తున్నాను. ఇంత మంచి ఆలోచనతో రాబోయే

తరాల గురించి ఆలోచన చేసిన చంద్రబాబు నాయుడు గారి బడ్జెట్‌ని మనస్ఫూర్తిగా సమర్థిస్తూ, వాళ్లు నాశనం చేసిన విద్యుత్ వ్యవస్థను గాడిలోకి తీసుకొచ్చి, ఏదైతే చెప్పారో కరెంటు తీగల మీద బట్టలు ఆరేసుకునే స్థాయికి తీసుకొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాల నుంచి 24 గంటలు విద్యుత్‌ను ఇవ్వడానికి అన్ని ప్రణాళికలను తీసుకుంటూ, రాబోయే రోజుల్లో దేశంలో ఉన్న మూడు అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో ఒక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని చంద్రబాబు నాయుడు గారి కృషి మేరకు 24 గంటలు విద్యుత్ సరఫరా చేసే రాష్ట్రంగా అభివృద్ధిలోకి తీసుకురావడానికి చేస్తున్న నిరంతర కృషికి అభినందనలు తెలియజేసుకుంటూ, ఈ బడ్జెట్‌లోని కేటాయింపులు సంతృప్తికరంగా ఉన్నాయని ఈ బడ్జెట్‌ను నేను మనస్ఫూర్తిగా సమర్థిస్తున్నాననే విషయాన్ని తమ దృష్టికి తీసుకొస్తున్నాను. ధన్యవాదాలు.

శ్రీ సిద్ధా రాఘవరావు (దర్శి): అధ్యక్షా, ఆర్ అండ్ బి డిపార్ట్‌మెంటు ద్వారా రాష్ట్రంలో ఉన్న 46,440 కిలో మీటర్ల రహదార్ల పై వాహనములు సక్రమంగా నడుచుటకు మరియు బలమైన రహదారులను ఏర్పాటు చేయబడుచున్నవి. మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నేషనల్ హైవేస్ విభాగం క్రింద 4,302 కిలో మీటర్లు అట్లాగే హైవేస్ క్రింద 7,055 కిలో మీటర్లు, మేజర్ జిల్లా రహదారులు 15,100 కిలో మీటర్లు మరియు పంచాయితీరాజ్ డిపార్ట్‌మెంటు నుండి బదిలీ చేయబడిన ఇతర రోడ్లు 19,783 కిలో మీటర్లు ఉన్నవి. పైన తెలిపిన రహదార్లలలో ఎక్కువ రద్దీ కలిగిన 6800 కిలోమీటర్లు రహదార్లను కోర్ నెట్‌వర్క్‌గా గుర్తించి, వాటి నిర్వహణ మరియు అభివృద్ధి కొరకు ఆంధ్రప్రదేశ్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ అజమాయిషిలో ఉంచటమైనది. మన రాష్ట్రంలోని మొత్తం రహదార్లలో 2030 కిలోమీటర్ల ఫోర్‌లైన్ రోడ్లు, 9995 కిలో మీటర్లు డబుల్ లైన్ రోడ్లు, 3,050 కిలో మీటర్ల మధ్యస్థ రహదార్లు మొత్తం 31,359 కిలో మీటర్లు సింగిల్ లైన్ రహదార్లుగా ఉన్నాయి. రాష్ట్రంలో గల రహదార్లలలో కోర్ నెట్‌వర్క్ క్రింద విభజన చేయగా మిగిలిన 35,338 కిలో మీటర్ల పొడవైన రహదార్లకు అవసరమైన సాధారణ మరమత్తులు మరియు పీరియాడికల్ మెయింటెనెన్స్‌ను రాష్ట్ర బడ్జెట్‌లో నాన్ ప్లాన్ గ్రాంటు క్రింద చేపట్టడం జరిగింది.

ప్రస్తుతం రాష్ట్రంలో రూ.375 కోట్ల అంచనాలతో 287 రహదార్ల అభివృద్ధి పనులు జరుగుచున్నవి. రూ.139 కోట్ల విలువ కలిగిన 94 పనులను చేపట్టుటకు అగ్రిమెంటు/ పనులు ప్రారంభ దశలో ఉన్నవి. 44 రహదార్ల పనులకుగాను రూ.44 కోట్ల విలువ అంచనాలతో టెండర్ స్థాయిలో ఉన్నవి. 2013-14 ఆర్థిక సంవత్సరంలో 3,500 కిలోమీటర్ల లక్ష్యానికి గాను 3,615 కిలోమీటర్ల రహదారులను మెరుగుపరచటం జరిగింది. మన రాష్ట్రంలో కొత్త రోడ్లను ఏర్పరచడం, బ్రిడ్జీలను నిర్మించడం, రహదార్లను విశాలపరచాలనే ఉద్దేశంతో రాష్ట్ర సాధారణ ప్లాన్ బడ్జెట్ నిధుల ద్వారా చేపట్టడం జరిగింది. ప్రస్తుతం రూ.1920 కోట్ల అంచనాతో 264 పనులు వివిధ దశలలో నిర్మాణములో ఉన్నవి.

2014 మార్చి నాటికి 655 కిలో మీటర్ల రహదారులను మెరుగుపరచడం లేదా విస్తృత పరచడం మరియు 10 బ్రిడ్జీలను నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించగా 923 కిలో మీటర్ల రహదార్లను మెరుగుపరచడం జరుగుతుంది. అదియుగాక ఒక 3బ్రిడ్జీలను రీఆర్గనైజ్ చేయాలనుకొంటున్నాము. ఎస్సీ సబ్‌ప్లాన్ క్రింద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2013–14 సంవత్సరంలో మంజూరు చేసిన పనుల్లో రూ.6 కోట్ల రూ.65 లక్షల అంచనాతో 6 రహదార్ల పనులు వివిధ దశల్లో నిర్మాణాలు జరుగుతున్నాయి. ఎస్టీ సబ్‌ప్లాన్ క్రింద రూ.55 కోట్లతో కొన్ని పనులు జరుగుతున్నాయి. రాష్ట్రంలో గల రద్దీ కలిగిన రైల్వే లెవల్ క్రాసింగుల వద్ద ఆర్‌ఓబీలు మరియు ఆర్‌యుబీలు అనగా రోడ్ ఓవర్ బ్రిడ్జీలు లేదా రోడ్ అండర్ బ్రిడ్జీలను నిర్మించడం జరుగుతుంది. రైల్వే మంత్రిత్వ శాఖ మరియు రైల్వే బోర్డు వారి నిబంధనల మేరకు ఒక లక్ష Train Vehicular Unitsను మించి యున్న రైల్వే లెవల్ క్రాసింగ్‌ల వద్ద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఆర్‌ఓబీలు మరియు ఆర్‌యుబీలను నిర్మించుటకు అగు ఖర్చును 50:50 నిష్పత్తిలో నిధులను చేకూర్చడం జరుగుతుంది. అది గాక మన ప్రజాప్రతినిధుల కోరిక మేరకు ఒక లక్ష Train Vehicular Units లేనప్పటికీ స్థానిక అవసరాలను పరిగణనలోకి తీసుకొని, రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద రాష్ట్ర ప్రభుత్వమే 100 శాతం ఖర్చును భరించుటకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ప్రస్తుతం రైల్వే బోర్డు వారు 50:50 శాతం పద్ధతిలో గానీ, 100 శాతం పద్ధతిలో గానీ మొత్తం 64 ఆర్‌ఓబీలు మరియు ఆర్‌యుబీలు నిర్మించుటకు అనుమతులను మంజూరు చేసిన పనులు వివిధ దశల్లో నిర్మాణాలు జరుగుచున్నవి.

ముఖ్యంగా పంచాయితీరాజ్ శాఖ నుండి బదిలీకాబడిన గ్రామీణ రహదార్లను ఆర్ఐడిఎఫ్ క్రింద 12వ మరియు 13వ ఫైనాన్స్ కమీషన్ల ద్వారా లభ్యమగు నిధులతో మెరుగుపరచడం జరుగుతుంది. రాష్ట్రంలోని నేషనల్ హైవేస్ క్రింద ఉన్న రహదార్లను భారత ప్రభుత్వ నిధుల ద్వారా మెరుగుపరచడం జరుగుతుంది. రోడ్లు భవనాల శాఖ ద్వారా రహదారుల అభివృద్ధియే కాకుండా భవన నిర్మాణ పనులు మరియు వాటి నిర్వహణ కూడా చేపట్టడం జరుగుతుంది. రాష్ట్ర ప్రణాళికా నిధుల ద్వారా సచివాలయ భవనములు, కోర్టు భవనములు మరియు న్యాయధిపతుల నివాస గృహముల నిర్మాణం మరియు డిపాజిట్ పనుల క్రింద ఇతర ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణములు చేపట్టబడును. రాష్ట్రంలోని ప్రభుత్వ భవన సముదాయముల నిర్వహణకు అగు ఖర్చులను రాష్ట్ర నాన్‌ప్లాన్ బడ్జెట్ క్రింద ఖర్చు చేయటం జరుగుతుంది.

ప్రస్తుతం రహదార్లు మరియు భవనముల శాఖ అధ్వర్యములో ప్రభుత్వ భవనములు ఈ క్రింది విధంగా ఉన్నవి. 1) నాన్ రెసిడెన్షియల్ – 30.12 లక్షల చదరపు అడుగులు 2) రెసిడెన్షియల్ బిల్డింగులు – 30.81 లక్షల చదరపు అడుగులు అందుబాటులో ఉన్నవి. అందుబాటులో ఉన్న అన్ని మార్గములు అనగా ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్తీకరణ చట్టం ద్వారా సంక్రమించిన వెసులుబాటుతో కేంద్ర ప్రభుత్వం నుండి అధిక నిధులను రాబట్టటం ద్వారా

మరియు ఆర్థిక సంస్థలైన వరల్డ్ బ్యాంకు, ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు మరియు జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేటివ్ ఏజన్సీల వంటి సంస్థల ద్వారా ఆర్థిక సహాయము మరియు ఋణములను పొంది తద్వారా రాష్ట్రంలోని అన్ని రహదార్లను అభివృద్ధి పరచి, రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని తెలియచెప్పుటకు ఆనందిస్తున్నాను.

రహదారులు మరియు భవనముల శాఖ ద్వారా నిర్వహించు అనేక కార్యక్రమములకు 2014-15 సంవత్సర బడ్జెట్ నందు ఈ క్రింది విధముగా నిధులను కేటాయింపు జరిగినది. ప్లాన్ గ్రాంటు క్రింద రూ.1,359.07 కోట్లు, నాన్ ప్లాన్ గ్రాంట్ క్రింద రూ.1,251.71 కోట్లు మొత్తం రూ.2,610.78 కోట్లు. ముఖ్యంగా గత 10 సంవత్సరాల నుండి ఈ రాష్ట్రంలో రోడ్ల మీద సరైన నిర్ణయాలను తీసుకోకపోవడం వల్ల ఈరోజున రాష్ట్రంలో ఉన్న రోడ్లన్నీ బాగా అధ్వాన్నంగా తయారయ్యాయి. మేము అధికారంలోకి వచ్చి 80 రోజులు కూడా కాలేదు అయినప్పటికీ దీని మీద గౌరవ ముఖ్యమంత్రి గారు శ్రద్ధ తీసుకొని ఒక రెవ్యూ మీటింగును కూడా ఏర్పాటు చేసి, రోడ్లను బాగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో, రాష్ట్రమంతటా ఉన్న రోడ్లలో ఎక్కడైతే మరమ్మత్తులు జరగలేదో అటువంటి వాటిని గుర్తించి ముందు వాటికి మరమ్మత్తులు చేయాలనే ఉద్దేశంతో వారి ఆదేశించడంతో, వెంటనే ఉన్నతాధికారులను జిల్లాలకు పంపించడం జరిగింది. వారి నుండి రిపోర్టులు వచ్చిన వెంటనే రాష్ట్రంలో 13 జిల్లాల్లో ఉన్న రోడ్లన్నిటినీ ఒక మూడు నెలల్లో మరమ్మత్తులు చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

ఈ మధ్య కాలంలో నేషనల్ హైవేస్‌కి సంబంధించి ఒక 512 కిలో మీటర్లుకు పర్మిషన్ రావడం జరిగింది. గౌరవ ముఖ్యమంత్రి గారు మొన్న ఢిల్లీలో కూడా ట్రాన్స్‌పోర్ట్ మినిష్టర్ గారిని కలిసి ఒక 2500 కిలో మీటర్ల స్టేట్ హైవేని ఎన్‌హెచ్‌గా ఇవ్వమని కోరడం జరిగింది. దానికి సంబంధించిన ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. అట్లాగే గౌరవ సభ్యులు శ్రీ కాగిత వెంకట్రావు గారు మాట్లాడుతూ, సీ పోర్టులకు రోడ్లు కావాలని అడగటం జరిగింది. ముఖ్యమంత్రి గారు సీ పోర్టులను తీసుకురావాలని, ఆ పోర్టులకు అనుసంధానంగా ఎన్‌హెచ్ కనెక్టివిటీ రోడ్లను తీసురావాలని ఆలోచనలో ఉన్నారు. తప్పకుండా అటువంటి వాటిని తీసుకొచ్చి ఆ సీ పోర్టుల డెవలప్‌మెంటుతోబాటు, ఎప్పుడైతే రోడ్లు వస్తాయో ఆటోమేటిక్‌గా ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. దానితోబాటు మంచి ఎంప్లాయిమెంటు, మంచి కార్గో మూవ్‌మెంట్ కూడా జరిగే అవకాశం ఉంటుంది. కాబట్టి తప్పకుండా సీ పోర్టులకు అవసరమైన రోడ్లకు ప్రాధాన్యతనిచ్చి వాటి మీద వెంటనే చర్యలను తీసుకుంటాను.

...

తరువాత ఎయిర్‌పోర్ట్స్ నిర్మాణానికి కూడా రోడ్స్ ఇవ్వాలని కొంత మంది సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. అవసరమైనచోట్ల ఎయిర్‌పోర్ట్స్ నిర్మాణం నిమిత్తమై అవసరమైన రోడ్స్‌ను ప్రభుత్వం సేకరించి ఇచ్చే ఆలోచనలో ఉంది.

అధ్యక్షా, రోడ్ ప్రమాదాలను అరికట్టే విషయంలో ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ అధికారులతో ఒక సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ప్రతి రెండు మాసాలకొకసారి నాలుగు రోజులపాటు "safety celebrations"ను నిర్వహించేందుకు వీలుగా ప్రణాళికను సిద్ధంచేసి ప్రజలకు రోడ్డు ప్రమాదాల నివారణ నిమిత్తమై అవేర్‌నెస్ పెంచేందుకు చర్యలు చేపట్టమని ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ అధికారులను ఇప్పటికే కోరడం జరిగింది. తద్వారా పబ్లిక్‌లో అవేర్‌నెస్ పెరిగి రోడ్ ప్రమాదాల నివారణను అరికట్టవచ్చనే ఉద్దేశం ప్రభుత్వానికుంది. డ్రంకన్ డ్రైవింగ్ విషయంలో, స్పీడ్ డ్రైవింగ్ విషయంలో కూడా అధికారులకు ప్రత్యేకమైన సూచనలివ్వడం జరిగింది. అందుకుగాను ప్రతి ఏరియాలో ఇద్దరు మోటారు వెహికిల్ ఇన్స్‌పెక్టర్స్‌ను ఏర్పాటుచేసి డ్రంకన్ డ్రైవింగ్‌కు గానీ, స్పీడ్ డ్రైవింగ్‌కు గానీ పాల్పడేవారిని అదుపుచేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించడం జరిగింది.

అధ్యక్షా, సభ్యులందరూ రోడ్ల గురించే మాట్లాడారు. భవిష్యత్తులో రోడ్ల విస్తరణ పనులు చేపట్టడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రత్యేక దృష్టిని రోడ్లకు సంబంధించిన అంశంపైన సారించారు. రాష్ట్రాభివృద్ధిలో రోడ్లే ప్రధానపాత్ర పోషించే అవకాశం ఉంది కాబట్టి తప్పకుండా ప్రత్యేక కార్యాచరణ ద్వారా రోడ్లను విస్తరించడం జరుగుతుందనే విషయాన్ని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. రహదారులు మరియు భవనాల శాఖ ద్వారా మెరుగైన సేవలు రాష్ట్రానికి, ప్రజలకు అందిస్తుందనే విషయాన్ని కూడా తమరి ద్వారా సభకు తెలియజేస్తున్నాను. ఏది ఏమైనప్పటికి గౌరవ సభ్యులు చేసిన సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ముందుకుపోతుంది. రహదారులు మరియు భవనాల శాఖ, రవాణా శాఖకు సంబంధించిన డిమాండ్‌పైన ప్రభుత్వం తరపున ప్రసంగించే అవకాశం కల్పించిన గౌరవ స్పీకర్ గారికి ధన్యవాదాలు తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

MR SPEAKER: Minister for Energy.........

శ్రీ పల్లె రఘునాథరెడ్డి (పుట్టపర్తి): అధ్యక్షా, మొట్టమొదట గౌరవ సభ్యులు ప్రస్తావించిన అంశాలకు సంబంధించిన క్లారిఫికేషన్ ఇచ్చిన తరువాత సబ్జెక్ట్ గురించి నేను మాట్లాడతాను. గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్న కాలంలో రాష్ట్రంలో ఏ ఒక ఎ.పి.జెన్‌కో ప్రాజెక్టు కూడా స్థాపింపబడలేదని, అన్ని ప్రైవేట్ విద్యుత్ ప్రాజెక్టులకే ప్రాధాన్యత నిచ్చారని కొంత మంది గౌరవ సభ్యులు చెప్పడం జరిగింది. కానీ వారి ప్రస్తావనలో వాస్తవం లేదు.

అధ్యక్షా, 1994-2004వ సంవత్సర మధ్యకాలంలో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఖమ్మం జిల్లా కొత్తగూడెం నందు Fifth Stage Project 2X250 మెగావాట్ల చొప్పున 5,000 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం జరిగింది. వి.టి.పి.ఎస్. స్టేజ్ -III క్రింద 1x210 చొప్పున 210 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన జరిగింది. ఆర్.టి.పి.పి. స్టేజ్ -II క్రింద 1x210 చొప్పున 210 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన జరిగింది. అదే విధంగా శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ హైడల్ ప్లాంట్ ద్వారా 150X6 మెగావాట్ల చొప్పున 900 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన జరిగింది. ఇతర సంస్థలు కాకుండా, సెంట్రల్ జనరేటింగ్ సిస్టమ్ గాకుండా కేవలం ఎ.పి.జెన్‌కో తరఫునే 1,820 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన జరిగింది. భవిష్యత్తులో ప్రభుత్వం కార్యాచరణ గురించి కూడా కొంత మంది సభ్యులు అడగడం జరిగింది. కృష్ణపట్నం విద్యుత్ ప్లాంట్ క్రింద 2x800 చొప్పున 1,600 మెగావాట్ల విద్యుత్, విజయవాడ స్టేజ్ -V క్రింద 800 మెగావాట్ల విద్యుత్, కృష్ణపట్నం స్టేజ్ -II క్రింద 800 మెగావాట్ల విద్యుత్, ఆర్.టి.పి.పి. స్టేజ్-IV క్రింద 600 మెగావాట్ల విద్యుత్, నాగార్జునసాగర్ టేల్‌పాండ్ క్రింద 50 మెగావాట్ల చొప్పున మొత్తం 3,850 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదనకుగాను ప్రభుత్వపరంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. అదే విధంగాశ్రీకాకుళం జిల్లాలో 3,200 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన సామర్థ్యం కల్గిన ప్లాంట్‌ను స్థాపించాలనే దిశగా ప్రభుత్వం యోచిస్తోంది. అదే విధంగా కోల్, గ్యాస్ లింకేజీకి గాను అన్ని విధాలుగా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అందులో భాగంగా రాష్ట్రంలో మూడు కోల్ బ్లాక్స్‌ను ప్రభుత్వం అభివృద్ధి పరుస్తోంది.

అధ్యక్షా, విద్యుత్‌పరంగా రాష్ట్రానికి అనేక ఆర్థిక ఇబ్బందులొచ్చాయని, తద్వారా విద్యుత్‌రంగానికి నష్టాలొచ్చాయనే విధంగా కొంత మంది గౌరవ సభ్యులు సభలో చెప్పడం జరిగింది. కానీ 2004వ సంవత్సరం నాటికి రాష్ట్రంలో విద్యుత్ సరఫరాలో ఎటువంటి లోటు లేదు. పైపెచ్చు ఇతర రాష్ట్రాల నుంచి విద్యుత్ కొనుగోలుకు సంబంధించి ఒక రూపాయి కూడా ప్రభుత్వం ఖర్చు చేయలేదు. కానీ గత పది సంవత్సరాల కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో మార్చి, 2014 నాటికి మొత్తం రూ.17,200.00 కోట్ల నష్టాన్ని రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు చవిచూశాయి. తద్వారా బయటపడడానికి గాను కేంద్ర ప్రభుత్వం నుండి ఆర్థిక సర్దుబాటు చేసుకోవాల్సి వచ్చింది. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఆ కాలంలో రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలకు ఎటువంటి నష్టాలు రాలేదు. కేవలం కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వ పది సంవత్సరాల కాలంలో రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు రూ.17,200.00 కోట్ల నష్టాన్ని చవిచూశాయి.

అధ్యక్షా, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో విద్యుత్ రంగానికి బడ్జెట్‌లో ఎక్కువ కేటాయింపులు చేసిందనే విషయాన్ని కొంత మంది సభ్యులు ప్రస్తావించారు. కానీ, అది వాస్తవం కాదు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం పది సంవత్సరాల కాలంలో రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో 7.80% విద్యుత్ రంగానికి కేటాయింపులు జరపగా, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పది సంవత్సరాలలో

బడ్జెట్‌లో 5% మాత్రమే విద్యుత్ రంగానికి కేటాయించారంటే, రైతుల మీద ఎవరికి ఎంత మాత్రం ప్రేమ ఉందో కేటాయింపులను బట్టి అర్థమవుతుంది.

అధ్యక్షా, విద్యుత్ పంపిణీ విషయంలో జరిగిన కాల్పుల గురించి కొందరు సభ్యులు ప్రస్తావించారు. ఆనాడు విద్యుత్ పంపిణీ, సరఫరా అస్థవ్యస్తంగా ఉండడం వల్ల, కరెంటు పోల్స్ పడిపోవడం వల్ల, కరెంటు తీగలు వేలాడడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 9,145 విద్యుత్ ప్రమాదాలు జరిగాయి. ఆ ప్రమాదాల్లో 7,388 మంది ఏ రాష్ట్రంలో లేనంతగా మన రాష్ట్రంలో విద్యుత్‌ప్రమాదాల వల్ల మరణించారు. 1,172 మంది విద్యుత్ ప్రమాదాల కారణంగా గాయాలకు గురైనారు. ఇంతపెద్దయెత్తున అన్యాయం, అధర్మం మరెక్కడా ఉండదు. ఆనాడు విద్యుత్ పంపిణి వ్యవస్థను కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యం చేసిందో, ఎంత అస్తవ్యస్తానికి గురిచేశారనడానికి ఇంత కంటే ప్రత్యక్ష నిదర్శనం ఉండదు. అదే విధంగా ప్రైవేట్ విద్యుత్ పంపిణి సంస్థల నుంచి విద్యుత్ కొనుగోలును 1999-2004 సంవత్సర మధ్యకాలంలో 12% జరగ్గా, 2004-2014 సంవత్సర మధ్యకాలంలో ప్రైవేట్ ప్రాజెక్టుల నుంచి విద్యుత్ కొనుగోళ్లు 21% ఎక్కువగా, అంటే 9% విద్యుత్ కొనుగోళ్లను ప్రైవేట్ ప్రాజెక్టుల ద్వారా ప్రభుత్వం చేపట్టింది. అంటే ప్రైవేట్ విద్యుత్ కొనుగోలుకే ఆనాటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యతనిచ్చిందనడానికి ఇంతకంటే ఆధారం లేదు. అదే విధంగా విద్యుత్ సరఫరా, పంపిణీల్లో నష్టాలు 2004వ సంవత్సరం వరకు 14% తగ్గితే, 2004-2014 మధ్య కాలంలో ఇప్పటి వరకు 8% వరకు తగ్గాయి. ఇప్పుడు ప్రస్తావించిన విషయాలన్ని క్లారిఫికేషన్స్‌గా భావించండి.

అధ్యక్షా, డిమాండ్ XXXV (35) క్రింద ఇంధనశాఖ రూ.7,163,77,78,000 కోట్లు ప్రతిపాదిస్తున్నాం. ఇంధనశాఖ క్రింద విద్యుత్ స్టేషన్ల నిర్మాణం, విద్యుత్ ఉత్పత్తి నిర్వాహణ, విద్యుత్ సరఫరా, పంపిణీ, అవసరాలకు సంబంధించిన ఖర్చులకు, సాంప్రదాయేతర ఇంధన వనరుల అభివృద్ధికి గాను ఈ కేటాయింపులు జరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం "Power for all", "అందరికి విద్యుత్" అనే కార్యక్రమం క్రింద మన రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎంపిక చేయబడింది. దీని వెనుక గౌరవ ముఖ్యమంత్రి గారైన శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి యొక్క శక్తి,సామర్థ్యాలు, వారి ప్రోత్సాహం ఉందనడంలో ఏ మాత్రం సందేహం లేదు. గృహ, వ్యాపార, వాణిజ్య వినియోగదారులకు 24x7 విద్యుత్ సరఫరా చొప్పున, వ్యవసాయదారులకు రోజుకు ఏడు గంటల చొప్పున దశల వారీగా విద్యుత్ సరఫరాను తొమ్మిది గంటల చొప్పున నాణ్యమైన విద్యుత్‌ను అందించాలనేదే ఈ ప్రభుత్వం యొక్క ఆశయం. రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సదుపాయంలేని 2,551 గ్రామాలకు రెండు సంవత్సరాల కాలంలోపు విద్యుత్ సదుపాయాన్ని కల్పించాలని, 6,34,954 గృహాలకు మూడు సంవత్సరాల కాలంలోపు ఎలక్ట్రిఫికేషన్ చేయాలనే ఉద్దేశంతో ఈ ప్రభుత్వం కార్యక్రమాలను ప్రారంభిస్తుంది. పవర్ విషయంలో ఈ రాష్ట్రాన్ని ఒక సంవత్సర కాలంలోపు మోడల్ స్టేట్‌గా తీర్చిదిద్దాలని, అదేవిధంగా ఈ ఐదు సంవత్సరాల

కాలంలో గ్లోబల్ స్టాండర్డ్‌లోకి విద్యుత్ రంగాన్ని తీసుకురావాలనేదే ఈ ప్రభుత్వ లక్ష్యమనే విషయాన్ని సభాముఖంగా తెలియజేస్తున్నాను. ప్రతి సంవత్సరం వ్యవసాయదారులకు యాభై వేల అగ్రికల్చర్ పంపుసెట్లకు విద్యుత్ కనెక్షన్సను మంజూరుచేయాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకుంది. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు తెలుగుదేశం పార్టీ చెప్పిన విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. అదే విధంగా ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 36 వేల అగ్రికల్చర్ విద్యుత్ కనెక్షన్స్ నాన్ ఐ.యస్.ఐ. మార్క్ పంపుసెట్ల క్రింద ఉన్నాయి, విద్యుత్ వినియోగం ఎక్కువ వస్తుంది కాబట్టి వాటిని రిప్లేస్ చేసి, ప్రతి సంవత్సరం పది వేల చొప్పున ఐ.యస్.ఐ. సోలార్ పంపుసెట్లను రైతులకు ఇస్తూ, రాబోయే నాలుగు సంవత్సరాల కాలంలో ఈ టార్గెట్‌ను అధిగమించాలనే ఆలోచనతో ఈ ప్రభుత్వం కార్యాచరణను రూపొందించింది. అదే విధంగా ఐదు లక్షల స్ట్రీట్ లైట్లను రిప్లేస్ చేయాలని, ఒక కోటి ఇరవై లక్షల హౌస్‌హోల్డ్స్‌కు ఎల్.ఇ.డి. బల్బ్‌లను ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కార్యాచరణను రూపొందించింది. అదే విధంగా 9,264 ఫీడర్లు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నాయి. ఈ ఫీడర్స్‌కు మోడ్రన్ సిమ్ కార్డ్స్‌ను ఏర్పాటుచేయడం జరగడంతోపాటు అన్నింటిని ఆన్‌లైన్లో పెట్టడం కూడా జరిగింది. ఇంతవరకు ఆరు వేల ఫీడర్లను ఆన్‌లైన్లో పెట్టడం జరిగింది. తద్వారా ఒకో ఫీడర్‌కు సింగల్ ఫేజ్ కరెంటు ఎంతపోతోంది? త్రీ ఫేజ్ కరెంటు ఎంత పోతోంది? ఎంత వినియోగం జరుగుతోంది? ఎంత రాలేదు? ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా తెలుసుకోవడానికి వీలు కల్గుతుంది. ఇటువంటి ప్రయోగం భారతదేశం మొత్తంలోని ఏ రాష్ట్రంలో కూడా జరగలేదు. ఈ రాష్ట్రంలో మాత్రమే జరుగుతోంది. ఎమ్మెల్యేలకు కూడా వారి వారి ఫీడర్‌లో ఎంత విద్యుత్ సరఫరా అవుతుందో ఐ.ప్యాడ్‌లో చూసుకునే అవకాశాన్ని ఈ ప్రభుత్వం కల్పిస్తోంది. అదే విధంగా 2014 జూలై 31వ తేది నాటికి ఈ రాష్ట్రం యొక్క విద్యుత్ పంపిణి సంస్థల యొక్క పరిస్థితిని నేను సభాముఖంగా వివరించదలిచాను. ఎ.పి.జెన్‌కొ ద్వారా థర్మల్ గానీ, హైడల్ గానీ, విండ్ గానీ 4,423 మెగావాట్ల విద్యుత్ అందుబాటులో ఉండేది. సెంట్రల్ పవర్ జనరేషన్ సిస్టమ్ నుంచి 1,615 మెగావాట్ల విద్యుత్, ఇండిపెండెంట్ పవర్ జనరేషన్ సిస్టమ్ ప్రాజెక్టుల నుంచి 2,495 మెగావాట్ల విద్యుత్, అదే విధంగా జాయింట్ వెంచర్‌లో 272 మెగావాట్ల విద్యుత్, ఇతర సంస్థలైన ఎస్.సి.ఎం.పి.పి.యస్. ద్వారా 1,500 మెగావాట్ల విద్యుత్ చొప్పున ఉత్పాదన జరుగుతోంది. అంటే ఈ రాష్ట్రంలో విద్యుత్ ఉత్పాదన సామర్థ్యం ఇప్పటికి 10,368.32 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన సామర్థ్యం ఉంది. అదే విధంగా తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అంటే 08.06.2014 వ తేదీ నాటికి 22,000 మిలియన్ యూనిట్ల విద్యుత్ లోటు ఉండేది. విద్యుత్ పంపిణి అస్థవ్యస్తంగా ఉండడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి ఉండేది.

...

ఈ రాష్ట్రంలో ఇప్పటికీ 10368.32 మెగా వాట్స్ విద్యుత్ స్థాపన సామర్థ్యం ఉంది. అదేవిధంగా ఈ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాక మునుపు జూన్ 28, 2014సంవత్సరంలో పరిస్థితి 22 మిలియన్ యూనిట్ విద్యుత్ లోటు ఉంది. కరెంట్ అస్తవ్యస్తంగా ఉండి ప్రజలు ఇబ్బందిపడుతున్న పరిస్థితి ఉంది. 28జూన్ 2014 తరువాత 3

నెలలు కాక మునుపే విద్యుత్ కొరత లేని రాష్ట్రంగా విద్యుత్ డెఫిసిట్‌ను జీరోకు తీసుకు వచ్చిన ఘనత ఒక తెలుగుదేశం పార్టీకీ, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుకే దక్కుతుంది. కారణమేమంటే ఎన్‌టిపిసీ. గ్రిడ్ నుండి 200 మెగావాట్స్, కృష్ణపట్నం పవర్ ప్రాజెక్టునుండి 800 మెగావాట్స్ ఇంటర్ మరియు ఇంట్రాస్టేట్ జనరేటర్స్ నుండి 410 మెగా వాట్స్ పవర్ ఎక్చేంజ్ నుండి అవసరమైనప్పుడు 200 మెగా వాట్స్ వరకు ప్రొక్యూర్ చేయడం వలన ఈ రోజు పవర్‌తో ఎక్కడా ఇబ్బందులు లేకుండా రైతులు ఆనందంగా ఉండేటట్లు 24x7 పవర్ సరఫరా చేస్తున్నాం.

ఈ లాంచింగ్ వలన అక్టోబర్ 2వ తేదీ నుండి దాదాపు ప్రతి ఒక్క ఇంటికీ, పరిశ్రమల, వాణిజ్య సంస్థల విద్యుత్ వినియోగదార్లకు తప్పకుండా 24 గంటలు విద్యుత్ సరఫరా చేసే అవకాశం ఉంది. 9 గంటలు విద్యుత్ సరఫరా చేసేందుకు ఎన్నికల ప్రణాళికలో మేము చెప్పిన విధంగా మాటను నిలబెట్టుకునేందుకు ప్రయత్నం చేస్తాం. అదే విధంగా 2014-15 సంవత్సరంలో ఒక టార్గెట్ పెట్టుకున్నాము. కృష్ణపట్నం యూనిట్ 1 నుండి 800 మెగా వాట్స్, యూనిట్ 2 నుండి 800 మెగావాట్స్ నాగార్జునా సాగర్ టేల్‌ఫాండ్ నుండి 50 మెగా వాట్స్, సెంట్రల్ జనరేటింగ్ సిస్టం ట్యుటికోరన్ నుండి 265 మెగా వాట్స్ , హింధూజా 1 నుండి 520 మెగా వాట్స్, హింధూజా 2 నుండి 520 మెగా వాట్స్ అంటే 2014-15వ సంవత్సరంలో 2945 మెగావాట్స్ విద్యుత్‌ను ఉత్పాదించాలి. ఈ రాష్ట్రంలో ఉండే విద్యుత్ వ్యవసాయ వినియోగానికి కానీ, పరిశ్రమల వినియోగానికి గానీ, ఉపయోగపడాలనే ఆలోచనతో ప్రభుత్వం ఒక బృహత్తరమైన ప్రాజెక్టును తయారు చేస్తుంది.

2004-15 సంవత్సరపు టార్గెట్ వచ్చేసరికి ట్రాన్స్‌కోలో దాదాపు 220 కేవీ. సబ్ స్టేషన్-1 132 కేవి. సబ్‌స్టేషన్స్-14, డిస్కాం సబ్ స్టేషన్స్ 2069, ట్రాన్స్ ఫార్మర్స్ 37800 ఇవ్వాలని ప్రభుత్వం ముందుకు పోతుంది. 2014-15 సంవత్సరంలో ట్రాన్స్‌మిషన్ లాస్ అండ్ డిస్ట్రిబ్యూషన్ లాస్ 14.53 శాతం నుండి 13.13 శాతానికి తీసుకురావాలనే ఉద్దేశ్యంతో ఈ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుంది. అదే విధంగా సోలార్ ల్యాంప్స్ ఇంతవరకు 1500 సోలార్ ల్యాంప్స్ ఇచ్చాము. త్వరలో 4500 సోలార్ ల్యాంప్స్ ఇవ్వబోతున్నాం. ఎస్టీ ఉపప్రణాళిక కింద 5000 వరకు పంపిణీ చేయాలనుకుంటున్నాం. దీనికోసం 115.56 లక్షలు కేటాయించడం జరుగుతుంది. అంటే ఈ రాష్ట్రంలో ఇకముందు కూడా విద్యుదుత్పాదన చేసి ఎటువంటి పరిస్థితుల్లోనూ 24X7 విద్యుత్‌ను పరిశ్రమలకు, వాణిజ్య సముదాయాలు, గృహాలకు ఇవ్వాలని, రైతులకు 7గంటల పాటు ఇవ్వాలి, 9 గంటల పాటుకు పెంచి విద్యుత్‌ను ఇవ్వాలని సదుద్దేశ్యంతో ఈ ప్రభుత్వం హైడల్, గ్యాస్, కోల్, సోలార్‌లను ఉపయోగించుకుంటూ ముందుకు పోతుంది.

శ్రీ కె.సర్వేశ్వరరావు (అరకు వ్యాలీ): అధ్యక్షా, పాలకవర్గ సభ్యులు, గౌరవ మంత్రిగారు, ఎలక్ట్రిసిటీ మంత్రిగారు, రోడ్లు భవనాల శాఖా మంత్రిగారు మాట్లాడుతూ, మన రాష్ట్రం విడిపోయిన తరువాత సుమారు 20 నుండి 30 శాతం గిరిజన ప్రాంతంతో నిండి ఉంది. ఈ రోజు గిరిజన ప్రాంతంలో రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. గిరిజన ప్రజలు రోడ్లు లేక చాలా ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. అక్కడ ప్రజలు మైదాన ప్రాంతానికి రావాలంటే చాల ఇబ్బంది పడుతున్నారు. వారు తిరగడానికి రోడ్లు లేవు. ఒక్క విశాఖపట్నం జిల్లాలోనే 244 పంచాయితీలు ఉండగా, 60, 70 పంచాయితీలను కలుపుతూ రోడ్లున్నాయి. ఆ పంచాయితీలకు బస్సులు వెళ్లలేని పరిస్థితుల్లో రోడ్లున్నాయి. రాజశేఖరరెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కొన్ని పంచాయితీలకు రోడ్లు వేసినప్పటికీ కూడా ఈరోజు రోడ్లు అధ్వాన్న పరిస్థితుల్లో ఉన్నాయి. సుమారు 1600 నుండి 1800 గ్రామాలకు రోడ్లు లేని పరిస్థితుల్లో గిరిజన ప్రజలందరూ మ్రగ్గిపోతున్నారు.

MR.SPEAKER: Only clarifications, no speechs please. Please ask your Clarifications. మీ ప్రశ్న అడగండి.

(ఈ సందర్భంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీకి చెందిన సభ్యులు సర్వశ్రీ జంకె వెంకటరెడ్డి, చెవిరెడ్డి భాస్కర రెడ్డి తమ స్థానంలో కూర్చోని మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ, తమ చేతులు పైకెత్తి కోరారు)

శ్రీ కె.సర్వేశ్వరరావు : గిరిజన గ్రామాలుకు రోడ్లు వేయడం కోసం ఎటువంటి విషయం చెప్పలేదు. గిరిజన ప్రాంతాలకు సంబంధించి రూ.55000 కోట్లు మాత్రమే రోడ్లు కోసం అని చెప్పడం జరిగింది. స్వాతంత్ర్యం వచ్చి 65 సంవత్సరాలు పూర్తి చేసుకుంటునాం. వేలాది గిరిజన గ్రామాలకు రోడ్లు లేని పరిస్థితి ఉంది. చాలా గ్రామాలకు విద్యుత్ లేని పరిస్థితి ఉంది. ఆనాటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి గారు సర్వీసు వైరు ద్వారా వందలాది గ్రామాలకు విద్యుత్ సరఫరా చేసిన పరిస్థితి ఉంది. గిరిజన ప్రజలకు రూ.125లకే విద్యుత్ మీటరు ఇచ్చిన పరిస్థితి ఉంది. ఈరోజు ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత రూ.425 లకు పెంచి విద్యుత్ మీటరు ఇస్తున్న పరిస్థితి ఉంది.

MR.SPEAKER: Please conclude.

శ్రీ కె.సర్వేశ్వరరావు : అటు శ్రీకాకుళం నుండి ఇటు పశ్చిమ గోదావరి జిల్లావరకున్న గ్రామాలన్నింటికీ ఎప్పటిలోగా రోడ్లు వేసే పరిస్థితి ఉంది. ఆ గ్రామాలన్నింటికీ ఎప్పటిలోగా విద్యుత్ ఇచ్చే పరిస్థితి ఉన్నాయి. మహారాష్ట్ర నుండి చత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్,

ఆంధ్రప్రదేశ్‌ను కలుపుతూ, రోడ్ వేసే  ఆలోచన ఏమైనా ఈ ప్రభుత్వానికి ఉందా దానివల్ల గిరిజన ప్రాంతాలన్నింటికీ రోడ్ ఉపయోగపడుతుంది కాబట్టి ఉపయోగపడే రోడ్లు వేసే ఆలోచన ఏమైనా ఈ ప్రభుత్వానికి ఉందా అని అడుగుతున్నాను.

మిస్టర్ స్పీకర్ ః వర్మా..

శ్రీ ఎస్‌విఎస్ఎన్. వర్మ (పిఠాపురం)ః  అధ్యక్షా సోదర సభ్యులు చెబుతున్నారు. పిఠాపురం గిరిజన ప్రాంతం గురించి చెబుతున్నారు. మా పిఠాపురం నియోజక వర్గంలో చంద్రబాబునాయుడు గారు పనిచేసిన కాలంలో వేసిన రోడ్స్, అప్పుడున్న అభివృద్ధి ఉంది. 2014 వరకు ఒక సారి సరిచూసుకోవల్సిన బాధ్యత అందరికీ ఉంటుంది. 20014 వరకు బ్రహ్మాండమైన అభివృద్ధి జరిగింది అనుకుంటున్నారు. ఎక్కడా డెవలప్‌మెంట్ లేదు. ప్రభుత్వం ఏర్పడి 60 రోజులు అయింది. మా నియోజకవర్గం గురించి చెప్పారు కాబట్టి మా నియోజక వర్గంలో చంద్రబాబు నాయుడు గారు పరిపాలనలో జరిగిన అభివృద్ధే ఉంది. ఈ రోజున ప్రభుత్వం ఏర్పడి 60 రోజుల్లో కూడా నీటిపారుదల రంగంలో కానీ పరిశ్రమల్లో కానీ 60 రోజుల్లోనే అభివృద్ధి చూపించారు. ఈ 60 రోజుల్లోనే రోడ్లన్నీ నిర్వీర్యం అయిపోయాయి. ఈ రాష్ట్రం అంతా నిర్వీర్యం అయిపోయాయని చెప్పడం తప్పుగా భావిస్తున్నాను. నా వరకు నా నియోజకవర్గానికి బ్రహ్మాండమైన అభివృద్ధి జరిగింది. అందులో చంద్రబాబు నాయుడు గారు అధికారంలో ఉన్నంత వరకే అభివృద్ధి జరిగింది. 2004 నుండి 2014 వరకు ఏ విధమైన అభివృద్ధి జరుగలేదు.

(ప్రధాన ప్రతిపక్ష సభ్యులచే అంతరాయం )

మిస్టర్ స్పీకర్ ః గొల్లపల్లి సూర్యారావు గారు..

శ్రీ జి.సూర్యారావు (రాజోల్)ః స్పీకర్ సార్, చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వమో, మాకు ప్రత్యామ్నాయంగా ఉన్న పార్టీ సభ్యులో కాదు వీరెంత సేపుకి మా చిన్నతనంలో డాక్టరు గారి దగ్గరకు కడుపునొప్పి అని వెళితే ఎరుపు రంగు నీళ్లిచ్చేవారు. మరలా తరువాత ఒక పేషెంట్ చెవిపోటుతో వచ్చే వారు అందరికీ సర్వరోగ నివారిణీ లాగా అదే నీళ్లిచ్చే వారు. అలాగే ప్రతిదానికి రాజశేఖర రెడ్డి  గారిని చెబుతున్నారు.

(ప్రధాన ప్రతిపక్ష సభ్యులచే అంతరాయం )

పదే పదే రాజశేఖర్ రెడ్డి గారు అంటుంటే నాకు అభ్యంతరం లేదు. కానీ రాజశేఖర రెడ్డి గారి ప్రభుత్వం తరువాత రోశయ్య గారు, కిరణ్ కుమార్ రెడ్డి గారు వచ్చారు. ఆ ప్రభుత్వాల

తరువాత చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వం వచ్చింది. మమ్మల్ని ఏ ప్రభుత్వంతో పోలుస్తున్నారు. వీరు (ప్రతిపక్ష పార్టీ సభ్యులనుద్దేశించి) ఏ ప్రభుత్వ ప్రతినిధులుగా వచ్చారు, ఏ ప్రభుత్వ వారసులో తెలియడం లేదు.

(ఈ దశలో వైఎస్ఆర్.కాంగ్రెస్ పార్టీ సభ్యులు శ్రీ చెవిరెడ్డి భాస్కర రెడ్డి మాట్లాడేందుకు మైకు ఇవ్వాల్సిందిగా కోరుతూ తమ స్థానం నుండి లేచి నిలుచున్నారు. వెంటనే కూర్చున్నారు. )

వీళ్లది వైఎస్ఆర్ అంటే 'యువజన శ్రామిక రైతు పార్టీ'. ఎంతసేపు వారు యువజన శ్రామిక రైతు అని మాట్లాడమనండి. మాకు అభ్యంతరం లేదు. పాపం చనిపోయి పరలోకంలో ఉన్న రాజశేఖరరెడ్డి గారిని ప్రతీక్షణం వారి గురించి మాట్లాడడం అది సమంజసం కాదు. మాది కోనసీమ ప్రాంతమైన తూర్పుగోదావరి జిల్లా. ఎప్పుడో 10 సంవత్సరాలు క్రితం పనిచేసింది రాజశేఖర రెడ్డి గారి ప్రభుత్వం. నిన్నటివరకు ఉన్నటువంటి ప్రభుత్వ కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వం.

...

మీది (ప్రతిపక్ష సభ్యులనుద్దేశించి) పిల్ల కాంగ్రెస్ అని మీరే ఒప్పుకున్నారు చాలా సంతోషం. చంద్రబాబునాయుడిగారి ప్రభుత్వం వచ్చి 80 రోజులే అయ్యింది, ఇంకా మూడు నెలలు కూడా కాలేదు. ఈ బడ్జెట్ సెషన్‌ను చూసి, ఇక్కడ మళ్లీ మనం ఫిబ్రవరి లేదా మార్చి నెలలో మరలా సమావేశాలకు వస్తాం. ఆ సమావేశాల్లో, ఈ బడ్జెట్ సెషన్స్ తరువాత జరిగిన ప్రోగ్రెస్ గురించి మమ్మల్ని నిలదీయండి. తప్పేం లేదు. మీరు నిలదీయాలి. మీరే కాదు, అప్పటికి ప్రోగ్రెస్ లేకపోతే మేము కూడా అడుగుతాం.

మాది కోనసీమ ప్రాంతం. నేను గతంలో ఒక నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించాను. ప్రస్తుతం రాజోలు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాను. ప్రస్తుత మా నియోజవర్గంలో రోడ్లన్నీ అధ్వాన్నంగా ఉన్నాయి. ఆర్ అండ్ బి రోడ్లు అయితే చాలా తక్కువగా, మహా ఉంటే 30 నుంచి 40 కిలోమీటర్లు మాత్రమే ఉంటాయి. మిగతావన్నీ జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయతీ రోడ్లే. ఈ గ్రామాలు గానీ, పంచాయితీలు గానీ, మండలాలు గానీ, జిల్లా పరిషత్‌లు గానీ చాలా ఇబ్బందులతో ఉన్నాయి. ఆర్థికంగా రోడ్లను పోషించుకునే స్థాయిలో లేవు. అందుచేత ఈరోడ్లన్నింటినీ, ఆర్ అండ్ బి శాఖలోనికి గానీ, స్టేట్ రోడ్స్‌లోకి గానీ, నేషనల్ హైవేలోకి గానీ తీసుకునే ప్రతిపాదనలేమైనా ప్రభుత్వం వద్ద ఉన్నాయా? అని మీద్వారా గౌరవ ముఖ్యమంత్రివర్యులను అడుగుతున్నాను.

మిస్టర్ స్పీకర్ః విష్ణుకుమార్ రాజు గారు..

శ్రీ పి. విష్ణుకుమార్ రాజు (విశాఖపట్నం-నార్త్): అధ్యక్షా, ఈ డిమాండ్స్ బుక్‌లో 4లైన్ రోడ్డు ఖరారు దశలో ఉందని పేర్కొన్నారు. ఆ రోడ్డు దాదాపు 48 కి.మీ.ల పొడవుతో, అనకాపల్లి నుంచి ఆనందపురం వరకు సుమారు రూ.440 కోట్ల విలువ కలిగినది. దీనికి 2008వ సంవత్సరంలో అనాటి ముఖ్యమంత్రి డా.వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డిగారు సబ్బవరంలో శంకుస్థాపన చేశారు. అప్పటి నుండి ఇప్పటివరకూ ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఈ రోడ్డుకు ఒక సమయ నిర్దేశం చేసి, ఆ రోడ్డును పూర్తి చేయాలి. అలా చేయలేని పక్షంలో దానిని నేషనల్ హైవేస్ అథారిటీస్‌కి అప్పగిస్తే, వాళ్లు చేపడతామని చెప్పారు. ఈరోడ్డును most critical and dangerous road గా declare చేయడం జరిగింది. Accident Prone Road. సుమారు 100 మంది చనిపోతున్నారు.

అధ్యక్షా, చివరిగా అనకాపల్లి నుంచి గాజువాక, మధురవాడ, ఆనందపురం రోడ్డు, 6లేన్ రోడ్డు, నేషనల్ హైవేస్ అథారిటీ వాళ్లు, అప్పట్లో రూ.689 కోట్లతో టెండరును ట్రాన్స్‌ట్రాయ్ వాళ్లు తీసుకోవడం జరిగింది. తరువాత ఇప్పటివరకూ కాంట్రాక్టర్లు ఏ పనీ ప్రారంభించలేదు. ఇది మన రాష్ట్రానికి సంబంధం లేకపోయినా, ఈ రోడ్డు విషయమై తగు చర్యలు సత్వరమే తీసుకోవలిసిందిగా కేంద్ర ప్రభుత్వానికి విన్నవించాలని కోరుతున్నాం.

ఇంకో విషయం ఏమంటే స్టేట్ రోడ్స్‌లో రోడ్ మార్కింగ్‌లు, వైట్ పెయింట్లు, రేడియం పెయింట్లు, డైరెక్షన్ బోర్డులు, సైన్ బోర్డులు వంటివి చాలాచోట్ల లేవు. దానిమీద కూడా దృష్టి సారించవలసిందిగా కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్: వెంకటరెడ్డి గారూ..

శ్రీ జంకె వెంకట రెడ్డి(మార్కాపూర్): అధ్యక్షా, ఈనాడు మాచర్ల నుంచి మార్కాపురంకు, మార్కాపురం నుంచి ఒంగోలు, పొదిలి వరకు, రోడ్లకు చాలా గుంతలు పడడంతో, రాత్రి సమయాల్లో ప్రయాణించటానికి చాలా ఇబ్బందిగా ఉంది. ప్యాచ్‌వర్క్ చేయించాలని ప్రజలు కూడా విజ్ఞప్తి చేస్తున్నారు. ఆర్ అండ్ బి వాళ్లను అడిగితే అది నేషనల్ హైవేస్ పరిధిలోకి వెళ్లింది, మేం చేయటానికి కుదరదు అని చెబుతున్నారు. కాబట్టి ఇప్పుడు ఆ ప్యాచ్ వర్క్ చేసేట్లుగా చూడవలసిందిగా కోరుతున్నాను. ఇంతకుముందు లారీలు, బస్సుల లైట్లకు ఆఫ్ మార్జిన్‌ను బ్లాక్ కలర్ వేసేవాళ్లు. ఇప్పుడు ఆవిధంగా లేనందువలన నేరుగా లైట్ల ఫోకస్‌కి డ్రైవర్లు కూడా ఇబ్బంది పడుతున్నారు. ఈ పద్ధతిని మళ్ళీ పునరుద్ధరించవలసిందిగా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

MR. SPEAKER: Minister for R&B.

శ్రీ సిద్దా రాఘవరావు (దర్శి)ః అధ్యక్షా, గౌరవ సభ్యులు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో, కోనసీమ ప్రాంతంలో రోడ్లు బాగా లేవనీ, ఉన్నవాటిలో ఎక్కువ భాగం రోడ్లు పంచాయతీ, జిల్లా పరిషత్ రోడ్లు ఉన్నాయని, ఆర్ అండ్ బి లో లేవని చెప్పడం జరిగింది. వాటన్నిటినీ పరిశీలించి ఒక నిర్ణయం తీసుకొంటాం. అలానే, సభ్యులు శ్రీ విష్ణుకుమార్ రాజుగారు అడిగిన అనకాపల్లి నుంచి విశాఖపట్టణం రోడ్డు పనులు, రూ.440 కోట్లతో జరుగుతున్నాయి. అంతేకాకుండా, అక్కడ యాక్సిడెంట్లు కూడా జరుగుతున్నాయని మా దృష్టికి తీసుకొచ్చారు. తప్పకుండా మా అధికారులను పంపించి, వెంటనే పనులు పూర్తి చేసేవిధంగా చర్యలు తీసుకొంటాం.

అలాగే, గౌరవ సభ్యులు శ్రీ జంకె వెంకటరెడ్డిగారు పొదిలి నుంచి మార్కాపూర్ రోడ్డు బాగాలేదని చెప్పారు. ఆ రోడ్డు గురించి కూడా నిన్ననే ఆర్ అండ్ బి పర్యవేక్షక ఇంజనీరుకు చెప్పడం జరిగింది. వెంటనే దాన్ని కూడా పరిశీలించి, దానిమీద కూడా యాక్షన్ తీసుకొంటాం. రోడ్ల గురించి అడగటం జరిగింది. తప్పకుండా వాటిని కూడా పరిశీలించి, రవాణా శాఖతో బోర్డులు, స్పీడ్ బ్రేకర్స్, రేడియం పెయింట్లు వేయించి, త్వరలో రాష్ట్రంలో యాక్సిడెంట్లు తగ్గటానికి అన్ని విధాల చర్యలు తీసుకుంటామని సభాముఖంగా తెలియజేస్తున్నాను.

(సభ్యులు శ్రీ గద్దె రామ్మోహన్‌గారు మైకు ఇవ్వమని గౌరవ సభాపతిని కోరడమైనది)

శ్రీ గద్దె రామ్మోహన్ (విజయవాడ-ఈస్ట్)ః అధ్యక్షా, విద్యుత్ సంస్కరణల్లో భాగంగా ఆనాడు ట్రాన్స్‌కో, జెన్‌కోతోపాటు 4 డిస్కం కంపెనీలను కూడా పెట్టడం జరిగింది. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు రెండు వచ్చాయి. ఒకటి విశాఖపట్టణం కేంద్రంగా శ్రీకాకుళం, విజయనగం, విశాఖపట్టణం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, మొత్తం ఐదు జిల్లాలు. అదేవిధంగా తిరుపతి కేంద్రంగా 8 జిల్లాలున్నాయి. కాబట్టి, ఈ రెండు డిస్కంలను, మూడు డిస్కంలుగా చేసి, ఒక్కో డిస్కం పరిధిలో 4 లేదా 5 జిల్లాలుండేట్లుగా చేయగలిగితే పరిపాలనాపరంగా కొంత సులభమవుతుంది. దీనిని ప్రభుత్వం ఒకసారి పరిశీలించవలసిందిగా కోరుతున్నాను.

MR. SPEAKER: Minister for Energy.

శ్రీ పల్లె రఘునాథరెడ్డి (పుట్టపరి)ః అధ్యక్షా, గౌరవ సభ్యులు గిరిజన గ్రామాలను ఎప్పటిలోగా ఎలక్ట్రిఫికేషన్ చేస్తారు అని అడగటం జరిగింది. ఈ రాష్ట్ర ప్రభుత్వం 2,551 గ్రామాలను 2016వ సంవత్సరం మార్చి నెల లోపల ఎలక్ట్రిఫికేషన్ చేయాలని నిర్ణయం తీసుకున్నాం. దానిలో భాగంగా, గిరిజన గ్రామాలన్నిటికీ విద్యుదీకరణ చేస్తాం. సోలార్ కనెక్టివిటీ, కన్వెన్షన్ కనెక్టివిటీని ఉపయోగించి వాటినిభర్తీ చేస్తాం. అదే విధంగా గౌరవ సభ్యులు

శ్రీ గద్దె రామ్మోహన్ చెప్పిన విషయమై, మూడవ డిస్కంను విజయవాడ వద్ద ఏర్పాటు చేయడానికి సాధ్యాసాధ్యాల గురించి పరిశీలిస్తున్నాం. థాంక్యూ సర్.

**MR. SPEAKER: Now, the question is:**

**"That the Government be granted a sum not exceeding Rs.2683,93,37,000/- under Demand No. XI (11)- Roads, Buildings and Ports."**

**"That the Government be granted a sum not exceeding Rs. 7163,77,78,000/- under Demand No. XXXV (35)- Energy."**

**(Pause)**

**The Motion was adopted and the Demands were granted.**

**MR.SPEAKER: The House is adjourned to meet again at 9-00 AM on Tuesday, the 2nd of September 2014.**

**(Then the House adjourned at 2.08 to meet again at 9.00 AM on Tuesday, the 2nd of September 2014).**